మూగవాని పిల్లనగ్రోవి

డా.కేశవరెడ్డి

మూగవాని పిల్లనగ్రోవి

డా॥ కేశవరెడ్డి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

ధర : రూ. ~~60/-~~
మొదటి ముద్రణ : 'ఆంధ్రజ్యోతి' చిత్రవారపత్రిక
రీతిక పబ్లికేషన్స్, 1993,
HBT మొదటి ముద్రణ : అక్టోబర్, 2008
ముఖ చిత్రం : కాళ్ళ
పేజ్ సెట్టింగ్ : విజయ్
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85,
బాలాజీ నగర్,
హైదరాబాద్ - 500 067,
ఫోన్ 040 - 2352 1849.

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్‌వ్యూ,
126 శాంతినగర్,
హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 23304194

చెప్పకుండా చాలా స్పష్టంగా చెప్పింది

'మూ'గవాని పిల్లనగ్రోవి' ఒక రైతు మరణ, పునరుత్థానాల గాథ. ఆ రైతు ప్రయత్నం నుంచి వైఫల్యానికీ, వైఫల్యం నుంచి అభద్రతా భావనకీ, అభద్రత నుండి ఉన్మాదానికీ, ఉన్మాదం నుండి మరణానికీ నడిచిన కథ. తన మరణంలో ప్రాణత్యాగం చేసిన తీరు వల్ల కర్మవీరుడై, అమరుడయి, పురాణ పురుషుడైన కథ.

డా॥ కేశవరెడ్డి ఈ కథ ఇతివృత్తం ఎంచుకోవడంలో, కథని చెప్పిన తీరులో అసమాన కౌశల్యాన్ని ప్రదర్శించారు. ఈ కథలో కూడా పురాతన ఆసియా కథన సంప్రదాయాన్ని, ఆదిమ జాతుల విశ్వాస ధోరణిలో చెప్పే నేర్పు వల్ల ఇంతదాకా తెలుగు సాహిత్యంలో మనం వినివుండని అపూర్వ కథనాన్ని ప్రదర్శించారు.

ఈ ఇతివృత్తం దాదాపు ఇరవయ్యేళ్ళ కిందటే ఆయన రాసిన 'స్మశానం దున్నేరు' నవలలో మొదటిసారిగా మనకు వినిపిస్తుంది. ప్రధాన కథతో సంబంధం లేకుండా ఆ నవలలో ప్రసంగవశాత్తూ

తారసపడే ఈ విచిత్ర యితివృత్తం రెండు దశాబ్దాలుగా రచయితను ఎంత ఒత్తిడి చేస్తూ ఉండకపోతే ఇటువంటి కథగా రూపొందుతుంది!

ఈ నవల, లేదా ఈ పెద్ద కథలో సంఘటన క్రమం చాలా స్పష్టం. అయినప్పటికీ ఒక్కసారి చదవగానే అర్థమయ్యే కథలా అనిపించదు. ఒక మధ్య యుగాల మత గ్రంథంలోని గాథలా కనిపిస్తుంది. కాని నిశితంగా చదివి దీర్ఘంగా ఆలోచించిన మీదట పైకి పుక్కిటి పురాణంలా కనిపించే ఈ కథలో సమకాలీన సాంఘిక ఆర్థిక శక్తులపట్ల ఎంతో శాస్త్రీయమైన అవగాహన నిదానంగా బోధపడుతుంది.

ప్రఖ్యాత సాంఘిక శాస్త్రజ్ఞుడు ఎమెలి డర్క్‌హైంర్కెహామ్ మతమంటే ప్రపంచాన్ని స్థూలంగా వ్యాఖ్యానించే ప్రయత్నమనే, ఆ ప్రయత్నం మరింత నిశితంగా సంక్లిష్టతలలోకి పోయి చూడగలిగినప్పుడే సైన్స్ అవుతుందనీ రాస్తాడు తన 'ది ఎలిమెంటరీ ఫార్మ్స్ ఆఫ్ ది రెలిజియస్ లైఫ్' అన్న గ్రంథంలో. అలా చూసినట్లయితే, శాస్త్రీయ సిద్ధాంతాలు ప్రాతిపదికగా ప్రపంచాన్ని స్థూలంగా వ్యాఖ్యానించడంతో సరిపెట్టుకొనే రచయితల నడుమ పైకి మత విశ్వాసం లాగా కన్పించే కథలో జీవిత సంక్లిష్టతలని లోపలకీ ఆవిష్కరించే ప్రయత్నం చేసిన డా॥ కేశవరెడ్డి ఎంతో సాహసవంతుడిగా కన్పిస్తాడు.

'మూగవాని పిల్లన గ్రోవి', 'అతడు అడివిని జయించాడు' లాగానే ఒక వీరగాథ. అయితే ఇది ఒట్టి వీరగాథగా ఆగిపోలేదు. ఆ వీరగాథ (legend) ఒక పురాణ ప్రతీక (myth)గా కూడా రూపొందింది ఇక్కడ. ఇక్కడ రచయిత పురాణ ప్రతీకని ఇవ్వడంతో తన పని ముగించినట్లు కనబడినా అది నిజం కాదు. అటువంటి పౌరాణిక ముగింపు (mythological summation)

ఇవ్వడంతోనే అతను మనల్ని వేధించడం మొదలు పెడుతున్నాడు. ఎందుకు ఈ కథ ఇలా ముగిసింది? ఈ కథకు యథార్థమయిన ముగింపు ఇదేనా? ఇటువంటి పర్యవసానానికి కారణాలు ఎటువంటివి? ఇటువంటి ప్రశ్నల పరంపరతో మనం ఆలోచనాపరులం కావడంలోనే రచయిత నిజమయిన విజయం ఉంది. బీదవాళ్ళు భూస్వాములపై తిరగబడ్డారని ఎవరయినా రచయిత ఒక నవలని ముగిస్తే, ఆ ముగింపు మనని ఊరడిస్తుంది. మత గురువుల పరలోకం గురించిన ప్రబోధాల వలె. ఆ ముగింపు మనకి ఇచ్చేది జాగృతి కాదు. విశ్రాంతి, అటువంటి రచన చదివిన తర్వాత మనకెటువంటి అలజడి కలగదు. ఏ ప్రశ్నలూ రేకెత్తవు.

కాని ఎంతో ప్రశాంతంగా, దివ్యంగా కనిపించే ఈ రచనలోని ముగింపు మనని ఎంతో అశాంత పరుస్తుంది. కథలో మణియం వలె మనం కూడా కారణాల అన్వేషణ మొదలుపెడతాం. ఎవరికి తోచిన కారణాలు వాళ్ళు చెప్పడంతో చర్చ మొదలవుతుంది. ఇటువంటి చర్చ నుండి ఒక సామాజిక జాగృతి పొటమరిస్తుంది.

అటువంటి చర్చకు ప్రారంభంగా నాకు తోచిన కారణాలు ఇక్కడ స్థూలంగా మనవి చెయ్యడానికి ప్రయత్నిస్తాను.

'మూగవాని పిల్లనగ్రోవి'లో మూడు అంశాలున్నాయి. ఒకటి బక్కిరెడ్డికీ అతని తండ్రికీ మధ్య అనుబంధం. రెండవది బక్కిరెడ్డికీ అతని తండ్రికీ కూడా వారి భూమితో ఉన్న అనుబంధం, అది చివరికి బక్కిరెడ్డి ఉన్మాదభరిత ప్రాణత్యాగానికి పరిణమించడం, మూడవది బక్కిరెడ్డి మరణం మొదట ఒక జాలి కబురుగా, ఆ పై క్రమంగా ఒక వీరగాథగా, చివరికి పంచభూతాలు అతనికి అనుగ్రహించిన వరప్రదానంగా ఇదంతా ఒక స్థల పురాణంగా రూపొందడం.

ఇటువంటి లెజెండరీ సంప్రదాయంలోనే గురజాడ 'పూర్ణమ్మ', 'కన్యక' కవితలు రాసాడు. ఇటువంటి సంప్రదాయం స్పష్టంగా కనబడకపోయినా కాళీపట్నం మాష్టారి 'యజ్ఞం' కథ ఈ తీరునే నడిచింది. ఇటువంటి రచనల్లో రాజకీయ సమస్య, ఆర్థిక సమస్య. సాంఘిక సమస్య అన్ని రకాల అత్మిక సమస్యలూ ఒక నైతిక సమస్యగా ముడిపడి ఆ నైతిక సమస్య చుట్టూతా పరిభ్రమిస్తాయి. ప్రతియుగంలోని నీతి సమస్య ఆ యుగానికి చెందిన ఆర్థిక విధానాన్ని బట్టి, ఆర్థిక విధానాలపైన ఏర్పడ్డ సాంఘిక సంబంధాల బట్టీ, ఆ ఆర్థిక విధానాల్నీ, సాంఘిక సంబంధాల్నీ నియంత్రించే రాజకీయ స్వభావాన్ని బట్టి పరిష్కరింపబడటమో, పరిష్కరింప బడక పోవడమో ఆధారపడుతుంది. ఇది మనకు సైద్ధాంతిక స్థాయిలో తెలుసు. కన్విన్స్ కాగలం.

కాని సాహిత్య రూపంలో దీన్ని చెప్పగలగడం చాలా కష్టం. అలా చెప్పడానికి ఆ రచయితకి తనదే అయిన మొదటి రకం జీవితానుభవం ఉండాలి. ఆ జీవితానుభవాన్ని అర్థం చేసుకోగలిగే శక్తి ఉండాలి. తిరిగి దాన్ని సాహిత్య రూపంలో సృజించగలిగే నేర్పు ఉండాలి. ఇది ఏ గురజాడ వంటి మహాకవికి మాత్రమే సాధ్యం కాగల ప్రజ్ఞ. అనితర సాధ్యమయిన ఈ నేర్పుని చూపి కేశరెడ్డి ఈ కథ ద్వారా నన్నాశ్చర్య పరిచాడు.

'మూగవాని పిల్లనగ్రోవి' పితృస్వామ్య సాంఘిక సంబంధాలకూ భూస్వామ్య ఆర్థిక విధానాలకూ చెందిన సమాజం మాత్రమే ఊహించగల కథ. భూస్వామ్య సమాజం అర్ధవలస సమాజంగా మారి అటు పెట్టుబడిదారీ విధానాల్నీ అనుసరించలేక ఇటు విశుద్ధ భూస్వామ్య సంబంధాల్నీ పునరుద్ధరించుకోలేక అర్ధ భూస్వామ్య (Semi - Feudal) సమాజంగానూ మనలేక ఆత్మహత్యా సదృశ జీవితానుభవం వైపు నడవడం ఈ కథలో స్పష్టంగా కనిపిస్తుంది.

మనిషి తన అస్తిత్వానికి అర్థాన్ని పశువుల్లో, భూమిలో, రాజ్యంలో మటుకే చూడగలిగినప్పుడు ఈ జీవితం తప్పకుండా అమానవీయమవుతుంది. లోయలో పశువులు పడి చనిపోయినప్పుడు ఉరి తీసుకుని చనిపోయిన పసులకాపరి గురించి 'అతడు అడివిని జయించాడు'లో ప్రస్తావన కొస్తుంది. రాజ్యాన్ని కోల్పోయినప్పుడు బాకుతో తనని తాను పొడుచుకున్న పాళెగాడు కొళందరెడ్డి, భూమిని పోగొట్టుకుని బతకలేకపోయిన బక్కిరెడ్డి ఈ కథలోనే కనిపిస్తారు. మనుషులు తమ జీవిత పరమార్థాన్ని తోటి మనుషులతో కలసి శ్రమించడంలో కాక తమ ఆస్తిపాస్తుల్లో మటుకే చూడగలిగి రావడం నిజంగా విషాదం.

అయితే రైతాంగ సమాజపు ఈ విషాద పరిస్థితి అకస్మాత్తుగా వచ్చింది కాదు. రైతు తనని తాను చంపుకోవాల్సిన పరిస్థితికి వచ్చేముందు తన తోటి మనుషుల్నీ, తన మీద ఆధారపడ్డ మనుషుల్నీ ఎట్లా నిర్మూలిస్తూ వచ్చేదో "చివరి గుడిసె'లో కన్పిస్తుంది. తను తనసాటి మనిషితో సాంఘికంగా విడిపోవడమే రైతు తాలూకు మొదటి మరణం. భూమితో తాను పొందిన తాదాత్మ్యం వల్ల 'స్థావర జంగమాత్మకమైన' తన చుట్టూ ప్రపంచానికీ, తన మనుషులకీ అతనెంత పరాయివాడయి పోయాడో అయిదవ అధ్యాయంలోని బక్కిరెడ్డి అంతర్మథనమే ప్రత్యక్ష వ్యాఖ్యానం.

ఈ మాటలే ఒక సాంఘిక శాస్త్రవేత్త కూడా ఇలా ధృవీకరిస్తున్నాడు. "ఏ రైతు కుటుంబం అయినా భూమిని ఒదులు కోవాల్సి రావడమంటే అత్యంత అయిష్టంతో చేసే పనిగా భావిస్తుంది. ఏమంటే భూమిని ఒదులుకోవడమంటే అది తన బృహత్ భద్రతా భావాన్నీ, తోటి సంఘంలో గౌరవానికి నోచుకునే అవకాశాన్నీ ఒదులుకోవడమే" (పీజంట్స్ ఇన్ ది మోడర్న్ వరల్డ్, యూనివర్శిటీ

ఆఫ్ న్యూ మెక్సికో ప్రెస్, 1969 (భూమిని ఒదులుకోవడమంటే శ్రామికుడిగా బతకవలసి రావడం.) తన ఇంట్లో, తన స్థలంలో కాక ఎదుటివాడి యింట్లో, ఎదుటి వాడి స్థలంలో కాయకష్టం చేయవలసి రావడం. కనుకనే 'కాయకష్టం చేసే అవసరం కలగకపోవడమే భూస్వామ్య సమాజంలో అత్యున్నత గౌరవానికి కొలమానం. తను భూమిని పోగొట్టుకున్నాడని గ్రహించగానే బక్కిరెడ్డికి ముందు తనో గబ్బిలంలాగా అన్పించాడు. కాని తర్వాత మరింత ఆలోచించి గబ్బిలానికున్న జీవితేచ్ఛ కూడా తనకు లేదనుకున్నాడు. భూమి లేకపోవడమంటే తనో 'దొమ్మరి' కావడం. 'పిచ్చగుంటోడు' కావడం. 'నాడోడు' కావడం. రెక్కల శ్రమ అమ్ముకుని బతికే మనుష్య సంఘాల్ని గబ్బిలాలకన్నా హీనంగా భావించినప్పుడే రైతు పూర్తిగా మరణించాడు.

అయితే రైతు వీరమరణం కథేమిటి? ఇది కూడా అర్ధ భూస్వామ్య భావజాలం నుంచి రాగల సహజ ప్రతిస్పందనే. మామూలుగా ఒక మనిషికి అన్యాయం జరిగిందన్నప్పుడు, అతడు సాంఘికంగా ఆర్థికంగా పతనమయ్యాడన్నప్పుడు, బలం, చేవ ఉన్న ఏ సమాజమయినా శత్రువును గుర్తించే ప్రయత్నం చేస్తుంది. కానీ ఇక్కడ శత్రువు ఎవ్వరూ లేరు.

తను అర్థం చేసుకోలేనిదయినా, బాధాకరమైన ఈ విపత్తు ఒక వ్యక్తికి సంభవించిందే అయినా, ఊరు వూరంతా దిగాలు పడుతుంది. బక్కిరెడ్డి బాధతో మమేకమవుతుంది.

ఇది ఒక రకంగా విశుద్ధ భూస్వామ్య సంస్కృతి విలువ. కానీ ఆ రైతు బావి తవ్వేటప్పుడో, నష్టపోయినప్పుడో ఏకం కాలేని గ్రామం అతను పతనం చెందాక ఏకం కావడంలోనే దాని దివాళాకోరుతనమంతా కనిపిస్తుంది. రైతు బావి తవ్వి, మోటారు బిగించి వ్యాపార పంటలు వేసి పెట్టుబడిదారుడిగా మారినట్లయితే

అప్పుడు ఊరు ప్రతిస్పందించే తీరు వేరేవిధంగా వుండేది. కాని ఈ కథలో వేలం వెయ్యబడ్డ బక్కిరెడ్డి భూమి బంజరుగా ఒదిలిపెట్టబడటం గమనించాలి. ఇది అర్ధ భూస్వామ్య సమాజ లక్షణం. ఇటువంటి అర్ధభూస్వామ్య వ్యవస్థ ఎకాఎకి పెట్టుబడిదారీ వ్యవస్థగా మారడం అసంభవంగా కాగా, చిన్ని చిన్ని వ్యవసాయక వ్యవస్థలు విశాల జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ వ్యవస్థల్లో విలీనమయ్యే పరిణామక్రమంలో కొద్ది మంది భూస్వాములు పెట్టుబడిదారులుగా మారడానికి అత్యధికులు రైతు కూలీలుగా మారవలసి వస్తుంది. ఈ రైతు కూలీగా మారడం రైతాంగ సంస్కృతికి మరణ సదృశ్యమే. 1950లో జరిగినట్టు చెప్పబడిన ఈ రైతుమరణం ఇంకా మనదేశంలో సంభవిస్తూనే ఉంది. ఇంకా చెప్పాలంటే హరిత విప్లవానంతరం ఇది మరింత తీవ్రమయింది. ఆ విధంగా రైతు మరణించిన ప్రతి చోటా ఇటువంటి సానుభూతి పురాణాలే ప్రభవిస్తున్నాయి. ఒకటో అరో ఎక్కడయినా రైతుమరణం రైతాంగ పోరాటానికి దారి తీసినా ఆ పోరాట విధానాల్లోనూ అవే పౌరాణిక విశ్వాసాలు.

అయినప్పటికీ రైతుమరణంలో, ప్రజావిశ్వాసంలో తిరిగి అతను పొందిన పునరుత్థానంలో ఒక అజేయమైన వీరగాథ, అది ఎంత పౌరాణిక మనిపించినా సరే ఉన్నది. ఈ వీరగాథ ఆదిమకాలం నుంచి వికసిస్తూ ఉన్నదే.

టాయన్బీ రాస్తున్నాడు, "ప్రతి ఏటా సస్యాలు బీజాల రూపంలో భూమిలో మరణించి తిరిగి మొలకెత్తడమనేది మానవత్వారోపణ చెంది క్రతువులుగా, పురాణ ప్రతీకలుగా రూపొందడం వ్యవసాయం ఎంత సాధారణమో అంత సాధారణంగా విస్తరించింది" (ఎ స్టడీ ఆఫ్ హిస్టరీ, 1985, పే. 260).

రైతు మరణించాడు. సందేహం లేదు. అతని ప్రాణత్యాగం ఒక రకంగా కీర్తింపదగిందే కాని ఇది వైయక్తికం. ఉన్మాదభరితం. అలాగాక ఆ రైతు తన అనుభవాన్ని తన సాటి మనుషుల అనుభవంగా మార్చగలిగి ఉంటే, వారి కోసం, వారితో కలిసి శ్రమించే అవకాశం కోసం జీవించి ఉంటే ఆ జీవితం మరింత ప్రశంసనీయంగా ఉండి ఉండేది. చెప్పకుండా కేశరెడ్డి చాలా స్పష్టంగా ఈ కథలో చెప్పింది ఇదే అనుకుంటాను.

- వాడ్రేవు చినవీరభద్రుడు

హైదరాబాదు

8-6-1996

1

మా ఊరిపేరు ఒంటిల్లు. పేరుకు ఒంటిల్లేగాని దాదాపు ఐదు వందల గడపలుంటాయి. చిత్తూరు కడప రాష్ట్ర రహదారి మీద ముప్పై నాలుగో కిలోమీటరు వద్ద రోడ్డుకు తూర్పువైపున ఉందా గ్రామం. ఊరికి తూర్పు వైపున ఒక పర్వత పంక్తి ఉంది. కనుక ఆ ఊళ్లోకి ప్రవేశించడానికి మిగిలిన మూడు వైపుల నుండి మూడు దారులున్నాయి. మీరు గనుక దక్షిణ దిక్కు నుండి ఊళ్లోకి ప్రవేశిస్తే మీకో వింత కనిపిస్తుంది. దారి పక్కన ఊరి మొగదల ఒక పెద్ద గుండు కనిపిస్తుంది. దాదాపు ఇరవై అడుగుల ఎత్తు ఉండే ఆ గుండు నిలబెట్టి ఉన్న కోడి గుడ్డు ఆకారంలో ఉంటుంది. గుండుకు ఎరుపు రంగులోనూ, తెలుపు రంగులోను పెద్ద నామం దిద్ది ఉంటుంది. ప్రతి దినమూ ఉదయం పూట పూజారి ఆ గుండుకు పూజ చేస్తూ కనిపిస్తాడు. గుండుకు పూజ చేయటమేమిటని మీరు ఆశ్చర్యపోతారు. పూజారిని గాని, అక్కడ, చేరి ఉన్న భక్తులను గాని అడిగితే వారు ఇలా వివరిస్తారు.

"రామాయణ కాలంలో రామరావణ యుద్ధం జరిగింది. యుద్ధంలో లచ్చన్న సావి మూర్ఛబోయినాడు. అప్పుడు

ఆంజినేయల్సావి సంజీవి కొండ నెత్తుకోనొచ్చినాడు. సంజీవి కొండంటే అది నటపటవైన కొండ గాదు. అట్ట నాలుగు యోజినాలు, ఇట్ట నాలుగు యోజినాలు ఉండాది. దాని మీద ఎలులు, పులులు, సిరతలు, సిమ్మాలు తిరగతా ఉండాయి. అట్టాటి కొండను బుజమ్మీద పెట్టుకుని సావి ఆకాశంలో ఎగిరి వస్తా ఉండాడు. ఎగరంగెగరంగ సావికి బరువు తుకమించి పోయింది. ఇక తాళలేక ఊరికాడ ఆగి, ఈ గుండు మీద కాలి బొటనవేలు ఊనుకుని గెడిసేపు గస దీర్చుకున్నాడు. సావి కాలుమోపిన గుండు దేవస్తలవైపోయింది. లచ్చనసావికే గాదు. రావులోరికి గూడా ఎన్నోసార్లు సావు తప్పించాడు ఆంజినేయులు. రావుడు లేకపోయినా రామాయణం ఉంటాది గాని, ఆంజినేయులు లేకపోతే రామాయణం యాడిది? ఇంతరాజ్జి ఉండగా సావి ఊడనేకాలు మోపినాడంటే మా ఊరు జేసుకున్న పుణ్యం అని జెప్పాల. ఆ సావి ఈడ కొలువై ఉండి, ఉరు సుట్టూ వాలం పెంచుకుని, మమ్మల్ని కాలిగోరు మొక్కబోకుండా కాపాడతా ఉండాడు.

2

మీరు గనక ఉత్తర దిక్కు నుంచి ఊర్లోకి ప్రవేశిస్తే మీకు మరో వింత కనిపిస్తుంది. చెరువు కట్ట మీద ఒక గుడి కనిపిస్తుంది. గుడి చాలా చిన్నది. పక్కన నిలబడితే అది మీ నడుమెత్తు గూడ ఉండదు. గుడికి ధ్వజస్తంభము, గాలి గోపురము వగైరాలుండవు. రాళ్ళతోను, బండలతోను ఆ గుడి నిర్మించి ఉంది. గుడిలోపల కొయ్యతో చేసిన స్త్రీ మూర్తి ఉంటుంది. ఆ బొమ్మకు పసుపు కుంకుమలు పెట్టి ఉండటం కనిపిస్తుంది. చెరువు కట్టమీద గుడి ఉండటమేమిటని మీరు ఆశ్చర్యపోతారు. చెరువులో చేపలు

పడుతున్న మనిషిని గాని, కట్ట కింద పుట్టగొడుగులు తవ్వుతున్న మనిషినిగాని అడిగితే వాళ్ళు ఇలా వివరిస్తారు :

"ఇది సినమ్మ గుడి. రెండు తరాల క్రితం ఈ పాయకుట్టనంతా ఒకపాళెగాడు. ఆ పాళెగాని కడుగుట్టు కూతురు సినమ్మ. ఈ చెరువును తవ్వించింది. గూడా ఆ పాళెగాడే. చెరువు తవ్విన వేళా విశేషం ఎట్టాటిదో గాని, చెరువునిండి మొరవకాడికి నీళ్ళు రాగానే చెరువు కట్ట గెండిపడిపోయింది. నీళ్ళు ఒక సుక్కలేకుండా ఐపోయింది. పాళెగాడు వొడ్డెరోళ్ళను పెట్టి మళ్ళీ కట్టపోయించినాడు. మళ్ళీ గెండిపడి పోయింది. ఇట్ట కట్టపోయడం, అది గెండి పడిపోవడం, ఇట్లనే కొన్ని ఏండ్లు జరిగి పోయినాయి. చెరువు కింద బూవుల్లో పైరెక్కింది లేదు. ఏవి కారణంగా ఈ కట్ట గెండి పడతా ఉండాదనేది వొడ్డెరోళ్ళకూ గోచిరానికి రాలా. పాళెగానికీ గోచిరానికి రాలా.

ఒక సుక్కారం పాళెగాడు బాట గంగమ్మకు పూజ పెట్టి ప్రశ్న అడిగినాడు. 'తల్లీ నేను తవ్వించిన చెరువు ఏవిటి గిట్ట గెండి పడిపోతూ ఉంది? నా దోసవేవి? నా పాతకవేవి అనడిగాడు. గంగమ్మ పూజారిమీద పూని "బాలా". నీ దోస వేందనీ, నీ పాతకవేందనీ సెప్పేదానిగ్గాదు నేనీడుండేది. కట్ట నిలవాలంటే నువ్వు జెయ్యాల్సిన పని చెప్తాను. పెండ్లి కాని ఒక ఆడకూతుర్ని దెచ్చి బతికుండగానే ఆగెండిలో కూసోబెట్టి మన్నుతోసెయ్. కట్ట నిలుస్తుంది." అన్జెప్పింది. ఆ మాటినంగానే పాళెగానికి నెమ్ములిరిగి పోయి నాయి. ముసిల్దో, ముతకదో ఐతే యట్టన్నా చెయ్యొచ్చు. పెండ్లిగాని పిల్లను అందులోనూ పానాల్తో ఉండేదాన్ని గెండిలో పూడ్చెయ్యడం ఎంత పాతకం. ఆయన ఈ రాజ్జానికి పాళెగాడు. పలానోని కూతుర్ని తీసుకొచ్చి గెండిలో ఎయ్యండ్రా అంటే ఏసేస్తారు. ఎంతో సేపు పట్టదు. మల్ల ఆ పాపం ఈడేరేదెప్పుడు?

ఇట్టజూస్తే చెరువు. కింద బూవులు ఎండిపోయి జనం అగోరిస్తా ఉండారు.

ఏవి జేతురా భగవంతుడా అన్జెప్పి పాళెగాడు ముసుగుదన్ని, ఏసిన పడకెత్తకుండా పడుకున్నాడు. ఎయ్యి పుట్ల జరవొచ్చేసింది. మనోవ్యాధి పట్టుకునింది.

అప్పుడు ఆయన కడగొట్టు కూతురు – సినమ్మ – పెండ్లీడు కొచ్చిన బిడ్డ తండ్రి దగ్గిరకొచ్చి "తండ్రీ నువ్వు దిగులు పడేదేవిటికి? రాజ్యంలో జనం నీళ్ళులేక అగోరిస్తా ఉంటే పాళెగాడు ఇట్ల ముసుగు పెట్టిపడుకోవటం న్యాయవా? నువ్వు నీ జనాన్ని సాకేటోనివా? సంపేటోనివా? లెయ్. బాట గంగమ్మ చెప్పిన ప్రకారం చెయ్యి. నన్ను దీసకపోయి గెండిలో పూడ్చి పెట్టు. నాకు అడ్డు చెప్పొద్దు. నేను గెండిలో కూసునే దానికే మనసు జేసుకున్నా. దానిగ్గా వలసినేర్పాట్లు సూడు." అన్జెప్పింది. పాళెగాని దుఃఖం చెప్పేదానిగ్గాదు. కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యాల్సిన బిడ్డను, బతికుండగానే పూడ్చి పెట్టాలంటే కన్నోనికి మనసొచ్చునా? ఐతే గంగమ్మ మాటకు యట్ట తిరుగులేదో, అట్ట సినమ్మ మాటకు కూడా తిరుగులేదు. ఆమె మొండి పట్టు పట్టింది. సరే తండ్రి ఏడ్చినాడు మొత్తుకున్నాడు. అంతా అయింది. బాపనాయన మూర్తం పెట్టినాడు. సినమ్మ తలంటి స్నానం చేసింది. పట్టుకోక కట్టింది. పట్టు రైక తొడిగింది. వొంటినిండా నగలు పెట్టుకునింది. పెండ్లి కూతురు యట్ట బయల్దేరుతుందో అట్ట బయల్దేరింది. ఏనుగు మీద అంబారి గుట్టించి, అంబార్లో కూసుని బయల్దేరింది.

ముందర మంగలోల్లు నాద స్వరము, డోలు వాయిస్తా నడిసినారు. వెనక ముత్తయిదువలు గంగాలాల్లో పసుపు కుంకుమలు పెట్టుకుని నడిసినారు. ఆమె అట్ల పోతా ఉంటే జనం

కంటికి మంటికి ఒగిటిగా ఏడ్చినారు. చిన్నమ్మ నేరుగా పోయి చెరువు కట్ట దగ్గర అంబారీ దిగింది. గెండిలో కూసుని మన్నుతోసెయ్యమని వొడ్డెరోళ్ళకు చెప్పింది. బాసింపట్టు ఏసుకుని కండ్లు మూసుకుని దండం పెట్టుకుని కూసునుంది. వొడ్డెరోళ్ళు తలా ఒక పార దీసుకుని మన్నుతోసేసినారు. అదే సినమ్మ కండ్లకు కనపడడం, మళ్ల కనపడలా. ఆ పొద్దిట్నుంచి ఈ కట్ట ఒకసారి కూడా గెండి పడలేదు. సినమ్మ కూసుండిన తావున గుడి కట్టించినారు. ప్రతి సుక్కురారం పూజలు జరగుతాయి. సంవత్సరాని కొకసారి జాతర జరుగుతుంది.

3

మీరు గనక పడమటి దిక్కు నుంచి ఊర్లోకి ప్రవేశిస్తే మీకు ఇంకొక వింత కనిపిస్తుంది. వూరికి అర కిలోమీటరు దూరాన రోడ్డు ప్రక్కన ఒక చిట్టడవి కనిపిస్తుంది. ఆ చిట్టడవిలో మర్రి మాన్లు, రాగి మాన్లు, కానుగ చెట్లు, తుమ్మచెట్లు, బలిష్ఠమైన బోదెల తోను, శాఖోపశాఖలుగా చీలిన కొమ్మలతోను కనిపిస్తాయి. తీంత్రి తీగలు, బలసతీగెలు సంకీర్ణంగా పెనవేసుకుని ఉంటాయి. దట్టంగా గుబురుగా ఉన్న ఆ చెట్ల సముదాయాన్ని మొదటిసారిగా చూసిన వాళ్లకు కాసేపు వొళ్ళు గగుర్పొడుస్తుంది. ఐదు వందల గడపలుండే గ్రామానికి ఇంత సమీపంగా ఒక కీకారణ్యం ఉండటమేమిటని మీరు ఆశ్చర్యపోతారు. రోడ్డు ప్రక్కన పశువులను మేపుకుంటూ ఉండే పిల్లగాడిని గాని, పేడ ఏరుకుంటూ ఉండే పిల్లదానిని గాని అడగండి. వాళ్ళు ఇలా వివరిస్తారు:

"ఓబు కాలాన అంటే ముప్పై ఏండ్ల కింద ఈ ఊర్లో బక్కిరెడ్డి అనేకాపాయన ఉండె. మారాజును సల్లటి పూట దీపం పెట్టి

తల్సుకోవాలి. ఒకరి కష్టం తిన్నోడు గాదు. ఒకర్ని కష్టపెట్టినోడు గాదు. నేలను నమ్ముకుని రెక్కల కష్టం జేసి బతుకుతా ఉండినాడు. మంచోల్లకే గదా కష్టాలొచ్చేది. ఊతకర్ర చేతి కొచ్చే టయానికి సెనేస్కుడు నెత్తిన కూర్చున్నాడు. గొంతు దాక అప్పుల పాలై పోయినాడు. నేల యాలానికొచ్చింది. పొద్దు రెండు బారలెక్కేటప్పటికి గవర్మెంటోళ్ళ జీపు ఊర్లోకొచ్చింది ...".

ప్రస్థానం

1

పొద్దు రెండు బారలెక్కేటప్పటికి జీపు గ్రామంలోకి ప్రవేశించింది. పొద్దు నాలుగు బారలెక్కేటప్పటికి అంతా అయిపోయింది. జప్తు పూర్తయిపోయింది. బక్కిరెడ్డి కయ్యలు జప్తులో అమ్ముడైపోయాయి. అందుకు సంబంధించిన పత్రాలు సిద్ధమయ్యాయి. కయ్యల అమ్మకందారుగా బక్కిరెడ్డి సంతకం చేశాడు. కొనుగోలు దారుడుగా మణియం సంతకం చేశాడు. సాక్షులుగా కరణం. మరిద్దరు గ్రామస్థులు సంతకాలు చేశారు. జప్తు నిర్వహించిన అధికారి ఇంగ్లీషులో సంతకం చేశాడు. బిళ్ళ జవాను అధికారి సంతకం కింద రెండు రబ్బరు ముద్రలు వేశాడు. అమ్మకం దారుకివ్వవలసిన కాగితం అమ్మకం దారుకు, కొనుగోలు దారుకివ్వవలసిన కాగితం కొనుగోలు దారుకు అధికారి స్వహస్తాలతో ఇచ్చాడు. ఆ కాగితాలు చుట్టగా చుట్టి ఉన్నాయి. వాటి చుట్టూ నూలు దారం కట్టి ఉంది.

బిళ్ళ జవాను రిజిస్టర్లను, ఫైళ్లను, ఇతర సామగ్రిని తీసుకెళ్ళి కచేరి ముందర నిలిచి ఉన్న జీపులో వేశాడు. అధికారి, అతని వెనక బిళ్ళ జవాను జీపులో కూర్చున్నారు. జీపు కదిలి మెల్లగా వీధి వెంబడి సాగిపోయింది.

మణియం ఒక చేత్తో కాగితపు చుట్టను పట్టుకుని, మరొక చేత్తో పంచె చెంగును ఎత్తి పట్టుకుని బయటకొచ్చాడు. కచేరి ముందర వేప చెట్టు కిందున్న గుర్రాన్నెక్కి తన భవంతి వైపు సాగిపోయాడు. కరణం చుట్ట వెలిగించి కాలుస్తూ మణియం వెళ్ళిన వైపుగా మౌనంగా నడవసాగాడు. సాక్షులిద్దరు అతన్ని మాట్లాడించడానికి ప్రయత్నిస్తూ అతని కిరువైపుల నడవసాగారు. జప్తులో పాల్గొనడానికి, జప్తును చూడడానికి వచ్చినవాళ్ళు ఒక్కొక్కరే వెళ్లిపోయారు.

అందరూ వెళ్ళి పోయాక తలారివాడు తలపాగాను తీసి కచేరి మెట్ల మీద వేసి, దాని మీద కూర్చుని బీడీ ముట్టించాడు. ఒక దాని వెంట ఒకటిగా రెండు బీడీలు కాల్చాడు. మూడో బీడీని వెలిగించి, రెండు సార్లు పీల్చి, ఆకాశంలో నడిమింటికి చేరుతున్న సూర్యుడిని కాసేపు చూసి, బీడీని ఆర్చి, చెవిలో చెక్కుకుని పైకి లేచాడు. వరండాలో ఉన్న కుర్చీలు, బల్లలను లోపలకు చేరవేశాడు. తాళం కప్పను చేతిలోకి తీసుకుని తలుపు మూయబోతూ లోపల గదిలో ఉన్న మానవాకారాన్ని చూసి మెల్లగా లోపల కొచ్చాడు.

బక్కిరెడ్డి కాగితం చుట్టను వొడిలో వేసుకుని గోడకు జారగిలబడి నిశ్చలంగా కూర్చుని ఉన్నాడు.

తలారి వాడు మసక చీకటిలో బక్కిరెడ్డి ముఖాన్ని చూస్తూ "ఏంది సావీ. ఇంగా ఈడనే ఉండావా?" అన్నాడు.

బక్కిరెడ్డి తల ఎత్తి తలారి వాడి ముఖాన్ని, అతని చేతిలో ఉన్న తాళం కప్పను చూశాడు. ఒక చేత్తో కాగితం చుట్టును పట్టుకుని, మరొక చేతిని మొదట నేలమీద, ఆ తరవాత మోకాళ్ళ మీద ఊనుకుని లేచి నిలబడ్డాడు. అతని మోకాళ్ళు, నడుము పటపటమని చప్పుడు చేశాయి. చాలాసేపటి నుండి కూర్చుని

ఉండి. ఒక్కసారిగా పైకి లేవడంతో అతని కళ్ళు బైర్లు కమ్మాయి. అతడు తూలి ముందుకు పడబోయాడు. తలారి వాడు అతనికి చేయి ఆసరా ఇచ్చి ఆపాడు. బక్కిరెడ్డి గోడను, ద్వారబంధాన్ని పట్టుకుని మెల్ల మెల్లగా నీళ్ళలో ఈదుతున్న వానివలె వరండాలోకి చేరాడు. అప్పటికి అతని కండ్లను కమ్ముకున్న చీకట్లు తొలగిపోయాయి.

కచేరి ముంగట నిర్మానుష్యంగా ఉంది. ఇందాక జరిగిన జప్తులో పాల్గొనడానికి, జప్తును చూడడానికి వచ్చిన వారు కాల్చిన బీడీలు, చుట్టలూ, వాటి మధ్య అగ్గిపుల్లలు వీధిలో ఇసుక మీద కనిపిస్తున్నాయి.

బక్కిరెడ్డి వరండా మెట్లు దిగి వీధి వెంబడి తన ఇంటి వైపు నడవసాగాడు. గుదికాళ్ళ వెనక పట్టునరాలను తెగనరికి వేసి ఉన్నట్లు అతని నడక వికృతంగా సాగుతున్నది.

అతనికభిముఖంగా వీధిలో ఒక ఆవుల మంద సాగివస్తున్నది. పశువుల కాపరి చంకకు చిక్కం తగిలించుకుని, చేతిలో వెదురు బెత్తం పట్టుకుని మంద వెనక నడచి వస్తున్నాడు. వాటికి దారి ఇవ్వడానికి బక్కిరెడ్డి వీధివారగా నిలబడ్డాడు. ఆ మందలోని ఒక ఆవు వీధి మధ్యన ఆగి ... మెడ వెనకకు తిప్పి 'అంబా' అని అరిచింది. పశుల కాపరి "ఈదిలో నిలబడి అరుస్తా ఉండావేందే నీయమ్మ. లోకానికి విచిత్రంగా నువ్వే దూడను ఈనినావా యట్ట?" అని వెదరు బెత్తంతో దాని జబ్బమీద ఒకటేశాడు. దెబ్బ తగిలిన చోట తోకతో కొట్టుకుంటూ ఆవు మళ్ళీ "అంబా!" అని అరిచింది. పశుల కాపరి "నీ దూడను ఎవరెత్తుకపోతారు? పత్తికొండ నుంచి దొంగలొచ్చి ఎత్తుకపోతారా? నడు. పొద్దెక్కి వస్తా ఉంది. నడు" అని బెత్తంతో మరి రెండు వేశాడు. ఆవు మెడను తిప్పుకుని, తోకతో జబ్బమీద కొట్టుకుంటూ, చేపరించి ఉన్న పొదుగును

ఊపుకుంటూ నడవడం ప్రారంభించింది.

ఆవుల మంద వెళ్ళిపోయాక బక్కిరెడ్డి మళ్ళీ వీధి వెంబడి వికృతంగా నడవసాగాడు. గుదికాళ్ల వెనకనే గాక, మోకాళ్ళ వెనకనున్న పట్టునరాలు గూడా తెగిపోయినట్లు అతడు నడవసాగాడు. చిరుగాలికి కొట్టుకుపోతున్న ఎండిన విస్తరాకు వలె అతడు వీధి వెంబడి సాగుతున్నాడు.

అతని ఇంటి ముందు భాగాన ఎడ్ల కొట్టం ఉన్నది. కొట్టం మూడంకణాల ఇల్లు. ఇల్లు బోద గడ్డితో కప్పి ఉంది. దానికి మూడు వైపులా మట్టి గోడలున్నాయి. నాలుగో వైపున బార్లా తెరచుకుని ఉంది. కొట్టంలో ఒక వైపున కాడెడ్లు ఉన్నాయి. అవి కట్టుగొత్తుల వద్ద పడుకుని నెమరు వేస్తున్నాయి. గాట్లో ఒక వరస వరిగడ్డి ఇంకా మిగిలి ఉంది. కొట్టంలో నాగలి, కాడిమాను, పార, పలుగు వంటి సేద్యపు పనిముట్లు ఉన్నాయి. ఆ పనిముట్ల మధ్య ఒక కుక్కి మంచం ఉంది.

బక్కిరెడ్డి గోడకు వీపుని ఆనించి మంచంపైన కూర్చున్నాడు. కాగితం చుట్టను చేతిలోకి తీసుకున్నాడు. దాని చుట్టూ ఉన్న నూలు దారం వెనకకు కుడి చేతి చూపుడు వ్రేలును జొనిపి గుంజాడు. దారం పటుక్కుమని తెగింది. అప్పుడతనికి తన తండ్రి జ్ఞాపకమొచ్చాడు.

***

మా నాయన నడుం చుట్టూ మొలతాడు ఉంది. నా కుడిచేతి చూపుడు వ్రేలును మొలతాడు వెనక జొనిపి, బలంగా గుంజాను, మొలతాడు పటుక్కుమని తెగింది. మృతదేహాన్ని తాకడం నాకదే

మొదటిసారి. మా నాయన శరీరం మంచులో తడిసిన గుండ్రాయివలె చల్లగా ఉంది. శవం చుట్టూ చేరి ఉన్న వారిని నెట్టివేస్తూ మా మామ నాకు ఒక్కొక్కటిగా సూచనలివ్వసాగాడు.

అతడు నారపోచను నాకందించాడు. నాయన పాదాలను ఒక దాని పక్కన ఒకటి ఉంచి, నారపోచతో బొటన వ్రేళ్లను ఒక్కటిగా ముడివేశాను. మా మామ నా చేతిలో అర్ధరూపాయి బిళ్లను ఉంచాడు. తెరచుకుని ఉన్న మా నాయన నోట్లో అర్ధ రూపాయి బిళ్లను వేశాను. నోరు అలా తెరచుకుని ఉండటం వల్ల అతని ముఖం చాలా దీనంగా, బేలగా ఉన్నట్లు అనిపించింది. నోరును మూయడానికి అతని గడ్డాన్ని చేత్తో పైకి తోశాను. ఆశ్చర్యం! చనిపోయాక శరీరంలోని భాగాలు అంత గట్టిగా బిగుసుకుపోతాయని నాకు అంతవరకు తెలియదు. నోరును పూర్తిగా మూయడానికి నా చేతిలోని సత్తువనంతా ఉపయోగించి గడ్డాన్ని పైకి నెట్టవలసి వచ్చింది. నోరు పూర్తిగా మూసుకున్నాక అతని ముఖం గంభీరంగా ఉన్నట్లు కాసేపు అనిపించింది. అతని కళ్ళు నిశ్చలంగా తదేకంగా వెన్నుగాడును చూస్తున్నాయి. ఆ కళ్ళు తళ తళ లాడటం లేదు. నల్లగుడ్డు పైన వెన్నుగాడు తాలూకూ నీడ ప్రతిఫలించడం లేదు. నా చేతి వేళ్ళతో ఆ కళ్ళ రెప్పలను కనుగుడ్ల మీదుగా కిందకు దించాను.

మా మామ ఒక గంపను తెచ్చి శవం తలవద్ద బోర్లించి, దాని మీద ఒక ప్రమిదెను ఉంచాడు. నేను అగ్గిపుల్లను గీచి ప్రమిదెలోని పత్తిని వెలిగించాను. తరవాత చేతులు జోడించుకుని మా నాయన పాదాల వద్ద నిలుచున్నాను.

అప్పుడు గదిలో ఏడ్పులు ప్రారంభమయ్యాయి. గదిలో ఉన్నవారు ఒకరి వెంట ఒకరు, ఒకర్ని చూసి మరొకరు. ఒకర్ని ఓదారుస్తూ మరొకరు ఏడవ సాగారు. నేను మాత్రం ఏడవలేదు.

నాయనను తీసుకుపోవడానికి పాడె తయారయ్యేదాక నా కళ్ళు అలా పొడిగానే ఉన్నాయి.

పచ్చటి వెదురు బొంగులతో పాడెను తయారు చేశారు. శవాన్ని గొంతు నుండి పాదాల దాకా తెల్లని బట్టలో చుట్టారు. బట్టతో సహా శవాన్ని పాడె మీద పడుకోబెట్టారు. వరిగడ్డితో పేనిన దారాలతో శవాన్ని పాడెకు బిగించి కట్టారు. దారాలు బిగుతుగా ఉండేందుకూ దారాల కొనలను జబ్బల సత్తువనంతా ఉపయోగించి ముడులు వేశారు. శవం మెడపైన, రొమ్ముపైన, కడుపుపైన, నడుముపైన, తొడలపైన, మోకాళ్లపైన, మడమలపైన, వరిగడ్డి దారాలు బిగుసుకున్నాయి.

అంత వరకు పొడిగా ఉండిన నా కళ్ళలో గంగసుడులు తిరుగుతూ కదలసాగింది. ఇక నాయన కదలలేడు. లేవలేడు. పొలంలోకి నడవలేడు. నాగలి మేడిని పట్టలేడు. ముల్లు గర్రను పట్టలేడు. ఇక నాయన లేడు. ఎక్కిళ్ళతో నా దవడలు అదురుతున్నాయి. గూళ్ళు కంపిస్తున్నాయి. డొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి.

2

బిక్కిరెడ్డి నూలు దారాన్ని పారవేశాడు. అమ్మకపు పత్రాన్ని వొడిలో సాపుగా ఉంచడానికి ప్రయత్నించాడు. ఆ పత్రం తనలో ఏదో మంత్ర శక్తి ఉన్నట్లు ప్రవర్తించసాగింది. పై భాగాన్ని సాపుగా ఉంచితే, కింది భాగం తనంతటదే ముడుచుకుంటూ ఉంది. కింది భాగాన్ని సాపుగా ఉంచితే పై భాగం ముడుచుకుంటూ ఉంది. చివరి కతను ఆ పత్రాన్ని ఒడిలో ఉంచుకుని, తన రెండు చేతులలోని పది వేళ్లతో అదిమిపట్టి సాపుగా ఉంచి అందులోని అంశాలను చదవసాగాడు.

విక్రయ పత్రము

ది. 20-7-1950 సరియగు శ్రావణ మాసము 29వ రోజున :-

వ్రాయించి ఇచ్చినవారు : కాదాటి బక్కిరెడ్డి, తండ్రి కాదాటి మునిసామి రెడ్డి, వయసు 60 సం॥లు. వ్యవసాయదారుడు, ఒంటిల్లు గ్రామము. చిత్తూరు జిల్లా మరియు చిత్తూరు తాలూక.

వ్రాయించుకున్న వారు : మిద్దె కుమార స్వామి రెడ్డి, తండ్రి మిద్దె దొరసామి రెడ్డి. వయసు 54 సం.లు గ్రామ మణియం, ఒంటిల్లు గ్రామము, చిత్తూరు జిల్లా మరియు చిత్తూరు తాలూక.

షెడ్యూలు : "బాటకాడ కయ్యలు" అని పిలవబడే వ్యవసాయభూమి, నంజ, 14 ఎకరాల విస్తీర్ణము. సర్వే నంబరు 179, ఒంటిల్లు గ్రామ శివారు పూతల పుట్టు ఫిర్కా. చిత్తూరు జిల్లా మరియు చిత్తూరు తాలూకా.

సరిహద్దులు :

పడమర : చిత్తూరు, కడప రోడ్డు.

ఉత్తరము : గళ్ళా నరసింహులు నాయుడు భూమి.

దక్షిణం : గొడ్డువంక

తూర్పు : పాకాల సుబ్బారెడ్డి భూమి.

"పై షెడ్యూలు ఆస్తి నా పిత్రార్జితము. దీనిని నా కుటుంబావసరాల నిమిత్తము రూ. ఇరవై నాలుగు వేలకు విక్రయించితిని. విక్రయ ప్రతి ఫలము రూ. ఇరవై నాలుగు వేలు నేను తీసుకుంటిని గాన ముట్టినవి. ఈ భూమిని నాకు గల సర్వహక్కులతో సహా ఈ రోజున నీకు స్వాధీనము చేసితిని.

ఇంతటి నుండి నీవు సదరు విక్రయ ఆస్తిపైన సంపూర్ణ హక్కు, భుక్తములు గలిగి యుండి, ఇందలి తరు జల పాషాణాది నిధి నిక్షేపములతో సహా నీ ఇష్టానుసారము పుత్ర, పౌత్ర పారంపర్యముగ దాన విక్రయాది సమస్తాధికారములు గలిగి సుఖాన అనుభవించగలవు".

విక్రయ పత్రంలోని మిగిలిన అంశాలను బక్కిరెడ్డి చదవలేకపోయాడు. అతని కనుగుడ్ల మీద కన్నీటి పొర ఏర్పడింది. ఆ కన్నీటి పొర గుండా అతనికి తన తండ్రి ముఖం కనిపించసాగింది.

***

అమ్మడంలో, కొనడంలో చేతులు మారే వస్తువుగా భూమిని మా నాయన ఎన్నడూ చూడలేదు. అతడు పద్నాలుగు ఎకరాల బాటకాడ కయ్యలను తన సంతానం లాగ, మిత్రుని లాగ, బంధువులాగ, భార్యలాగ, ఇరుగు పొరుగు లాగ భావించాడు. కయ్యలకు భౌతిక రూపమేగాక, ప్రాణము, మనస్సు, ఇంకా ఆధ్యాత్మిక చింతన కూడా ఉంటాయని అతడు భావించాడు.

మా నాయన ఒకానొక వేసవిలో చనిపోయాడు. పక్షవాతంతో రెండు సంవత్సరాలు మంచం మీదనే ఉన్నాడు. మొట్టమొదట కాళ్ళు పడిపోయాయి. కొన్నాళ్లకు చేతులు కూడా పడిపోయాయి. మరి కొన్నాళ్లకు అతని నాలుక, పెదవులు గూడా అతని స్వాధీనంలో లేకుండా పోయాయి. అప్పుడప్పుడు శ్వాసక్రియ గూడా స్తంభించిపోతుండేది.

క్రమక్రమంగా మా నాయనకు తన దేహాస్థితి క్షుణ్ణంగా అర్థమై పోయింది. తన చివరి రోజుల సమీపిస్తున్నదని తెలుసుకున్నాడు.

బంధువుల నందరినీ పిలిపించమని కోరాడు. మా బంధువుల గ్రామాలన్నీ పది పన్నెండు మైళ్లలోపుననే ఉన్నాయి. అది సేద్యపు పనులు ముమ్మరంగా లేని అదనుకావడం వల్ల కబురందగానే బంధువులందరు తరలి వచ్చారు. మా మామ కుటుంబ సమేతంగా వచ్చాడు. వచ్చిన వారందరు మంచం చుట్టూ చేరి మా నాయనను పరామర్శించారు. పరామర్శిస్తూ చీర చెంగులతోను, కండువాలతోను కళ్ళు తుడుచుకున్నారు. తన చుట్టూ ఉన్న అన్ని జతల కళ్ళ నుండి నీళ్ళు వస్తున్నా మా నాయన కళ్ళలో మాత్రం నీళ్ళు రాలేదు.

బంధువులందరు ఒక్కొక్కరే గదిలో నుండి బయటకు వెళ్ళిపోయారు. అప్పుడు మా నాయన మా మామను లోపలికి పిలవమని నాకు సైగ చేసి చెప్పాడు. మా మామ లోపలకు వచ్చి, "ఏంది?" అన్నాడు.

మా నాయన మంచం మీద వెల్లకిల పడుకుని, తల పక్కకు తిప్పుకుని ఉన్నాడు. అతని కళ్ళు మా మామ ముఖాన్నీ, నా ముఖాన్నే మార్చి మార్చి చూడసాగాయి.

మా మామ "ఏంది రమ్మంటివంట?" అన్నాడు.

మా నాయన అలాగే మమ్మల్నిద్దరినీ చూడసాగాడు. అతడు కొన్ని వందల సంగతులు, కొన్ని వేల సంగతులు చెప్పాలనుకుంటున్నాడు. అతని పెదవులు, నాలుక వికృతంగా కదులుతున్నాయి. కాని మాటలు బయటకు రావడం లేదు.

మా మామ మంచానికి చేరువగా వచ్చి "నువ్వు వొగిసేదేవిటికి? అంతా నొస్టిన రాసిన కాడికి జరుగుతుంది. అన్నీ తెల్సి వొగిసేదెందుకు?"అన్నాడు.

మా నాయన తన మనసులోని మాటను బయట పెట్టడానికి ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

మా మామ మంచం పట్టెమీద కూర్చుని, "పాళెగాడు మాదిరి బతికితివి. సుట్టుపక్కల పదూళ్ళలో దరమరాజని పేరెత్తితివి. నలుగురూ దీపం పెట్టి నీ పేరు చెప్పుకునేట్టు బతికితివి. ఏవి తక్కువయిందని నువ్వు వొగిసేది" అన్నాడు.

మా నాయన మనసులోని మాట అతని గొంతుకలో చిక్కుకుని గిలగిల కొట్టుకుంటూ ఉంది. గొంతులోని బాధ అతని కళ్లలో ప్రతిఫలిస్తూ ఉంది.

మా మామ నా వైపు చేయి చూపించి "రత్న వట్టా కొడుకును కంటివి. కొండను పిండి జేసేటోడు. నీ కన్నా పేరుగ బతికేటోడు. నువ్వు వొగిసే దేవిటికో నాకు అర్తం గాలా" అన్నాడు.

మా నాయన నా వైపు కాసేపు చూసి తల అడ్డంగా ఊపి, మళ్ళీ మా మామ వైపు చూశాడు.

మా మామ మా నాయన చేతిని తన చేతిలోకి తీసుకుని, "బాటపక్కన కయ్యలు – సరదాలట్టా కయ్యలు – సంపాదిస్తివి. ఆ కయ్యల్ను అడ్డం పెట్టు కుని నీ కొడుకు కాలు మీద కాలేసుకుని బతకతాడు. వాడికి ..." మా మామ తన వాక్యాన్ని పూర్తి చేయలేదు. ఉన్నట్టుండి మా నాన్న కళ్లు గేలానికి చిక్కుకున్న చేపలవలె గిలగిల కొట్టుకోసాగాయి. ఎక్కుపెట్టి విడిచిన అమ్ము ఆయువు పట్టులో గుచ్చుకున్నట్లు అతని ముఖం మీద కండరాలు దిక్కుకొక్కటిగ వంకరలు పోతున్నాయి. అతడు విశ్వ ప్రయత్నం చేసి గొంతు పెకలించుకుని "కయ్యలు – కయ్యలు మొక్కబోకుండా సూడాల" అన్నాడు.

మా మామ మా నాయనను పొదివి పట్టుకుని. "కయ్యల్ను వాడేవిటికి మొక్క పోగొడతాడు? వాడు గావాలంటే పాము నోట్లో ఏలు పెట్టి కయ్యల్ను కాపాడుకుంటాడు. దీన్ని గురించేనా నువ్విట్టా వొగస్తా ఉండేది?" అన్నాడు. మా నాయన "నా కట్టి యాడపోతుందో ఏవో నా పానం మాత్రం ఆ కయ్యల మీదనే ఉంటుంది. వాడు పసోడు ... " అని ఆయాసం ముంచుకు రావడంతో వాక్యాన్ని సగంలోనే ఆపేశాడు.

మా మామ కాస్త కసురుకుంటున్నట్టు "వాడు పసోడు ఏవిటికాయె. నువ్వు పాలుమారి పెండ్లి జెయ్యక పోతివి గాని, చేసి ఉంటే ఈ పాటికి బిడ్డను సంకనెత్తుకోనుండు" అని నా చేతిని పట్టి మంచం వద్దకు గుంజి "ఏవిరా బక్కా, కయ్యల్ను కాపాడుకునే దానికి నీ గుండా కాదంట్రా?" అనడిగాడు.

నా మోకాళ్ళు మంచం పట్టెకు తగిలేంత చేరువగా నిల్చుని, నాయన కళ్ళలోకి చూస్తూ, "కయ్యల్ను నేనేవిటి మొక్కబోనిస్తా. కంటికి రెప్పలు కాపాడినట్టు కాపాడుకుంటా. నేను కాపోనికి పుట్టినానా దొమ్మరోనికి పుట్టి నానా?" అన్నాను.

అప్పటికి నా వయస్సు ఎంతో నాకు తెలియదు. క్షవరం చేసుకోవడానికి మంగలి ఇంటికి పోవడం అప్పటికింకా నేను ప్రారంభించలేదు.

నేనా మాటలు నాయన కళ్ళలోకి సూటిగ చూస్తూ అన్నాను. నేనలా అనగానే మా నాయన దీర్ఘంగా, తృప్తిగా శ్వాస తీసి వదిలాడు. శ్వాస తీసినప్పుడు అతని ఎద పక్కలకు, పైకి రెండు అడ్డేళ్ళు వ్యాపించింది. తరవాత అతడు గట్టిగా కనురెప్పలను అప్పళించాడు. కళ్ళలో ఉండిన నీరంతా ఒక చుక్క మిగలకుండా

బయటకొచ్చాయి. అతడు మళ్ళీ కళ్ళు తెరిచేటప్పటికి అతని కళ్ళు శుభ్రంగా, ప్రశాంతంగా ఉన్నాయి.

ఆ రాత్రి మా నాయనకు మాట పడిపోయింది. గ్రామాల నుండి వచ్చిన బంధువులు తిరిగి వెళ్ళ లేదు. మా యిల్లు చాలా చిన్నది ఐనా వేసవి కావడం వల్ల వసతికి ఇబ్బంది కాలేదు. మా ఇంటి ముందర రెండు పెద్ద చింత చెట్లు ఉండేవి. రాత్రి పూట చింత చెట్ల కింద చాపలు పరచుకొని అందరూ పడుకునేవారు. మూడో రోజు ఉదయం తెలతెల వారుతుండగా మా నాయన చనిపోయాడు.

3

బక్కిరెడ్డి విక్రయపత్రంలోని అంశాలను ఒకటికి రెండు సార్లు చదివాడు. “ఈ భూమిని నాకుగల సర్వ హక్కులతో సహా ఈ రోజున నీకు స్వాధీనము చేసితిని”. ఆ వాక్యాన్ని అతడు తదేకంగా చూడసాగాడు. ఆ వాక్యంలోని అక్షరాలు అంతకంతకు పెద్దవవుతున్నట్టు ఒక్కొక్క అక్షరం ఒక గండశిల వలె మారుతున్నట్టు ఆ శిలల మధ్య తను కూరుకుపోతున్నట్టు అతనికి అనిపించ సాగింది. కాగితం పైన పరచి ఉన్న తన చేతులను అతడు అసంకల్పితంగా తీసివేశాడు. వెంటనే అది బిసకంపవలె ఎగిరి తనంతటదే చుట్టగా చుట్టుకుంది. నూలు దారం కోసం అతడు మంచం కింద, పైనా వెదికాడు. అది కనబడలేదు. బహుశా గాలికి కొట్టుకుపోయిందేమో. అతడు లేచి పశువుల గాట్లోంచి ఒక వరిగడ్డి పోచను తీసుకుని కాగితం చుట్ట చుట్టూ ముడివేశాడు. కాగితపు చుట్టను గోడకు ఉన్న దీగుల్లో ఉంచి, మళ్ళీ మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు. అరచేతులను

తలకింద ఉంచుకుని తదేకంగా దీగుడును చూడసాగాడు. ఆదీగుడులో దక్షిణ చీకటి చోటు చేసుకుని ఉంది. నల్లని ఆ చీకటిలో తెల్లటి కాగితపు చుట్టు కొట్టవచ్చినట్లు కనిపిస్తూ ఉంది. అతడు తల తిప్పకుండా కనురెప్పలార్చకుండా దీగుడునే చూడసాగాడు. క్రమంగా అతని దృష్టిపథం నుండి కాగితం చుట్ట తప్ప మిగిలినవన్నీ తప్పుకున్నాయి. మరి కొంతసేపటికి అతనికి కాగితపు చుట్ట బదులు వరిగడ్డి దారాలతో కట్టివేసిన తన తండ్రి కళేబరం కనిపించసాగింది.

***

మా నాయన శవాన్ని ఆపాదమస్తకం, తెల్లటి బట్టలో చుట్టి, పాడెమీద ఉంచి, వరిగడ్డి దారాలతో బిగించి కట్టారు. పాడెను ఆ వైపున ముగ్గురు, ఈ వైపున ముగ్గురు పట్టిలేపి, భుజాల మీదుంచుకున్నారు. పాడె పైకి లేస్తుండగా అక్కడ చేరి ఉన్న జనమంతా “గోవిదా గోవిందా గోవిందా” అంటూ బిగ్గరగా అరిచారు. సరిగ్గా అదే సమయంలో దప్పులు మ్రోగడం ప్రారంభించాయి. నాకు నా వెక్కిళ్ళ శబ్దం తప్ప మనుషుల అరుపులుగాని, దప్పుల మోతగాని వినిపించలేదు. మా మామ ఉగ్గలిని నా చేతికందించి, కాసేపు నా భుజం మీద తట్టి వెళ్లిపోయాడు. నేను కుడిచేత్తో ఉగ్గలి పట్టుకుని, ఎడమ చేత్తో కళ్ళు తుడుచుకుంటూ శవాహకుల వెంట నడవసాగాను. మా నాయన అంతిమ యాత్ర ప్రారంభమయింది. అది ఇంటిని కడచి, ఊరిని కడచి, ఊరి పొలిమేరను కడచి మా ‘బాటకాడ కయ్యల’ వద్ద ఆగింది.

మా కయ్యలకు దక్షిణ దిక్కుగా ఒక ఎత్తయిన బాగిమాను ఉంది. బాగిమానుకవతల ఒక యేరు ఉంది. ఆ యేరు

వర్షాకాలంలో మాత్రం నిండుగా ప్రవహిస్తుంది. మిగిలిన సమయంలో ఒక వారన సన్నటి నీటిధార సొళసొళమని చప్పుడు చేసుకుంటూ ప్రవహిస్తూ ఉంటుంది. యేరుకు, బాగిమానుకు మధ్య పోరంబోకు భూమి ఉన్నది. ఆ పోరంబోకు నేలలో రెండు బారల పొడవున ఒక గొయ్యి మా నాయన శవం కోసం సిద్ధం చేసి ఉంది.

శవవాహకులు పాడెను గోతి గట్టున దించారు. కత్తితో శవం చుట్టూ ఉన్న వరిగడ్డి దారాలను కోసివేశారు. పాడెకోసం వినియోగించిన వెదురు బొంగులను ముక్కలు ముక్కలుగా నరికివేశారు. వరిదారపు ముక్కలను, వెదురు బొంగుల ముక్కలను దాపున ఉన్న జిల్లేడు పొదలలో పారవేశారు. శవాన్ని తెల్లబట్టతో సహా గోతిలోకి దించారు. ఇద్దరు మనుషులు గోతిలోకి దిగి శవం తల దక్షిణ దిశగా ఉండేట్టుగా దానిని గోతి అడుగున ఉంచారు. అప్పుడు నేను మా మామ పురమాయించగా మూడుసార్లు దోసిలితో మట్టిని తీసి శవంమీద పోశాను. గోతి అడుగున చీకటిగా ఉండడం వల్ల శవం అస్పష్టంగా కనిపించింది. నేను వేసిన మట్టి శవం తాలూకు ఏ భాగం మీద పడిందోనేను గమనించలేదు. అక్కడ ఉన్న కొందరు పారలతోను, దోసిళ్ళతోను మట్టిని గోతిలోకి తోయడం ప్రారంభించారు. చూస్తుండగానే గొయ్యి పూడిపోయింది. మా నాయన భూస్థాపితం చేయబడ్డాడు. భూస్థాపితం చేసిన చోట రెండు బారల పొడుగున, మూరెడెత్తు మట్టిని పోశారు. ఆ మట్టి దిబ్బ మీద తులసి మొక్కను నాటారు. నేను ప్రతి రోజూ వెళ్ళి ఏట్లో నుంచి దుత్తతో నీళ్ళు తెచ్చి ఆ తులసి మొక్కకు పోస్తూ ఉండేవాడిని. రెండు రోజులకే ఆ చెట్టు నిలదొక్కుకుని కొత్త ఆకులను తొడిగింది. నేను ప్రతి రోజూ దుత్తతో నీళ్ళు పోసిన తరవాత మోకాళ్ళ మీద కూర్చుని, ఆ మొక్క కొత్తగా తొడిగిన ఆకులను, మారాకులను చూస్తుండేవాడిని.

4

బక్కిరెడ్డి అలా వెల్లకిలా పడుకుని, దీగుడువైపే చూస్తున్నాడు. తెల్లటి కాగితం చుట్ట తన తండ్రిగారి శవంలాగానూ, నల్లటి దీగుడు తన తండ్రి భూస్థాపితం చేసిన గోతిలాగానూ అతనికి అనిపించసాగింది. 'మా నాయనను రెండోసారి భూస్థాపితం చేశాను' అనుకున్నాడు.

పశువుల కొట్టం అటకలో నుండి ఒక గబ్బిలం బయటకు వచ్చింది. మంచం మీద పడుకుని ఉన్న బక్కిరెడ్డి మీద, కట్టుగొత్తుల వద్ద పడుకుని ఉన్న ఎడ్ల మీద ఆ గబ్బిలం వలయాలుగా తిరగసాగింది. అది గాలిలో అల్లిబిల్లిగా కాసేపు తిరిగి విసురుగా వెళ్ళి గోడకు ఉన్న దీగుట్లోకి చేరింది. నల్లటి గబ్బిలం దీగుట్లోకి చేరగానే తెల్లని కాగితపు చుట్ట నేలమీద పడి చప్పుడు చేసింది.

బక్కిరెడ్డి దిగ్గున లేచి కూర్చున్నాడు. అతడు గమనించలేదుగాని చాలాసేపట్నుంచి అతని శరీరం చెమటల కక్కుతున్నది. శరీరమంతా తడిసి పోయి ఉన్నది. అతనికి దాహం వేస్తున్నది. అతనికి నీళ్ళు తాగాలనిపించింది. అతడు మంచం మీద నుండి లేచి కొట్టం బయటకొచ్చాడు. వంటింటివైపు నడవసాగాడు. వంటింటిని ఆనుకుని నడవ ఉన్నది. నడవలో కందికాయల బస్తాలకు జారగిలబడి అతని భార్య కూర్చుని ఉన్నది. నోట్లో పైట చెంగును కుక్కుకుంటూ ఆమె వెక్కి వెక్కి ఏడుస్తున్నది. నలుగురు స్త్రీలు ఆమె చెంత కూర్చుని ఆమెను ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నారు.

బక్కిరెడ్డి నడవ దాటుకుని వంటింట్లోకి నడిచాడు. కడవలోని నీళ్ళను ఇత్తడి చెంబుతో ముంచుకుని గటగట తాగసాగాడు. కొన్ని నీళ్ళు నోటి అంచులవద్ద తప్పించుకుని గొంతుమీదకు జారాయి. అతడా నీటిధారలను తుడుచుకుంటూ మళ్ళీ వంగి చెంబుతో నీళ్ళు ముంచుకున్నాడు.

ఇంతలో అతని భార్య భయంకరంగా, ఎలుగెత్తి ఏడవడం ప్రారంభించింది. నడవలో కందిగింజలను ఏరుకుతింటూ ఉండిన పిల్లలకోడి మెడ రిక్కించి చూడసాగింది. బక్కిరెడ్డి భార్య పైట చెంగును నేలమీదకు జారవిడిచి, రెండు చేతులతో రొమ్ముల మీద బాదుకుంటూ, వికృతంగా ఎలుగెత్తి ఏడసాగింది. పిల్లల కోడి రెక్కలు కొట్టుకుంటూ, కొక్కరిస్తూ ఎగిరి పిట్టగోడ మీద కూర్చుని మెడ తిప్పి చూడసాగింది. బక్కిరెడ్డి భార్య నడవలో కందిగింజలపైన, కందిపొట్టుపైన దొర్లుతూ, హృదయ విదారకంగా ఏడుస్తోంది. కోడి మళ్ళీ కొక్కరిస్తూ, రెక్కలు కొట్టుకుంటూ, పిట్టగోడ మీద నుంచి ఎగిరి పొగడ చెట్టుమీద కూర్చుంది.

బక్కిరెడ్డి చెంబును నీళ్ళతో సహా కడవలోకి జారవిడిచాడు. గబగబ నడుస్తూ వంటింట్లోంచి బయటకొచ్చాడు. నడవలో తప్పు చేసినవానివలె, తప్పును ఒప్పుకుంటున్నవానివలె, శిక్షకు అంగీకరిస్తున్న వానివలె మౌనంగా, తల వంచుకుని నిల్చున్నాడు. అలా కాసేపు నిలబడి తల ఎత్తి ఆకాశంలోకి చూశాడు. రెండు చేతులలోని వేళ్ళతో తలను గీక్కున్నాడు. మెల్లగ వెనుదిరిగి, అడుగులో అడుగు వేస్తూ పశువుల కొట్టంలోకి వచ్చాడు. మంచం మీదకు వొరిగి వెల్లకిల పడుకున్నాడు. అతని గుండె ఉరుకుహరపు గోడలకేసి బాదుకుంటున్నది.

ఎంత ఆశ్చర్యం! తన భార్య ఇంత గట్టిగా, ఎలుగెత్తి ఏడవగలదని అతడెప్పుడూ అనుకోలేదు. అతడామెతో నలభై ఏండ్లుగా కాపురం చేస్తున్నాడు. ఆమె ఎన్నో కష్టనష్టాలను చవిచూసింది. కళ్ళు చింతనిప్పుల వలె ఎర్రనయి పోయేదాక ఆమె ఏడవడం అతడెరుగును. నాలుగు బారలకవతల వున్న మనిషికి కూడావినబడనంత సన్నగా వెక్కి వెక్కి ఆమె ఏడవడం అతడెరుగును. రోజుల తరబడి అన్నపానీయాలు మానెయ్యడం అతడెరుగును. వారాల తరబడి జుత్తు ముడి వెయ్యకపోవడం అతడెరుగును. కాని ఇంత భయంకరంగా, ఇంత వికృతంగా, ఇంత బిగ్గరగా ఆమె ఏడవడం ఇదే మొదటిసారి.

మంచం మీద పడుకుని ఉన్న బక్కిరెడ్డికి తన భార్య నడవలో ఏడుస్తూండడం స్పష్టంగా వినిపిస్తోంది. అతనికి తన తండ్రి చనిపోయిన తరవాత దశదినకర్మ నాటి సంఘటనలు జ్ఞాపకం రాసాగాయి.

***

మా నాయన దశదిన కర్మకు, బంధు, మిత్రులు చాలా మంది వచ్చారు. భూస్థాపితం చేసిన రోజుకంటే ఎక్కువ సంఖ్యలో వచ్చారు. ఆ దినం పొద్దు నాలుగు బారలెక్కేటప్పటికి అందరం బాటకాడ కయ్యల వద్దకు చేరుకున్నాం. అక్కడ ఆ రోజు ఎన్నో తంతులు జరిగాయి. మా ఊరి మంగలి నన్ను జిల్లేడు చెట్ల మధ్య కూర్చోబెట్టి నా తల వెంట్రుకలన్నీ తీసివేశాడు. తరవాత మా పొలంలో ఉన్న బావిలో మూడుసార్లు మునిగాను. నేను బావి మెట్లెక్కి రాగానే మా మామ కొత్త పంచె ఇచ్చి బిళ్ళగోచి పెట్టి కట్టుకోమన్నాడు. అంత వరకు నేను అడ్డపంచె మాత్రం కట్టేవాడిని. బిళ్ళగోచి పెట్టి పంచె కట్టుకోవడానికి మా మామ నాకు సహాయం చేశాడు. మా నాయనను భూస్థాపితం చేసిన దిబ్బ

దాపున ఒక పీట వేసి, దాని మీద నన్ను కూర్చోబెట్టారు. నా ముందు బ్రాహ్మణుడు కూర్చున్నాడు. అతడు ఏవేవో మంత్రాలు పఠించసాగాడు.

నేను కూర్చున్న చోటుకు ఇరవై గజాల దూరాన ఏటి నీళ్ళు సన్నగా కాలువలాగ ప్రవహిస్తున్నది. నీటిధార వెంబడి రెల్లుగడ్డి పొదలు నడుమెత్తు పెరిగి ఉన్నాయి. అక్కడక్కడ రెల్లు గడ్డి పూత పూసి ఎండకు మెరుస్తున్నది. మా అమ్మ కాలువదాపున కూర్చుని ఉన్నది. ఆమె చుట్టూ చాలా మంది ముత్తయిదువలు చేరి ఉన్నారు. అక్కడ పసుపు కుంకుమలు తీసివేసే తంతు జరుగుతున్నది.

బ్రాహ్మణుడు దర్భపోచలతో మూడు ఉంగరాలను అల్లాడు. ఆ ఉంగరాలను నా కుడిచేతి వేళ్ళకు తొడిగాడు. అన్నాన్ని ముద్దలుగా చేసి నా ముందు నేలపైన ఉంచాడు. తరవాత ఆ ముద్దలను నా చేతికిచ్చి ఎనిమిది దిక్కులకు చల్లమన్నాడు. నేను ఒక్కొక్క ముద్దను ఒక్కొక్క దిక్కుకు చల్లుతుండగా అతడు ఒక్కొక్క మంత్రాన్ని పఠించసాగాడు. నువ్వు గింజలను నా కుడిచేతి అరచేతిలో ఉంచాడు. చెంబుతో నీళ్ళు తీసుకుని ఆ నువ్వులు మామిడాకులు అమర్చిన కలశంలో పడేట్టుగా నా అరచేతి మీద నీళ్ళు పోశాడు.

అతడు చేయిస్తున్న ఈ కార్యక్రమాలను నేను యాంత్రికంగా చేస్తున్నాను. నా చూపులు మా అమ్మ మీదనే ఉన్నాయి.

మా అత్తమ్మ మా అమ్మను పొదివి పట్టుకుని ఉంది. గత పదిరోజులుగా మా అమ్మ కంటిలో తడి ఆరలేదు. నోటిలోకి నాలుగువేళ్ళు పోలేదు. ఈ పది రోజులలోనే ఆమె చిక్కి సగమయింది. ఒక ముత్తయిదువ మా అమ్మ కాలి మెట్టెలను తీసివేసింది. చేతులకున్న గాజులను తీసివేసి రాతితో ముక్కలు ముక్కలుగా పగలగొట్టింది. మెడలోని మంగళసూత్రాన్ని

చెవులకున్న కమ్మలను తీసివేసింది. అంత వరకు మా అమ్మ మౌనంగా ఏడుస్తూ ఉన్నది. తరవాత ఒక ముత్తయిదువ మా అమ్మ నుదుట కుంకుమను చెరిపివేయడానికి ప్రయత్నించింది. మా అమ్మ ఏ మాత్రం సహకరించలేదు. ఆమె తన రెండు చేతులతో నుదుటిని గట్టిగా కప్పుకున్నది. ఆ చేతులను రెక్కలను అటువైపున ఒకరు, ఇటువైపున ఒకరు పట్టుకుని గుంజసాగారు. మా అమ్మను కదలనీయకుండా మా అత్తమ్మ వెనకనుండి మరింత గట్టిగా పొదివి పట్టుకుంది. వాళ్ళంతా తనను తలొకవైపుకు గుంజుతుండగా మా అమ్మ కాళ్ళు నేలమీద తపతప కొట్టుకోసాగాయి. వాళ్ళందరూ తమ శక్తినంతా ఉపయోగించి మా అమ్మ నుదుటిమీద నుండి ఆమె చేతులను తీసివేశారు.

వెంటనే ఆ ముత్తయిదువ తన చేత్తో మా అమ్మ నుదుటి మీదున్న కుంకుమ బొట్టును తుడిచివేసింది. ఆ చేతిని కాలువనీళ్ళలో కడుగుకుంది. అప్పుడు వాళ్ళు మా అమ్మ చేతులను, రెక్కలను వదిలిపెట్టారు. మా అమ్మ నిఠారుగా కూర్చుని కాసేపు పిచ్చిదానివలె చుట్టూ కలియజూసింది. తరవాత అక్కడున్న వారందరి రక్తం గడ్డకట్టుకపోయేటంత భయంకరంగా కేకలు వేస్తూ ఏడవడం ప్రారంభించింది. రొమ్ముల మీద బాదుకుంటూ ఇసుక మీద దొర్లసాగింది. రెల్లుపొదలో ఉండిన నీటికోడి క్వాక్‌క్వాక్‌మని అరుస్తూ, రెక్కలు కొట్టుకుంటూ బయటకు దూకింది. అది అలా అరుస్తూ, ఏటి అవతల గట్టున ఉన్న తీంత్రి పొదలోకి దూరి మాయమైపోయింది.

బ్రాహ్మణుడు మంత్రపఠనం ఆపి తలతిప్పి చూశాడు. నేను పీట మీద నుండి లేవబోయాను. బ్రాహ్మణుడు నా భుజాల మీద చేతులు వేసి కూచో బెడుతూ మంత్ర పఠనం కొనసాగించాడు. అతడు తత్తరపాటుతో రెట్టించిన వేగంతో మంత్రాలు

చదవసాగాడు. ఆ మంత్రాలు నా చెవిని సోకడం లేదు. నా చెవులు, కళ్ళు అన్నీ మా అమ్మపైనే ఉన్నాయి.

5

బిక్కిరెడ్డి మంచం మీద వెల్లకిల పడుకుని ఉన్నాడు. ఎండ వేడి బాగా తగ్గింది. పశువుల కొట్టం తాలూకు నీడ పొడుగ్గా వ్యాపించి వీధికడ్డంగా పరచుకుని ఉంది. ఇంకాసేపట్లో చీకటి పడనుంది. మేతకై వెళ్ళి వుండిన పిచ్చుకలు తిరిగి వచ్చి పొగడ చెట్టు మీద కిచకిచలాడడం వినిపిస్తున్నది.

అతడు మధ్యాహ్నం నుండి ఎడ్ల కొట్టాన్నే అంటి పెట్టుకుని ఉన్నాడు.

తను ఎక్కడకు పోగలడు? రచ్చబండ వద్దకు పోగలడు. రచ్చబండ మీద తన సహకాపులతో వాతావరణం గురించి మాట్లాడగలడు. రెండు రోజుల నుంచి ఉమ్మగిస్తూ ఉంది. రేపుగాని, ఎల్లుండిగాని తొలకరి వానలు ప్రారంభం కావచ్చు. వానలు ఈశాన్యం మూల నుండి దిగవచ్చు. లేదా ఆగ్నేయం మూల నుండి దిగవచ్చు. వర్షపాతం ఎంత ఉంటుంది? నాగలి కారు నాలుగడ్డేళ్ళు దిగేంతగా పడవచ్చు. వాగులు, వంకలు పొంగిపారేట్టుగా పడవచ్చు. చెరువు తూముదాక నిండవచ్చు. లేదా మొరవ హోరుమని పారేట్టుగా నిండవచ్చు. ఇలాంటి విషయాలు చర్చించగలడు.

"కాని నేనిపుడు రైతును కాను. నేను కయ్యలను పోగొట్టుకున్నాను. చెరువు నిండినా ఒకటే. చెరువు ఎండి, చెరువు అడుగున తుమ్మచెట్లు మొలిచినా నాకు ఒకటే" అనుకున్నాడతడు.

తను ఎక్కడకు వెళ్ళగలడు? దిగువ వీధిలో ఉండే తన తోటి రైతు గంగిరెడ్డి ఇంటికి వెళ్ళగలడు. ఇంటి అరుగు మీద కూర్చుని అతనితో పైరు పచ్చలను గురించి చర్చించగలడు. ఈ అదునులో ఏ రకం వరి వేస్తే బాగుంటుంది? ఫలానా రకం వరి కర్రలు ఎంత ఎత్తు పెరుగుతాయి? వాటికి ఎలాంటి తెగుళ్ళు వస్తాయి. ఆ వరి పాలగింజ వేయడానికి ఎన్ని నెలలు పడుతుంది? పాలగింజ ముదరడానికి ఎన్ని వారాలు పడుతుంది? పంట కోసి నూర్పు చేశాక ఎకరాకు ఎన్ని పుట్లు దిగుబడి అవుతుంది? ఇలాంటి విషయాలు చర్చించగలడు.

"ఐతే నేనిప్పుడు రైతును కాను. నా కయ్యలు వేలంలో అమ్ముడై నల్లబాగులై పోయాయి. గంగిరెడ్డి సరసన కూర్చునే యోగ్యత నాకిప్పుడు లేదు' అనుకున్నా డతడు.

తను ఎక్కడికి వెళ్లగలడు? పడమటి వీధిలో ఉండే వడ్రంగి కదిరప్ప వద్దకు వెళ్లగలడు. వడ్రంగి ఇంటి వెనక ఒక జోబిడి ఉంది. ఈ జోబిడిలో రంపం , బాడిస, ఉలి, బరమ మొదలైన అతని వృత్తి పరికరాలుంటాయి. అతడా పనిముట్లతో సతమతమవుతూ, నుదిటి మీద చెమట తుడుచుకుంటూ ఉంటాడు. తాను వెళ్ళి 'కదిరప్పా, రూపు మావిటేళ లోపల నాగలి చేసియ్యాల. ఈ మొబ్బులెక్కేడి జూస్తా ఉంటే ముంగారు వానలు రేపటికో, మొన్నాటికో మొదలయ్యేట్టున్నాయి. చినుకు నేలబడగానే నాగలి కట్టాల, మళ్ళీ తేమ ఈడ్చుకునేలోగా నాలుగు సాళ్ళు దున్నెయ్యాల అనగలడు.

'కాని నేనిపుడు రైతును కాను. హరిశ్చంద్రుడు వేలంలో భార్యను అమ్ముకున్నట్టు నేను భూమిని అమ్ముకున్నాను. కొత్త నాగలి నాకు అవసరం లేదు. ఇప్పటికే ఇంట్లో ఉన్న పాత నాగలి చెదపట్టిపోయినా ఫరవాలేదు" అనుకున్నాడతడు.

తను ఎక్కడికి వెళ్లగలడు? పడమటి వీధిలోని కంసాలి ఇంటికి వెళ్ళగలడు. కంసాలి ఇంటి పక్కన చింత చెట్టుకింద కొలిమి వుంది. కంసాలి కొలిమి ముందు కూర్చుని ఉంటాడు. కాలిన ఇనుప కడ్డీని పట్టుకారతో పట్టుకుని ఇనుప దిమ్మపైన ఉంచి, సుత్తితో బాదుతుంటాడు. "ఆచారీ, ఈ మొబ్బుల్ది రిగేది చూస్తావుంటే ఇంగ రెండు మూడు దినాలలో వానలు మొదలయ్యే ట్టున్నాయి. బాపనాయన పంచాంగం చూసి అదే మాట చెప్పినాడు. చినుకు నేలమీద పడిందంటే మల్ల రెండు కాళ్లొకచోట పెట్టేదానిగ్గూడా తీరుబాటు ఉండదు. మా గొడ్లకు గొట్టిరరిగిపోయి చిగురుల్లోంచి నెత్తురు సుక్కలు సుక్కలుగా కార్తావుంది. ఒక దినం కూడా అల్సిం చెయ్యకుండా వాటికి నాడాలు కొట్టాల. ఎడ్లను ఈడికి తీసుకుని రమ్మంటావా? నువ్వే కొరముట్లు, దీసుకుని ఇంటిదాక వస్తావా?" అని అడగగలడు.

కాని నేనిప్పుడు రైతును కాను. అల్పాయువు అడిగి వచ్చిన సంతానం వలె నాకయ్యలు నాకు దక్కకుండా పోయాయి. ఎద్దులతో నాకిప్పుడు ఏ అవస రమూ లేదు. అవి ఉన్నా ఒకటే, వాటిని పెదనక్కలు నమిలి తినేసినా ఒకటే, అనుకున్నాడతడు.

దీగుడులో నుంచి గబ్బిలం బయటకు వచ్చి కాసేపు గాలిలో గిరికీలు కొట్టి మళ్ళీ వెళ్ళిపోయింది. వెల్లకిల పడుకుని ఉన్న బక్కిరెడ్డి కళ్ళు తిప్పి అటకలో అలుముకుని ఉన్న చీకటిలోకి చూడసాగాడు.

తనకిక ఎవరితోనూ పనిలేదు. తనిక ఎవరికి ముఖం చూపించలేడు. తనకీ ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేదు. స్థావరజంగమాత్మకమైన ఈ ప్రపం చంలో తను నిర్వహించవలసిన పాత్ర ఏదీ లేదు. అటకలో జీవించే గబ్బిలం వలె, చెట్టు తొర్రలో నివసించే గుడ్ల గూబవలె తనిక చీకటి జీవితం

గడపాల్సిందే. గ్రామానికి ఉత్తరాన ఉన్న తూకాల బండవలె. దక్షిణాన ఉన్న నిమ్మాల గుండువలె తను భూమికి భారంగా బతకవలసిందే. నేటి నుండి గ్రామానికి తానొక అపశకునంగా మిగిలిపోతాడు. శుభకార్యాలకు బయలుదేరినవారికి తను ఎదురువస్తే వాళ్ళు తమ ప్రయాణాలను మానుకుంటారు. గ్రామంలో ఎవరుగాని ఇక నాలుగు తరాల వరకు తమ పిల్లలకు తన పేరునుగాని, తన పేరును పోలిన పేరునుగాని పెట్టుకోరు.

అతడు పక్కకు తిరిగి పడుకున్నాడు. ఎడ్లు రెండూ కట్టుగొత్తుల వద్ద ఉన్నాయి. కర్రెద్దు నిలబడి అసహనంగా అటూ, ఇటూ చూస్తూ వుంది. పుల్లది పడుకుని నెమరు వేస్తూ వుంది. చీకటి పడడంతో జోరీగలు ఎద్దుల మీద వాలి కుట్టుతున్నాయి. ఎడ్లు అప్పుడప్పుడు మెడలను అటూ, ఇటూ విసురుతూ, తోకలతో వీపుల మీద, పక్కల మీద కొట్టుకుంటున్నాయి.

చీకటి కావడంతో పొగడచెట్టు మీద పిచ్చుకల రావిడి తగ్గింది. అవి నిద్రకు ఆయత్తమవుతున్నాయి. మిణుగురు పురుగులు పొడగ చెట్టులో అసంఖ్యా కంగా, అల్లిబిల్లిగా ఎగురుతున్నాయి.

6

కొంతసేపటికి వీధిలో కొందరు మగవాళ్ళు మాట్లాడుకుంటూ ఉండడం బక్కిరెడ్డికి వినిపించింది. ఆ గొంతుకలు క్రమక్రమంగా స్పష్టంగా వినిపి స్తుండడం బట్టి వాళ్ళు ఇటే వస్తున్నారని అతడు గ్రహించి, మంచం మీద లేచి కూర్చున్నాడు. ఒక కిరోసిన్ లాంతరు అతనివైపే వస్తున్నది. లాంతరు వెలుగులో మూడు జతల కాళ్ళు కనిపిస్తున్నాయి. వాళ్ళు ముగ్గురూ కొట్టంలోకి వచ్చారు.

వాళ్ళు అతని సాటి రైతులు. రాయపాటి గంగిరెడ్డి, గళ్లా నర్సిమ్ములు నాయుడు, పాకాల మునిరెడ్డి – ముగ్గురూ మంచ వద్దకు వచ్చారు. గంగిరెడ్డి తన చేతిలో ఉన్న లాంతరును కొట్టం దూలానికి వ్రేలాడదీసి మంచం మీద కూర్చున్నాడు. మిగిలిన ఇద్దరు మంచం పక్కన ఉన్న కొయ్య దుంగ మీద కూర్చున్నారు.

వాళ్లు నలుగురూ సహకాపులు, చిన్ననాడు నలుగురూ కలిసి వీధుల్లో ఉప్పరపట్టి ఆడేవారు. చెరువుల్లో ఈతలు కొట్టేవారు. పొరుగూర్లో నడుస్తున్న కంగుంది నాటకాలు చూసేవాళ్లు. దొంగరైలెక్కి టౌనుకు వెళ్ళి సినిమా రెండు ఆటలు చూసేవాళ్లు. వయసు వచ్చాక ఒకరి వెనుక ఒకరుగా పెండ్లిండ్లు చేసుకున్నారు. ఒకరి పెండ్లికి ఒకరు తోడు పెండ్లి కొడుకులుగా వ్యవహరించారు. పెండ్లయ్యాక ఒకరి భార్యకు ఒకరు అన్నగా, తమ్ముడుగా వ్యవహరించారు. పిల్లలు పుట్టాక ఒకరి పిల్లలకొకరు చిన్నాన్నగా, పెదనాన్నగా వ్యవహరించారు. సేద్యపు పనులలో ఒకరినొకరు సంప్రదించుకునేవారు. ఒకరి సేద్యపు పనిముట్లను ఒకరు అరువు తీసుకునేవారు. ఒకరి పంటకుప్పల వద్ద ఒకరు కావలి పడుకునేవారు.

బుద్ధి తెలిసినప్పటి నుండి వాళ్ళు ఒకరినొకరు చూడకుండా పలకరించ కుండా ఒక్కరోజు కూడా గడవలేదు.

'కాని అదంతా నిన్నటికథ. వాళ్ళిప్పుడు రైతులు రైతు మారాజులు. నేను కయ్యాల్ను పొగొట్టుకున్నాను. నేనిప్పుడు బికారిని, బిచ్చగాడిని, నాడోడిని' అనుకున్నాడు బక్కిరెడ్డి.

అతడు తన సహచరులను కన్నెత్తయినా చూడకుండా తల వంచుకుని కూర్చున్నాడు. వాళ్ళు తనని గేలిచేయడానికి వచ్చారు.

తనను ఎత్తి పొడవ డానికి వచ్చారు. వాళ్ళ పిడికిళ్ళలో బొగ్గుపొడి ఉన్నది. తను తలెత్తితే చాలు తన ముఖానికి బొగ్గుపొడి రాస్తారు. వాళ్ళ చేతులలో సున్నపు పాత్రలున్నాయి. తను తలెత్తితే చాలు తన ముఖాన సున్నపు బొట్లు పెడతారు. వాళ్ళ పిడికిళ్ళలో కారంపొడి ఉన్నది. తను తల ఎత్తితే చాలు తన కళ్ళలో కారంపొడి చల్లుతారు.

అతడు కాళ్ళను మంచం కిందకు విడిచి, అరచేతులను వొడిలో ఉంచు కుని, తల వంచుకుని కూర్చున్నాడు. నన్ను పందెంలో వొడ్డడానికి నీకెలా మనసు వచ్చిందని అడుగుతున్న ద్రౌపది ముందు ధర్మరాజునివలె, నా కొడుకును పద్మవ్యూహంలోకి ఒంటరిగా పంపడానికి నీకెలా మనసు వచ్చిం దని అడుగుతున్న అర్జునుని ముందు ధర్మరాజుని వలె అతడు తలవంచుకుని కూర్చున్నాడు.

కాని వాళ్ళేమీ అడగలేదు. ఏమీ చెప్పలేదు.ఈతరాక నీళ్ళలో మునిగి పోతున్నవాడిని చూస్తున్నట్లు అసహాయ దృక్కులతో అతనిని చూస్తూ కూర్చున్నారు.

ఎద్దులు రెండూ ఒకదాని వెనుక ఒకటిగా లేచి నిలుచున్నాయి. అవి కట్టుగొత్తుల వద్ద అసహనంగా అటూ, ఇటూ కదలసాగాయి.

నర్సిమ్ములు నాయుడు కాసేపు ఎడ్లవైపు చూసి, "గొడ్లు అట్ట ఇడుగులాడతా ఉండాయేందిరా?" అని బక్కిరెడ్డివైపు తిరిగి, ప్రొద్దుట్నుంచి వాటికి నీళ్ళు తాపినావా లేదా? అన్నాడు.

గంగిరెడ్డి, "చూస్తాఉంటే తెలవటం లేదా? వాటి డొక్కలు లోపలకు ఈడ్చుకుపోయి ఉండాయి. మల్లా అడిగే దేవి(విటికి? నువ్వే వాటిని పట్టక పోయి నీళ్ళు తాపుకొని రాపో" అన్నాడు.

నర్సమ్ములు నాయుడు దుంగ మీద ఉండి లేచి, ఎడ్ల పగ్గాలను కట్టుగొత్తుల నుండి విప్పి బయటకు తీసుకువెళ్ళాడు. కుడితిలో నీళ్ళు తాపుకుని, మళ్ళీ తీసుకొచ్చి కట్టుగొత్తులకు కట్టేశాడు. దుంగ మీద కూచుంటూ "ఒక తొట్టి నీళ్ళు తాగేసినాయి. వాటికి ఎంత దప్పిక అయిందో ఏవో. దించిన మోర ఎత్తకుండా తొట్టి నీళ్ళు తాగేసినాయి." అని బక్కిరెడ్డితో, "గొడ్లను ఎండ గట్టేసినా వేందిరా బక్కా? కాపోడు చేసే పనేనాయిది?" అన్నాడు.

బక్కిరెడ్డి చటుక్కున తలెత్తి. "నేను కాపోడుయట్టయితి? సెంటు బూవి కూడా లేనోణ్ణి. నువ్వు నన్ను కాపాడు అనేదేవిటికి?" అని గట్టిగా అరిచాడు.

గంగిరెడ్డి, "ఈ ఎర్రి మాటలు ఎప్పుడు నేరిస్తివిరా? కాపు పుటక పుట్టినోడు కాపోడు గాక ఇంగేమవుతాడు." అన్నాడు.

బక్కిరెడ్డి ఆ ముగ్గురిని మార్చి మార్చి చూశాడు. లాంతారు వెలుగులో అతని కండ్లు వెర్రివెర్రిగా కదులుతుండడం కనిపిస్తూంది. అతడలా చూస్తూ, "ఏ పుటక పుట్టింది ఎవరు చూసినారు. ఇప్పుడు నేను కాపోడనే దానికి ఆనవాలు ఏవుండాయి? సదరాలట్టా కయ్యలు పోగొట్టుకుంటి. అంతా కడిగి బోర్లించేస్తి. ఇప్పుడు నేను కాపోడనేదానికి ఆనవాలు యాడుండాయి? నేనిపుడు పిచ్చగుంట్లోడిని. బిచ్చగోడిని, బికారోడిని. ఆమాట చెప్పేదానికే ఇప్పుడు మీరొచ్చింది. నన్ను యాలివి జేసేదాని కొచ్చినారు మీరు."

గంగిరెడ్డి, "కయ్యలు పోతే ఏవిరా బక్కా. కలిగ్గిం మునిగి పోయిందా? లోకానికి ఐచిత్రంగా నువ్వే కయ్యలు పొగొట్టుకుంటివా? తలరాత కాడికి ఇట్లయింది. ఇంగ అయ్యేపని చూడకుండా ఈ ఎర్రి మాటలేవిటికి?" అన్నాడు.

బక్కిరెడ్డి "కయ్యలు పోయినాక ఇంగ చేసే పనేముంది? చెవిలో ఎలుకల మందు పోసుకోవాల. లేకపోతే చెట్టుకు ఉరి తీసుకోవాల. ఏదో ఒకటి చేస్తా. కయ్యలు పోయినాక ఈ బూమ్మీద నాకేంపని" అన్నాడు.

వాళ్ళు ముగ్గురు కాసేపు మౌనంగా ఉన్నారు. తరవాత గంగిరెడ్డి నర్సి మ్ములునాయుడి వైపు చూశాడు. నర్సిమ్ములు నాయుడు మునిరెడ్డి వైపు చూశాడు. లాంతరు వెలుగులో ఆ మూడు జతల కళ్ళు నిశ్శబ్దంగా మంత నాలు జరిపాయి. వాళ్ళు ముగ్గురు ఒక నిర్ణయానికి వచ్చి తలలు ఆడించారు.

గంగిరెడ్డి లేచి బక్కిరెడ్డి భుజం మీద చేయి వేసి, "పొద్దున్నుంచి ఏమన్నా తిన్నావంట్రా?" అనడిగాడు.

బక్కిరెడ్డి మెల్లగ తలెత్తి అతని వైపు చూశాడు. పన్నెండు మట్ల బావి అడుగునుంచి వస్తున్నట్లు అస్పష్టంగా, బలహీనంగా ఉన్న స్వరంతో, "నోట్లోకి ముద్ద యట్ట పోతుందిరా. సదారాలట్టా కయ్యలను దారబోసుకుని చేతులు కడుక్కుంటి. ఇంగ తిండి యట్ట దిగుతుందిరా? ఇంగ కంటికి నిద్ర యట్టో స్తుందిరా" అన్నాడు.

గంగిరెడ్డి దీర్ఘంగా నిట్టర్పి "ఐతే ఒక పని చేద్దాం లెయ్యి" అన్నాడు.

"యాడికి?" అన్నాడు బక్కిరెడ్డి.

గంగిరెడ్డి అతని జబ్బ పట్టి లేపుతూ, "నువ్వు లెయ్యి చెప్తా" అన్నాడు.

బక్కిరెడ్డి లేచి నిలబడి "యాడికి" అన్నాడు.

గంగిరెడ్డి అతని చెయ్యి పట్టుకుని "ఈడిగోని జోబిడి దాక పోయ్యేద్దాంరా" అన్నాడు.

బక్కిరెడ్డి "ఈడిగోని జోబిడికా? ఆడనాకేం పని?" అన్నాడు.

గంగిరెడ్డి, "మేవు గూడా కాపోళ్ళ వేరా, కయ్యల్ను పోగొట్టుకోవడమంటే ఏందో మాకు తెల్సురా. ఇప్పుడు నీకడుపు పచ్చిపుండు మాదిర మండతా ఉంది. రొండు సీసాలు కడుపులో పడితేగాని నీ బుద్ది నిమ్మళం కాదు నడు" అన్నాడు.

తనచేతిని పట్టుకుని ఉన్న గంగిరెడ్డి చేతిని బక్కిరెడ్డి ఒకసారిగా విసిరి కొట్టాడు. చూస్తుండగానే అతని కండ్లు ఎర్రబడి పోయాయి. పెదవులు అదురుతుండగా అతడు" "ఎట్టెట్టా? నన్ను ఈడిగొని జోబిడికి తీసుకు పోతావా? కల్లు దాగిస్తావా? నీకంటికి నేను యట్ట కనిపిస్తా ఉండాను" అని మిగిలిన ఇద్దరి వైపు తిరిగి,"మీ అందరి కండ్లకు నేను యట్ట కనిపిస్తా ఉండాను. ఈ పొద్దు కల్లు తాగమంటారు. రేపు జోలె సంకకు తగలేసంకుని ఈదుల్దిరగ మంటారు. మొన్నాటికి తిరుపతి కొండ మెట్ల మీద కూసోమంటారు. నాకు దెల్సు. మీరొచ్చిందే ఇందుకు. నన్నుయాలివిజేసే దాని కొచ్చినారు. ఈ పొద్దు పండగ జేసుకుందామ నొచ్చినారు" అనరిచాడు.

గంగిరెడ్డి, మిగిలిన ఇద్దరు ఏదోచెప్పబోయారు. ఇంతలో కర్రెద్దు కట్టుగొత్తు వద్ద రంకె వేసిది. బక్కిరెడ్డి గిరుక్కున వెనుదిరిగి చూశాడు. కర్రెద్దు ఠీవీగా నిలబడి కాలు గీరుతూ మరొక సారి ఖణిల్లని రంకె వేసింది.

బక్కిరెడ్డి, "చూసినారంట్రా. ఎద్దు గొడ్డు గూడా నన్ను జూసి యాలివి జేస్తా ఉండాది. నా గాట్లో కసువు తినే గొడ్డు, నా

కుడితిలో నీళ్ళు తాగే గొడ్డు. దానిగ్గూడా నేను సవకయిపోయినాను. కయ్యలు పోగానే గొడ్లు గోదకు కూడా సవకయి పోయినాను." అంటూ దాపున బండి కూసును ఊడబెరికి చేత బట్టుకున్నాడు. అది బారెడు పొడవు ముంజేతి లావు వున్న చేవకర్ర. అతడు కర్రను రెండు చేతులతో తలకు పైగా ఎత్తి కర్రెద్దు పక్కమీద బాదాడు. అది బిత్తర పోయినట్లు యజమాని వైపు చూసింది. చేవకర్ర దాని మూతి మీదా ఢీకొంది. కర్రెద్దు నిలుచున్న చోటినే తొక్కిసలాడ సాగింది. బక్కిరెడ్డి ఎత్తిన కర్ర దించకుండా దాని వీపు మీద, గోపురం మీద, పక్కల మీద అందిన చోటల్లా బాదసాగాడు. దెబ్బలు తగిలిన చోట తోకతో కొట్టుకుంటూ కర్రెద్దు యిడుగులాడ సాగింది. దెబ్బల మోతతో కొట్టం దద్దరిల్ల సాగింది. కొంత సేపటికి కర్రెద్దు బాధను తాళలేక నాలుకను బయట పెట్టి "అంబా" అని అరవ సాగింది. దీనమైన దాని అరుపులు అతనికి వినిపించటం లేదు. కొంత సేపటి క్రితం అది ఖణిల్లని వేసిన రంకె అతని చెవిలో గింగిరుమంటున్నది. బాధతో మెలికలు తిరుగుతూ ఇడుగులాడుతున్న ప్రాణి అతనికి కనిపించటం లేదు. కొంత సేపటి క్రితం ఠీవిగా నిలబడి, ఖణిల్లని రంకె వేసిన దృశ్యం అతని కళ్ళ ముందర కదులుతూ ఉంది. తనను చూసి రంకె వేసి, కాలుగీరిన ఆ ప్రాణిని మాంసం ముద్దగా మార్చడానికి సంకల్పించుకున్నట్లు అతడు బాదుతున్నాడు. ఉన్మాదియై అతడు బాదుతుండగా అతని చేతిలోని కర్ర అప్పుడప్పుడు గురి తిప్పి రాతి స్తంభాన్ని తాకుతున్నది. కర్ర చేవది గనుక విరగడం లేదు. కాని అతనికి కణతల వెంబడి చెమట జారసాగింది. ఆయాసంతో అతడు రొప్పుతున్నాడు.

అతనిని ఆపడానికి అతని సహచరులు ప్రయత్నించారు. బక్కిరెడ్డి వాళ్లను తోసేసి, "నన్నిడవండ్రా, ఈ పొద్దు ఇదన్నా సావాల నేనన్నా సావాల. నేను సావడానికి తయారుగా ఉండా. నా

కయ్యలు పోయినాయి. సదరాలట్టా కయ్యలు పోయినాయి. ఇంగ నాకీడ ఏం పని? నేను తయారుగా ఉండా. ఇది నా కొట్టంలో బతికిన గొడ్డు. నా చేతికింద బతికిన గొడ్డు. నన్ను యాలివి జేసింది. నేను సచ్చే ముందు దీన్ని సంపి పూడ్చిపెట్టాల. నన్నిడవండ్రా" అంటూ బాదసాగాడు. దెబ్బల మోతతో బాటు, కర్రెద్దు అరుపులతో కొట్టం ప్రతిధ్వనించ సాగింది.

కొంతసేపటికి కర్రెద్దు ఇడుగులాడడం మాని నాలుగు కాళ్లపైన దృఢంగా నిలబడి పగ్గాన్ని తెంచడానికి ప్రయత్నించ సాగింది. అది తోకను తిప్పుకుంటూ, నోటి అంచుల వద్ద నురగ కార్చున్ని, సర్వ శక్తులు ఉపయో గిస్తున్నప్పటికీ, కలబంద నారతో తయారైన పగ్గం తెగడం లేదు.

సహ కాపులు ఒకరినొకరు కాసేపు అసహాయంగా చూసుకున్నారు. తరవాత నర్సిమ్ములు నాయుడు గబ గబ రాతి స్తంభాన్ని చుట్టి వచ్చి కట్టుగొట్టు వద్ద వంగి, దారం ముడి విప్పి వేశాడు.

దారం ముడి వీడగానే కర్రెద్దు బిసకంపవలె చెంగున ఎగిరి కొట్టం బయటకు దూకింది. మరొక్కసారి ఎగిరి వీధిలోకి వచ్చింది. అక్కడ నుండి వీధి వెంబడి తూర్పు దిశగా పరుగెత్తడం ప్రారంభించింది. అదలా పరుగెత్తు తుండగా దాని గిట్టలకున్న నాడాలు రాళ్ళకు తగిలి నిప్పు రవ్వలు పుట్టుతు న్నాయి. అది ఎత్తిన పరుగు దించకుండా, ఒక అదృశ్య హస్తం కర్రతో ఇంకా తనను బాదుతున్నట్లు, ఒక్కసారైనా వెనుదిరిగి చూడకుండా గ్రామంలోని వీధులన్నీ కలియ తిరిగింది. తరవాత ఊరు బయట ఉన్న కల్లు దుకాణం పక్కగా పరిగెత్తి కాలువ దగ్గర పరుగు ఆపింది. మెల్లగ అడుగులేస్తూ నీటి అంచును సమీపించి, మెడను వంచి నీళ్లు తాగసాగింది.

కర్రెద్దు వీధుల వెంబడి పరుగెత్తుతుండగా గ్రామస్థులు చాల మంది చూశారు. చూడని వాళ్ళు దాని కాలి గిట్టల సవ్వడిని విన్నారు. కర్రెద్దు ఎందుకలా పరుగెత్తిందని ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. "కందిరీగలు కుట్టాయేమో"నని కొందరన్నారు. "గాట్లో వరిగడ్డి తింటా ఉంటే అందులో పూడు పాము కనిపించిందేమో"నని మరి కొందరన్నారు. "మావిటేళ కాడ కుడితి నీళ్ళకు బదులు కల్లు తాగిందేమో"నని మరికొందరన్నారు.

భళ్ళున తెల్లవారే సరికి ఆ ప్రశ్నలన్నిటికీ సమాధానంగా ఒక వార్త బయలుదేరింది. గత రాత్రి కర్రెద్దు వీధులన్నీ కలియ దిరిగినట్టు ఆ వార్త వీధులన్నీ కలియ దిరిగింది. "బక్కిరెడ్డికి బుద్ధిమారకమై పోయిందట. కయ్యలు పోంగా ఆయనకు పిచ్చి పట్టిపోయిందంట". ఈ వార్త ఊరంతా పొక్కింది.

7

బక్కిరెడ్డికి పిచ్చి పట్టింది. ఈ వార్త కరణం చెవిలో పడింది.

కరణానిది పెంకుటిల్లు. ఆ ఇంటి వీధివైపున పొడుగాటి వరండా ఉంది. వరండా చివరన ఒక గది ఉన్నది. అదే అతని కచేరి. ఆ గదిలో ఒక పెద్ద కొయ్య బీరువా ఉన్నది. దాని నిండా రిజిస్టర్లున్నాయి. ఆ రిజిస్టరులో ఆ ఊరి భూమి తాలూకు వివరాలన్నీ ఉన్నాయి. బీరువా పక్కన ఒక టేబులు, దాని వెనక ఒక కుర్చీ ఉన్నాయి.

కరణం బీరువాలో నుంచి ఒక రిజిస్టరు తీసి టేబులు మీద వేశాడు. కుర్చీలో కూర్చుని, ఆ రిజిస్టరును తెరచి పేజీలను ఎడమ నుండి కుడికి, కుడి నుండి ఎడమకు కాసేపు తిప్పాడు. సిరా

బుడ్డిలో కలాన్ని ముంచి ఏదో రాయబోయి విరమించుకుని కలాన్ని మళ్ళీ సిరా బుడ్డిలో పెట్టేశాడు. దీర్ఘంగా నిట్టూర్చి కుర్చీలో జారగిల బడి కూర్చున్నాడు.

ఒక గ్రామస్థుడు "కరణపాయన ఉండావా?" అంటూ గది ముందరి కొచ్చాడు. కరణం, "ఉండాను లోపలకు రా" అని పిలిచాడు.

గ్రామస్థుడు లోపలికొచ్చి బెంచి మీద కూర్చున్నాడు. కరణం "ఏంది కత?" అన్నాడు.

గ్రామస్థుడు, "ఏంది కత అని ఇంగా అడగతా ఉండావా? పోయిన ఎవర్నం నుంచి కాలికి బలపం కొట్టుకొని తిరగతా ఉండా. నా తమ్మునితో నేనింగ యాగలేదును. కయ్యల మీదొచ్చే వరుమాన మంతా వాడు లంజలకు పెట్టేస్తా ఉండాడు. నువ్వొచ్చి కయ్యల్ను కొలచి నా చెక్క యంతో, వాని చెక్కయంతో తెగ జెప్పెయ్" అన్నాడు.

కరణం విరక్తి ధ్వనించే స్వరంతో, "ఏం కయ్యలు ఏం కొలవటం రా. కయ్యలు బుజాన పెట్టుకున్న ఎవడూ పుట్టలేదు. పొయ్యేటప్పుడు బుజాన పెట్టుకుని పోయేది లేదు. ఆ బక్కిరెడ్డి కత జూడు" అన్నాడు.

గ్రామస్థుడు, "అవును. కయ్యల పోయినాక బుద్ధి మారకం అయిపోయిం దంట. మరి ఇట్ట ఏవిటికాయె?" అన్నాడు.

కరణం. "ఏవిటికేంది? గొంతు దాక అప్పులు జేసినాడు. బాంకి వాడొచ్చి ఒక సెంటు యిడవకుండా కయ్యలు యాలవేసుకుని పోయినాడు" అన్నాడు.

గ్రామస్థుడు, "అదే అడగతా ఉండా. మంచమున్న కాడికి కాళ్ళుజాపు కోకుండా, అంతంత అప్పు లేవిటికి జేసినాడు?" అన్నాడు.

కరణం "బిక్కిరెడ్డి నీ తమ్ముని మాదిర లంజల కోసరం అప్పుచెయ్యలా. అప్పుదెచ్చిన రూపాయలు బాయి మీద పెట్టినాడు. కరువొచ్చి వానలు ఎగిడ్సుకుని బాయి ఎండి పోయింది. బాయిని రెండు మట్లు దించితే నీళ్ళు పడతాయనుకున్నాడు. రెండు మట్లు దించినా నీళ్ళు పడలా" అన్నాడు.

గ్రామస్థుడు, "యాడ నుంచి పడతాయి? నెత్తిన సెనేస్సుడు కూసోనుంటే యాడనుంచి పడతాయి?" అన్నాడు.

కరణం, "అప్పు కోసం దరఖాస్తు నన్నే రాయమన్నాడు. ఈ పాపం జేసిన చేతులతో నేనే రాసినా ... రాసే ముందు చెప్పిన. బక్కిరెడ్డి బాంకీ వోళ్ళు పీనుగల్ని తినే బాపతబ్బా. ఇన్ని వేలు తిరిగి కట్టేటప్పుడు యట్ట సమాళిస్తావో ఏమో' అని చెప్పినా. ఆయనది ఒకేమాట 'మరి నన్నేవి జెయ్యమంటావన్నా. బాయి అడుగున జిల్లేడు చెట్లు మొలచిపోయినాయి. నాగలి చెదలు పట్టిపోతా ఉంది.ఎద్దులు మెడల మీద బొచ్చు మొలచిపోతా ఉంది. కాపోడై పుట్టినోడు ఎన్నాళ్లు ముడ్డినేలేసుకుని కూసోసుంటాడు. నువ్వు రాయి అనె ... పన్నెండు వేలు. ఒకటి గాదు. రెండు గాదు. పన్నెండు వేల రూపాయలు తెచ్చినాడు" అన్నాడు.

గ్రామస్థుడు. "అన్ని వేలు సెలవు జేసినా బాయిలో నీళ్ళు పడకపోయె" అన్నాడు.

"నీళ్ళ కతట్టుండనీ, బాయి అడుగున తేమ కూడా కనిపించలేదు. అయితే ఆ మనిషి ఉడుం పట్టు పట్టినాడు. బాయిని ఇంకా రెండు ముట్లుదిం చతానన్నాడు. అప్పుకు దరఖాస్తు

రాయమని మళ్ళీ నా దగ్గరకొచ్చినాడు. నేను మళ్ళీ చెప్పినా "గొంతుల దాకా అప్పుజేస్తా ఉండావు. ఇంత అప్పు యా వగన తీరుస్తావు? అదాలోచించు" అన్జెప్పినా. ఆ మనిషి మీసాలు వడేసి తిప్పి "బాయిలో నీళ్ళు పడని చూతువు. తొలి పంటలోనే సగం అప్పు తీరిపోతుంది. మలి పంటలో మిగిలిన అప్పు తీరిపోతుంది. రెండే రెండు సంవత్సరాలలో అప్పు కాయితం వాపసు తెచ్చి నీకు చూపించకపోతే నా పేరు బక్కిరెడ్డి గాదు. నువ్వు పేనా తీసుకుని రాయి' అనె. మళ్ళీ పన్నెండు వేలు తెచ్చి ఆ బాయి యదాన పోసినాడు. నాలుగు మట్లు తెగినా దాంట్లో నీళ్లు పడలా, నిప్పులూ పడలా" అన్నాడు కరణం.

గ్రామస్థుడు. "నీళ్ళు పడతాయని అంత నమ్మకంగా ఆయనకు ఎవరు చెప్పినారో?" అనడిగాడు.

"వొడ్డెరోడు చెప్పినాడంట. బాయి అడుగున చెవి పెట్టి విని 'సావి అగ్నిం మూల గంగ ఓ కొడతా పోతా ఉండాది. యనకడుగు ఎయ్యకుండా ఇంగ రెండు మట్లు దించినావంటే గంగ తగుల్తుంది. మల్ల ఏడేండ్లు కరువొచ్చినా బాయి అడ్డేలు జగ్గదు. అన్జెప్పినాడంట. ఆ మటల్ను గట్టిగా పట్టుకున్నాడు. ఈ ఎర్రి బాగులోడు" అన్నాడు కరణం.

గ్రామస్థుడు "వొడ్డెరోడు అట్టగాక ఇంగెట్ల చెప్తాడు. వాడు చెప్తే మాత్రం ఈయన తెలివి ఏవయింది" అన్నాడు.

"గాచ్చారాలురా. గాచ్చారాలు. అవి సుట్టుకుంటే ఏ తెలివీ పని చెయ్యదు. దరమరాజుకు తెలివి లేకనా పాచికలాడింది. గాచ్చారాలు సుట్టుకోబట్టి. అంతే" అన్నాడు కరణం. అతడు టేబులు మీదున్న రిజిస్టరుని చూస్తూ మౌనంగా కూర్చున్నాడు.

గ్రామస్థుడు తను వచ్చిన పని అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చినట్లు. బెంచి మీద అసహనంగా కదిలి, "సరి, నాకత చెప్పు కరణపాయనా. మా కయ్యల్ను ఎప్పుడొచ్చి కొలుస్తావు?" అన్నాడు.

కరణం "కయ్యలు యాడికి పోతాయిరా. తలారోడిని పిలుచుకొచ్చి అరగంటలో కొలిచేస్తా. నాలుగు దినాలు గుక్క పట్టుకోనుండు. తెల్లార్నుంచి నా కడుపులో తిప్పుతా ఉండాది. బక్కిరెడ్డి కత తెలిసినప్పట్నుంచి నాకే బుద్ది సోదీనంలో లేకుండా ఉండాది. నాలుగు దినాలైనాక రా" అన్నాడు.

గ్రామస్థుడు మెల్లగా లేచి, "సరె" అని గొణుక్కుంటూ, కండువా భుజాన వేసుకుని వీధిలోకి వెళ్లిపోయాడు.

8

బక్కిరెడ్డికి పిచ్చి పట్టింది. ఈ వార్త వీరయ్య చెవిన పడింది. వీరయ్య వడ్డెర గూడేనికి పెద్ద. ఆ గూడెంలో దాదాపు పదిహేను గుడిసెలున్నాయి. గూడెంలో వాళ్ళకు బావులు తవ్వడం, చెరువులకు గట్లు పోయడం, రాతి స్తంభాలను చెక్కడం, కంకర కొట్టడం ప్రధాన వృత్తులు.

ఆ ప్రాంతంలో సేద్యపు బావులు గాని, తాగునీటి బావులుగాని అన్నీ వాళ్ళు తవ్వినవే. వాళ్ళు విడివిడిగా ఏపనీ చేయరు. ముఠాగా వెడతారు. కొన్ని పనులు దిన కూలి ప్రాతిపదిక మీద, మరికొన్ని పనులు గుత్త ప్రాతిపదిక మీద చేపడతారు. ఏ నిర్ణయమైనా గూడెం పెద్ద వీరయ్య తీసుకుంటాడు.

భళ్ళున తెల్లవారింది. వీరయ్య మంచం మీద నుండి లేచాడు. ఈత చాపను చుట్టగా చుట్టి గుడిసె గోడకు ఆనించాడు.

మంచాన్ని లేపి గోడకు నిటారుగా ఆనించాడు. గుడిసె లోపలకు వెళ్ళి కల్లు దుత్తను తీసుకుని, బయటికి వచ్చి అరుగు మీద కూర్చున్నాడు. దుత్తను నోటికి కరిపించుకుని, ఒక్క పెట్టన సగం దుత్తను ఖాళీ చేసి అరుగు మీద పెట్టాడు.

పగలంతా మట్టిని తవ్వుతూ, బండలను చీల్చుతూ ఉండడం వల్ల సూర్యాస్తమయమయ్యే సరికి అతని వొంట్లోని ప్రతి కీలు, ప్రతి కండరం నొప్పి పెడతాయి. ఆ నొప్పులను పోగొట్టుకోవడం కోసం అతడు ప్రతిరోజూ సాయం త్రం సుష్మగా కల్లు తాగుతాడు.

కాని ఈ రోజు ఉదయాన్నే అతడు కల్లు తాగుతున్నది వొంటి నొప్పుల కోసం కాదు. సగం రాత్రప్పుడు అతనికి బక్కిరెడ్డి ఉదంతం తెలిసింది. అప్పటి నుంచి అతడు కంటి మీద రెప్ప వేయలేదు. ఆకాశాన వేగుచుక్క పుట్టినప్పుడు, గంపకింద తొలికోడి కూసినప్పుడు, తూర్పున ఉషారేఖలు కనిపించినప్పుడు అతడు మంచం మీద పడుకుని కళ్ళు తెరచుకునే ఉన్నాడు. భళ్ళున తెల్లవారేటప్పటికి నిద్రలేక అతని కళ్ళు ఎర్రనయ్యాయి.

అతడు మీసాలకంటుకుని ఉన్న కల్లు చుక్కలను తుడుచుకుని "థూ నీయమ్మ! కూటి మీద నడిచిన మారాజు బికారోడై పాయె". అని గొణు క్కున్నాడు. అతడు దుత్తను మళ్ళీ ఎత్తి నోటికి కరిపించుకున్నాడు. పెరట్లో మట్టి పాత్రలను తోముతున్న అతని భార్య పనిని ఆపి అతని వైపు చూడసాగింది. అలా కొంత సేపు ప్రశ్నార్థకంగా చూసి, తల తిప్పుకుని తన పనిలో మునిగి పోయింది. వీరయ్య దుత్తను ఖాళీ చేసి, దండెం మీద నుండి కండువా తీసుకుని తలకు చుట్టుకున్నాడు. ఇంతలో ఒక రైతు వీధి మలుపు తిరిగి ఇటే వస్తుండడం కనిపించింది. వీరయ్య ఉదయం సూర్యకిరణాల కడ్డంగా చేయి పెట్టుకుని చూడసాగాడు.

రైతు చేరువగా వచ్చాక వీరయ్య, "నువ్వా సావి. ఏంది ఇంత పొద్దున వచ్చినావు?' అనడిగాడు.

రైతు "నీతోనే పని పనిపడిందిరా. ఎండెక్కి నాకవస్తే నువ్వుంటావో ఉండవోనని ఇంత పొద్దునొచ్చినా" అన్నాడు.

వీరయ్య "ఏంపని సావి?" అని తిన్నెమీద దుత్తను తీసి కింద బెట్టి" ఈడ కూసో సావి" అన్నాడు.

రైతు తిన్నె మీద కూర్చుని "బాయి మట్టో, రెండు మట్లో దించాల్రా, అడుగున తేమ కనిపిస్తా ఉండాది. గాని చారెడు నీళ్ళు లేవు. ఇంగ నాలుగు దినాలైతే ఆ తేమ గూడా ఈడ్చుకుని అడుగున నెర్లు చీలిపోతాయి" అన్నాడు.

వీరయ్య తల పైకెత్తి ఆకాశాన్ని ఆ చివర నుండి ఈ చివర దాక చూడ సాగాడు.

రైతు. "తేలకండ్లేస్తా ఉండా వేందిరా?" అన్నాడు.

వీరయ్య తల దించి, "మొబ్బులు సందు లేకుండా తిరగతా ఉండాయి సావి. అవడి నెల కూడా అయిపోతా ఉంది. ఈ సారి తప్పకుండా వానలు పడేట్టుండాయి. వాన పడిందంటే నేల శాంబరించి పోయి బాయిలోకి ఊట వస్తుంది. అందాక గుక్క పట్టుకోనుంటే మంచిది కాదా అని ఆలోసన చేస్తా ఉండా" అన్నాడు.

రైతు నిట్టూర్చి "అట్టనుకుంటానే రెండేండ్లు గడిచిపోయినా యిరా. రెండేండ్లు గడిచిపోయినాయి. చేతి నిండా పనులు లేక చేతులు తీట పట్టినట్టు దురద పెడతా ఉండాయి. ఇంకొన్ని దినాలైతే వలపట్టెద్దు ఏది, దాపటెద్దు ఏదీ అనేది గూడా

మర్సిపోయేది ఖాయం"అని వీరయ్యను గుచ్చి చూస్తూ "అది సరేగాని, ఇదేందిరా ఊరిగా, బాయి తొవ్వే పనిస్తానంటే వొద్దనేదేందిరా? నీకిష్టం లేకుంటే చెప్పు. నేను పక్కూరుకు పోయివేరే ఎవుర్నయినా మాట్లాడుకుంటా" అన్నాడు.

వీరయ్య వెంటనే, "అది గాదు సావి, బావుల్దొవ్వే దాని గాకుంటే వొడ్డెరోడు పుట్టింది దేనికి?" అని తల గీరుకుని, "రెండు మట్లు గాదు, నాలుగు మట్లు దించినా నీళ్లు పడతాయని గారంటి ఏం వుండాది? ఆ బక్కిరెడ్డి. కత జూడు" అన్నాడు. రైతు ఆకాశం వైపు చేయి చూపిస్తూ" అంతా వాడి దయ. ఐనా నేను చెయ్యాల్సిన పని నేను చేయకుంటే రేపు నాలుగువేళ్ళు నోట్లోకి పోయేదెట్ల? బాయిలో నీళ్ళు లేకుండా కయ్యాల్ను దున్నకుండా నేను మాత్రం ఎన్నాళ్ళు చేతులు పిసుక్కుంటా కూసుంటాను. అదిజెప్పు" అన్నాడు.

వీరయ్య "బక్కిరెడ్డి గూడా ఇట్లనే చెప్పినాడు సావీ, బాయిలో నీళ్ళు పడాల, దుడ్డుకోసరం యనక్కు సూడొద్దు. కావాలంటే పావునోట్లో ఏలుపెట్టి యాడన్నా అప్పుదెస్తా, అన్జెప్పినాడు ఎర్రి మారాజు. మొదట రెండు మట్లు చాప పలుకు వచ్చింది. మల్లొక రెండు మట్లుకు నాపరాయి వొచ్చింది. అదయినాక సారబండ వచ్చింది. నేను పుట్టి బుద్ధి తెలిసినప్పట్నుంచి బావుల్దొవ్వుతా ఉండా. సారబండ వచ్చిందంటే మల్ల నీళ్ళు పడేది ఒట్టి మాట. ఇంకెన్ని మట్లు దించినా నీళ్లు పడవు. నాకు దెల్సు. ఆమాటే బక్కిరెడ్డికి చెప్పినా. ఆ మారాజు నమ్మలా. పక్కూరు నుంచి ఇద్దరు వొడ్డెరోళ్ళను రప్పించినాడు. వాళ్ళు మెట్లు దిగి బాయి అడుగున సుత్తితో కొట్టి కొట్టి సూసినారు. యాడ కొట్టినా సారబండే తగల్తా ఉంది. ఇద్దరూ మెట్లెక్కి పై కొచ్చి నేన్జెప్పిన మాటే బక్కిరెడ్డికి చెప్పినారు. అంతే సావి, చూస్తా ఉండగానే ఆయన కంట్లో

చిటికెనేలు లావు నీళ్ళు కారినాయి. పులి మాదిరుండే మనిషి పసిపిలగోడు మాదిరయి పోయినాడు. బాయి గెడ్డన కూసోని, 'ఇంగ నా బతుకింతేనా ఈరిగా, ఇంగనేను నాగలి మేడి ఏ జన్మలో పడతాన్రా ఈరిగా, అని ఏడ్చినాడు సావి. తల్సుకుంటే కడుపులో ఏపిస్తా ఉంది" అన్నాడు.

రైతు దుత్తలోకి చూసి "అందుకేనా ఒక పక్క పొద్దు పుట్టకముందే ఒక దుత్త ఖాళీ జేసినావు" అని కాసేపు మౌనంగా ఉండి, నోరు చప్పరించి," అవన్నీ తల్సుకుని జరం తెచ్చుకునే దేవిటికిరా. ఏది శాశ్వతం? కయ్యలు శాశ్వతం గాదు. మనుషులు శాశ్వతం గాదు" అని అరుగు దిగి "సావిజ్జెప్పినట్లు అదెవతో బాసేలి బిచ్చగాడొస్తాడని ఎసురు పెట్టడం మానేసిందట. అట్ట అన్నీ యిడ్సి పెట్టేసి కూసునే దానికి మనకు యాడ తీర్తుంది? నువ్వు పని ఎప్పుడు మొదలు పెడతావు అజ్జెప్పు" అన్నాడు.

వీరయ్య, "నువు ఏ దినం మొదలు పెట్టమని చెప్తే ఆ దినమే సావి" అన్నాడు.

రైతు తిన్నె మీదున్న తుండు గుడ్డను తీసుకుని "నేను చెప్పేదేంది, బాయి యాడుందో నీకు తెల్సు, బాయి తొవ్వే కొరముట్లు నీ దగ్గరుండాయి. నీకు ఎప్పుడు వీలవుతుందో నువ్వే చెప్పు" అన్నాడు.

వీరయ్య "ఈ దినం సుక్కురారం గదసావి. రొండు దినాలు తాళి సోమవారం మొదలు పెడ్తా. సోమవారం పొద్దున మా మందిని తీసుకొచ్చి బాయిలోకి దిగుతా" అన్నాడు.

రైతు. "మరి దుడ్డు కత జెప్పు, మట్టుకు ఎంత అడగతావు?" అన్నాడు.

వీరయ్య నేల చూపులు చూస్తూ మౌనంగా నిల్చున్నాడు.

రైతు "నాలికలో ముల్లిరిగిపోయినట్లయి పోతివేందిరా దుడ్డుకత చెప్పు" అన్నాడు.

వీరయ్య తల ఎత్తి "దుడ్డుకత ఇప్పుడొద్దు సావి. నీళ్ళు పడినాక మాట్లాడుకుందాం" అన్నాడు.

రైతు తలపాగాను చుట్టుకుంటూ టక్కున ఆగిపోయి "ఇదేందిరో, రేటు ఇంత, అడ్వాన్సు ఇంత అని మాట్లాడుకోకుండా బాయి తొవ్వేదానికి ఒప్పుకునే వొడ్డరోణ్ణి నేనెప్పుడూ సూడలా. పొద్దున్నే లేచి ఉమ్మెత్త గింజలు నవిల్తివాయట్ట?" అన్నాడు.

వీరయ్య "రాతిరంతా ఆలోసన జేసినా సావి. ఈ పొద్దుట్నుంచి ఈ ఒప్పందం మీదనే బావులు తొవ్వాలని మనసు జేసుకున్నా. మీరు రైతు మారాజులు. మీకు తెలవందేముంది?

మా రెక్కలు సత్తవే మా ఆస్తి, గొర్రెల గోపితాలు గొల్లోనికి తెల్సు. మా కష్టాలు మీకు తెల్సు. బాయిలో నీళ్ళు పడితే మాకు ఈనాములియ్యండి. నీళ్ళు పడకపోతే మా కష్టాన్ని జూసి మీకు న్యాయమనిపించింది ఇయ్యండి" అన్నాడు.

రైతు, "ఇగ నీ యబ్బతోడు. నువ్వు చెప్పిన ప్రకారవే కానియ్యి. సోమవారం పొద్దున బాయి కాడ మీకోసం దోవ జూస్తా ఉంటా. కొరముట్లు తీసుకుని రండి" అని తలపాగా బిగించి కట్టుకుని వెనుదిరిగి, "అనుమానం లేదు.

నీకు బక్కిరెడ్డి జరం పట్టుకుంది. అనుమానమేమీ లేదు" అని గొణుక్కుంటూ వీధిలోకి సాగిపోయాడు.

9

బక్కిరెడ్డికి పిచ్చి పట్టింది. ఈ వార్త మణియంగారి చెవిని సోకింది.

మణియం అలవాటు ప్రకారం పొద్దు నాలుగు బారలెక్కేటప్పటికి తన కచేరీకి వచ్చాడు. కచేరీ వరండా చెత్తా చెదారంతో నిండి ఉంది. మామూలుగానైతే తలారివాడు ఒక గంట ముందుగానే వచ్చి కచేరి వరండాను శుభ్రంగా ఊడ్చి. వరండా మెట్ల మీద కూర్చుని మణియం గారికోసం ఎదురు చూస్తూ ఉండేవాడు. మణియం గారి సలహాల కోసం, ఇతర రాచకార్యాల కోసం వచ్చిన వాళ్ళు వరండాలో గోడ కానుకుని కూర్చుని ఉండేవారు. కాని ఈ పూట కచేరి వరండా నిర్మానుష్యంగా ఉంది.

మణియం కచేరి తాళం తెరచి, కుర్చీలో కూర్చుని, కచేరి గోడలను, కిటికీలను కలయజూశాడు. నిర్మానుష్యమైన ఒక పాతాళ గుహలోనో, జైలు గదిలోనో కూర్చుని ఉన్నట్లు అతనికి అనిపించసాగింది.

కొంత సేపటికి తలారివాడు ఒక చేత గజ్జెల కర్రను, మరొకచేత కిర్రు చెప్పులను పట్టుకుని వచ్చి కచేరి గది ముందు నిలబడి, "దండాలు దొరా" అన్నాడు.

తలారివాడు ఆలస్యంగా వచ్చినందుకు మణియం చిరాకు పడలేదు. పైగా "ఇటొచ్చినావేందిరా?" అన్నాడు.

అసంబద్ధంగా ఉన్న ఆ ప్రశ్నకు తలారివాడు కాస్త ఆశ్చర్యపోయి, "కిస్తి వసూలు చెయ్యాల్సింది ఇంగా ఉండాదిగద దొరా" అన్నాడు.

మణియం అనాసక్తితో, "ఏం కిస్తీ వసూళ్ళురా?" అన్నాడు.

తలారివాడు, "పవర్నం నాటికంతా కిస్తీ వసూళ్ళు పూర్తి కావాలంటివి గద దొరా. పవర్నానికి ఇంగ మూడే దినాలుంది" అన్నాడు.

మణియం, "ఔ, నవర్నం పోగానే తాసిల్దారొస్తాడు. కిస్తీ కట్టాల్సినోళ్ళు ఇంగ ఎంత మంది ఉండారు?" అన్నాడు.

తలారివాడు, "ఆరుగురుండారు దొరా. బక్కిరెడ్డి పోంగ ఇంగ ఐదుగురుం డారు. రెండు దినాలు తిరిగితే వసూలైపోతాయి" అన్నాడు.

మణియం, "బక్కిరెడ్డి బుద్ధి మారకవై పోయిందటగదరా. ఏందికత?" అన్నాడు.

తలారివాడు. "ఔ దొరా. ఈ మాట నాకు సగం రాత్రప్పుడు తెల్సింది. తెలిసినప్పట్నించి నిద్దరే పట్టలేదు దొరా. పొద్దున పోయి చూసొచ్చినా గొడ్ల కొట్టంలో ఏసిన పడక ఎత్తకుండా పడుకోనుండాడు. ఎంత మాట్లాడించినా నోరు తెరవటం లేదు. తెర్సినప్పుడు కూడా ఎర్రెర్రి మాటలే మాట్లాడతా ఉండాడు" అని నోరు చప్పరించి, "ఏందోదొరా. కయ్యలేంది. కయ్యలపైన ఇట్ట మర్లు పెట్టుకునే దేంది. పొద్దుట్నుంచి నాకు మనసులో మనసు లేదు దొరా" అన్నాడు.

మణియం ఏదో చెప్పబోయి ఆగిపోయి, తల వంచుకుని

ఆలోచించ సాగాడు. ఇదే కచేరిలో జరిగిన వేలంలో ఎందరో రైతులు తమ కయ్యలను పోగొట్టుకున్నారు. వాళ్ళందరినీ మణియం పేరుపేరునా ఎరుగును. వాళ్లలో కొందరు దిన కూలీలుగా బతుకుతున్నారు. కొందరు కౌలుదార్లుగా బతుకు తున్నారు. కొందరు గ్రామం విడిచి వెళ్ళి పోయారు. కాని కయ్యలు పోవడంతో జీవితం నిరర్థకమని భావించిన రైతులను కూడా అతడెరుగును. అలాంటి వాళ్లలో బక్కిరెడ్డి ఒకడు.

రాజ్యాలను పోగొట్టుకున్న రాజుల కథలు చరిత్ర నిండా ఉన్నాయి. ఆ రాజులు కొందరు సామాన్య పౌరులుగా బతికారు. కొందరు శత్రురాజుల వద్ద బందీలుగా బతికారు. కొందరు ఇరుగు పొరుగు రాజుల నాశ్రయించి బతి కారు. కాని రాజ్యం పోవడంతో బ్రతుకు నిరర్థకమని భావించిన రాజులు కూడా ఉన్నారు. అలాంటి వాళ్లలో మణియం గారి పూర్వీకుడైన కొళందరెడ్డి ఒకడు. మొగిలి కొళందరెడ్డి ఈ ప్రాంతానికి పాళెగాడుగా ఉండేవాడు. పన్నెండు గ్రామాలు అతని అధీనంలో ఉండేవి. బ్రిటీషు వాళ్ళు ఒక్కొరొ క్కరినిగా పాళెగాళ్ళ నందరినీ అణిచివేశారు. కొళందరెడ్డి ఏకాకిగా మిగిలి పోయాడు. అతడు నాలుగు సంవత్సరాలపాటు బ్రిటీషు వారితో ఒంటరి పోరాటం సాగించాడు. చివరకు బ్రిటీషు సైనికులు ఫిరంగులతో తుపాకులతో చెన్నపట్నం నుండి తరలివచ్చారు. ఆ సైన్యం ధాటికి కొళందరెడ్డి అంగబలం చిన్నాభిన్నమయింది. కొళందరెడ్డి ఊరు విడిచి నలుగురైదుగురు అనుయా యులతో ఒక రహస్య స్థావరంలో దాగుకున్నాడు. ఊరుకు క్రోసెడు దూరాన ఉన్న కొండ శిఖరాన పెద్ద పెద్ద శిలలతో ప్రకృతి నిర్మించిన కోటవలె ఒక గుహ ఉన్నది. కొళందరెడ్డి తన అనుయాయులతో ఆ గుహలో దాగుకున్నాడు. ఈ రహస్యం వేగుల ద్వారా తెలుసుకున్న ఆంగ్ల సైనికులు కొండను చుట్టుముట్టారు. స్వచ్ఛందంగా లొంగి పొమ్మని కొళందరెడ్డికి

కబురు పంపారు. కొండమీదకు ఆహార పదార్థాల సరఫరా జరగకుండా పటిష్ఠమైన కట్టుదిట్టాలు చేశారు. అలా ఎనిమిది రోజులు జరిగాయి. కొళందరెడ్డితో ఉండిన అనుయాయులు ఆకలి దప్పులకు తట్టుకోలేక ఒక్కరొక్కరే కొండ దిగివచ్చి తమ ఆయుధాలతో సహా లొంగిపోయారు. కొండ మీద పాళెగాడు ఒక్కడే ఉన్నాడని తెలిసినా ఆంగ్ల సైనికులు కొండమీద కెక్కడానికి సాహసించ లేకపోయారు. తొమ్మిదవ రోజున కొండ శిఖరంపైన ఆకాశంలో కొన్ని రాబందులు ఎగురుతుండడం వారు గమనించారు. అప్పుడు వాళ్ళు తుపా కులు ఎక్కుపెట్టుకుని కొండపైకి నలుదిక్కుల నుండి అడుగేసుకుంటూ కొండ శిఖరం చేరేటప్పటికి సూర్యుడు నడిమింటికొచ్చాడు. పాళెగాడు పిడి బాకుతో పొడుచుకుని గుహ ముందు రక్తపు మడుగులోపడి ఉండడం వారికి కనిపించింది.

మణియం తలవంచుకుని కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు.

తలారివాడు "పొద్దెక్కి వస్తా ఉండాది దొరా. కిస్తీ వసూళ్లకు పొమ్మం టావా?" అన్నాడు.

మణియం తలపైకెత్తాడు. అతడు తన మనసులో మెదులుతున్న భావాలను తలారివానితో పంచుకోదలచుకోలేదు. అతడు భారంగా నిట్టూర్చి, "ఏం కిస్తీలు, ఏం వసూళ్లురా. నాలుగు నాళ్ళు ఆగు. తాసిల్దారుకు నేనేదో చెప్పి పంపిస్తా. నువ్వు పోయి నీవనేదన్నా ఉంటే చూసుకో పో" అన్నాడు.

తలారివాడు కాసేపు అయోమయంగా చూసి, వెనుదిరిగి మెల్లగా వరండా మెట్టు దిగి వెళ్ళిపోయాడు.

మణియం కుర్చీలో జారగిల బడి కూర్చుని, కండ్లు మూసుకుని, కణతల మీద చేతులు వేసుకున్నాడు.

10

ఆకాశం సగభాగం మేఘాలతో నిండి ఉంది. మేఘాలు కొన్ని తెలుపు, మరికొన్ని నలుపు, మరికొన్ని కావి రంగులో ఉన్నాయి. కొన్ని మేఘాలు మర్రి చెట్టు ఆకారంలోను, మరికొన్ని ఏనుగు తల ఆకారంలోను, ఇంకొన్ని మనిషి తల ఆకారంలోను ఉన్నాయి. స్థావర జంగమాత్మకమైన భూమి తాలూకు నీడ ఆకాశంలో ప్రతిబింబిస్తున్నట్లు భ్రమ కలుగుతున్నది.

భూమి మీద జీవితం అశాశ్వతం. నిరంతరంగా పరివర్తన చెందటం దాని ధర్మం. దాని తాలూకు భ్రమ మరింత అశాశ్వతం. అది మరింత వేగంగా పరివర్తన చెందుతున్నది.

ఘడియ క్రితం తెల్ల రంగులో ఉండిన మేఘాలు నల్లరంగును, ఘడియ క్రితం నల్లగా ఉండినవి కావి రంగును సంతరించుకుంటున్నాయి. ఘడియ క్రితం మర్రి చెట్టు ఆకారంలో ఉండిన మేఘాలు ఏనుగు రూపాన్ని, ఘడియ క్రితం ఏనుగు రూపంలో ఉండిన మేఘాలు మనిషి తల రూపాన్ని ఆపాదించుకుంటున్నాయి. ఆ మేఘాలు అలా తమ రంగులను, రూపాలను మార్చుకుంటూ మెల్ల మెల్లగా ఈశాన్య దిక్కుగా సాగుతున్నాయి.

తల్లిగర్భంలో శిశువు వలె బక్కిరెడ్డి మంచం మీద ముడుచుకుని పడుకుని ఉన్నాడు. అతని ఉరఃకుహరం మెల్లగా లేస్తూ పడుతూ ఉంది. మూసుకుని ఉన్న కనురెప్పల క్రింద కనుగుడ్లు అటూ ఇటూ కదులుతున్నాయి. నిన్నటి నుండి కొట్టంలోకి ఎవరెవరో

వచ్చి తనను పలకరించి పోతున్నారు. భార్య, బంధువులు, సాటి రైతులు, వృత్తిపని వాళ్లు ఒక్కొక్కరే వచ్చి పోతున్నారు. నిన్నటి దాక వాళ్ళు తన బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు. కాని ఇప్పుడు తనకు, వాళ్లకూ మధ్య కొన్ని యోజనాల దూరం ఉంది. కొన్ని యుగాల అంతరం ఉంది. కొట్టంలో ఎడ్లు చేస్తున్న చప్పుడు, పొగడ చెట్లో పిచ్చుకలు చేస్తున్న చప్పుడు తనకు వినిపిస్తూంది. కాని వాటితో గాని, ఈ ప్రపంచంలోని కోటాను కోట్ల జీవరాసుల్లో ఏ ప్రాణితో గాని తనకు పోలికా లేదు. సంబంధమూ లేదు. ఈ విశాల విశ్వంలో తనను పోలిన జీవి బహుశా అటకలో ఉన్న గబ్బిలం ఒక్కటేనేమో. అది ఇప్పుడప్పుడే బయటకు రాదు. సూర్యుడస్తమించి చీకటి పడ్డాక అది అటకలో నుంచి బయటకొస్తుంది. తనకిష్టమొచ్చినంత సేపు కొట్టంలో గిరికీలు కొడుతుంది. తరవాత రెక్కలు కొట్టుకుంటూ బయటకు వెడుతుంది. పచ్చిక మైదానంలో మిడతలను, తుమ్మెదలను తింటుంది. తనతోటి గబ్బిలాలతో కలిసి వాగుల మీద, లోయల మీద ఎగురుతుంది. తన స్నేహితులతో కీచు కీచుమని సంభాషిస్తుంది. మంతనాలు బరువుతుంది. వాటితో కలిసి ఎలుకలను, ఉడతను వేటాడుతుంది. వేటలో దొరికిన వాటిని మిత్రులతో కలిసి తిని విందు చేసుకుంటుంది. మిత్రులతో కలిసి ఆడుతూ, పాడుతూ రాత్రంతా గడుపుతుంది. తూర్పున వెలుగు రేకలు కనిపిస్తుండగా తన మిత్రుల వద్ద సెలవు తీసుకుని వస్తుంది. సూర్యుడు పుట్టక ముందే అటకలో ప్రవేశిస్తుంది.

అంతటి జీవితేచ్ఛతో బతికే గబ్బిలంతో నన్ను పోల్చుకోవడం అర్థరహితం అనుకున్నాడు బక్కిరెడ్డి.

తనలాంటి నిరర్థకపు బ్రతుకు గతంలోగాని ప్రస్తుతంగాని ఎవరూ బతకలేదు. భవిష్యత్తులో గూడా ఎవరూ బతకబోరు. తను

భూమికి మోకాటెత్తున మంచం మీదున్నా ఒకటే. భూమిలో మోకాలి లోతున శవంగా ఉన్నా ఒకటే. భూమి మీద ఎంత మంది మనుషులున్నారో అన్ని నక్షత్రాలు ఆకాశంలో ఉన్నాయట. ఒక మనిషి మరణించగానే ఒక నక్షత్రం రాలి పోతుందట. తన తాలూకు నక్షత్రం ఎప్పుడు రాలి పోతుందో! బహుశ అది రాలి పోవడానికి సిద్ధంగా ఉందేమో. ఎదురు చూడటానికి ఏమీ లేని మనిషి, జీవితేచ్ఛ ఇసుమంతయినా లేని మనిషి మృతునితో సమానం కాదా. మరణం గురించి, పరలోకం గురించి తనకేమీ తెలియదు. పండుగలప్పుడు చేసే పురాణ కాలక్షేపాల్లో బ్రాహ్మణుడు ఈ అంశాలను ప్రస్తావించే వాడు. ఆ అంశాలను గురించి బ్రాహ్మణుడు చెప్పింది తానెప్పుడూ సావధానంగా వినలేదు. ఆ అంశాలను గురించి నేర్చుకునే బాధ్యత, జ్ఞాపకం పెట్టుకునే బాధ్యత బ్రాహ్మణుడిదేనని తను భావించేవాడు.

మరణానంతరం తను ఎదురు చూడవలసినవి చాలా ఉన్నాయి. అందులో ముఖ్యమైనది తన తండ్రిని కలుసుకోవడం, తనను చూడగానే తన తండ్రి ఎన్నో అడుగుతాడు.

ముఖ్యంగా కయ్యల్ను గురించి అడుగుతాడు.

మంచం మీద పడుకుని ఉన్న బక్కిరెడ్డి దిగ్గున కళ్ళు తెరిచాడు. వీపు మీదెవరో కొరడాతో బాదినట్లు లేచి మంచం మీద కూర్చున్నాడు.

తననెవరో చాలా సేపట్నుంచి పిలుస్తున్నారు.

"బక్కా – ఓరి బక్కా!" అని ఒక గొంతు పిలుస్తున్నది. అలా పిలుస్తూ "కయ్యల్నేవి జేసినావురా బక్కా?" అని అడుగుతున్నది. ఎవరిదా గొంతు? తన తండ్రిదే! తన తండ్రిదే ఆ గొంతు!!

బక్కిరెడ్డి గబుక్కున మంచం మీద నుండి లేచి కొట్టం బయటకొచ్చాడు. అతడు కొట్టం గోడ వెనక, పొగడ చెట్టు వెనక చూశాడు. ఎవరూ కనిపించలేదు. కాని ఆ గొంతు వినిపిస్తూనే ఉంది. ఒకసారి స్పష్టంగా, మరొకసారి అస్పష్టంగా వినిపిస్తూనే ఉంది, అతడు తలపైకెత్తి ఆకాశం వైపు చూశాడు.

ఆకాశంలో తన తండ్రి ముఖం కనిపిస్తోంది. గళ్ళ తువ్వాలను అతడు తలకు చుట్టుకుని ఉన్నాడు. నిరంతరంగా పుగాకు నమలడం వల్ల పుల్లనై ఉన్న అతని గుబురు మీసాలు కనిపిస్తున్నాయి. ఆ ముఖం తనవైపే చూస్తూ "కయ్యల్ను ఏవి జేసినావురా బక్కా" అనడుగుతున్నాడు.

చాలా సేపటి నుండి పడుకుని ఉండి ఒక్కసారిగ లేచి నిలబడడం వల్ల బక్కిరెడ్డి కళ్లు గిర్రున తిరగసాగాయి. చీకట్లు కమ్మసాగాయి. శరీరం వశం తప్పి అతడు కట్టెల మోపు వలె దబ్బున పక్కకు పడిపోయాడు. ఆ చప్పుడుకు బెదిరి కొట్టంలో ఉన్న ఎడ్లు లేచి నిలబడ్డాయి.

ఆకాశంలో మనిషితల ఆకారంలో ఉన్న మేఘం మెల్ల మెల్లగా కరిగి ఏనుగు ఆకారాన్ని ఆపాదించుకున్నది. కూస్తుండగానే అది మర్రి చెట్టు వలె మారింది. మేఘాలు తమ ఆకారాలను, రంగులను మార్చుకుంటూ ఈశాన్య దిశగా కదులుతున్నాయి.

మేఘాల వెనక నుండి ఉరుముల సవ్వడి ఉండి, ఉండి ఒకప్పుడు స్పష్టంగా, మరొకప్పుడు అస్పష్టంగా వినిపిస్తోంది.

11

స్పృహ వచ్చేటప్పటికి బక్కిరెడ్డి మంచం మీద పడుకుని ఉన్నాడు. అతని తలకింద ఎత్తయిన తలగడ ఉంది. అతని భార్య అతని పాదాలకు, అరచేతులకు ఏదో ఆకు పసరును పూస్తున్నది. తరవాత ఆమె వేడిపాలను గ్లాసులో తీసుకొచ్చి కొద్ది కొద్దిగా అతనికి తాపించసాగింది. గ్లాసెడు పాలను తాగిన పిదప బక్కిరెడ్డి కళ్లు పూర్తిగా తెరచుకున్నాయి. అలా తెరచుకున్న కళ్లను చూసి ఆమె ముఖం విచ్చుకున్నది. నోటిమాటలతోను చేతి సైగలతోను, ఆమె అతనితో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నది. ఆమె మాటలు అతని చెవులకు వినిపించడం లేదు. ఆమె సైగలు అతని కళ్లకు కనిపించటం లేదు.

అతని కళ్లకు అతని తండ్రి ముఖం సర్వాంతర్యామియై కనిపిస్తూ ఉంది. అతని చెవులకు అతని తండ్రి ప్రశ్న భూమ్యాకాశాలలో ప్రతిధ్వనిస్తూ వినిపిస్తూంది.

తనువు చాలించే ముందు తన తండ్రి ఆడిన చివరి మాట కయ్యలను గురించే. వాడు పసోడు. తూర్పు పడమర తెలవనోడు "వాడు కయ్యలను మొక్కబోకుండా సూడాల" అదే తన తండ్రి నోటి నుంచి వచ్చిన చివరి మాట. అప్పుడు తాను ఎంతో దర్పంగా, ఎంతో ఠీవిగా, ఛాతిని ముందుకు చొప్పించి, తండ్రి కళ్లలోకి సూటిగా చూస్తూ, "కయ్యల్ను నేనేవిటికి మొక్కబోనిస్తా, కంటిని రెప్ప కాపాడుతున్నట్లు కాపాడుకుంటా. నేను కాపోడికి పుట్టినానా దొమ్మరోనికి పుట్టినానా?" అన్నాడు.

కాని తాను తన తండ్రికిచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ఘోరంగా పరాజయం పొందాడు. ఈ పరాజయ భారాన్ని నెత్తిన

బెట్టుకుని తాను తన తండ్రి ముఖాన్ని ఎలా చూడగలడు? తండ్రి ప్రశ్నలకు తాను ఏమని సమాధానం చెప్పగలడు? ఈ విషయంలో తనకు ఎవరు సహాయం చేయగలరు?

అతడు గ్రామంలోని వాళ్ళను పేరు పేరున జ్ఞాపకం చేసుకున్నాడు. రైతులు, వృత్తి పనివాళ్ళు, కరణం, కోమటి, తలారివాడు, బడిపంతులు, ఇంకా ఎందరో ఆప్తులను, మిత్రులను జ్ఞాపకం చేసుకున్నాడు.

కానీ వాళ్లెవరూ తనకు సహాయం చేయలేరు. వాళ్లంతా ఇహలోకానికి సంబంధించిన వాళ్లు. తనకూ, తండ్రికీ మధ్య ఉన్న సమస్యకు వాళ్లెలా పరిష్కారం సూచించగలరు? బహుశ దేవతలు సూచించగలరేమో. దేవతలు ముక్కోటి మంది ఉన్నారని బ్రాహ్మణుడు చెప్పేవాడు. వాళ్లలో సూర్యుడు కూడా ఒకడట. పగలంతా తాను గడిపేది సూర్యుడు ప్రసాదించే ఎండలోనే రాత్రంతా తాను గడిపేది అతడితమ్ముడు ప్రసాదించే వెన్నెలలోనే. అయి నప్పుడు తాను సూర్యునితో సంప్రదించలేడా? తనతో సూర్యుడు మంతనాలు జరపడా?

మంత్రముగ్ధుని చూపులు వలె బక్కిరెడ్డి చూపులు దిగుడు లోని చీకటి మీద స్థిరంగా నిలిచి ఉన్నాయి. అతని ఆలోచనలు మాత్రం తాగినవాని ప్రేలాపనలవలె, జ్వరపీడితుని సంధి ప్రలాపాలవలె గతులు తప్పిసాగు తున్నాయి.

అతని ఆలోచనలు అలా గతితప్పి సాగుతుండగా తూర్పున సూర్యుడుదయించాడు. సూర్యుని ఏటవాలు కిరణాలు బక్కిరెడ్డి శరీరం మీద పడ్డాయి. ఆ కిరణాలు అతనిని తట్టి లేపినట్టుగా అతనికి అనిపించింది. అతడు కళ్లు తెరచి మంచం మీద లేచి కూర్చున్నాడు.

ఊరికి తూర్పున ఉన్న పర్వత పంక్తిపైన సూర్యుడుద యిస్తున్నాడు. సూర్యబింబం పరిపూర్ణమైన వృత్తాకారంలో ఉంది. ముత్తయిదువ నుదుట ఉండే కుంకుమ బొట్టువలె ఎర్రగా ఉంది.

బక్కిరెడ్డి సూర్యబింబాన్ని తదేకంగా చూడసాగాడు. అలా చూస్తుండగా సూర్యబింబం ముందర ఒక నల్లటి ఆకారం కనిపించింది. బక్కిరెడ్డి కళ్లు చిట్లించుకుని చూడసాగాడు. ఆ నల్లటి ఆకారం సూర్యబింబం నుండి దూకి వచ్చినట్టు అతనికి అనిపించింది. అది క్రమక్రమంగా పెద్దదవుతూ ఇటే వస్తున్నది.

బక్కిరెడ్డి మంచం మీద నిఠారుగా కూర్చుని చూడసాగాడు. కొంత సేపటికి ఆ నల్లటి ఆకారం ఒక గుర్రం తాలూకుదని అతడు పోల్చుకున్నాడు. ఆ గుర్రం మెల్లగా వీధి వెంబడి సాగివచ్చి కొట్టం ముందర వీధిలో ఆగింది. గుర్రం మీద మణియం కూర్చుని ఉన్నాడు. అతడు రికాబులో కాలుపెట్టి కిందకు దిగి కొట్టం వైపు నడిచాడు.

బక్కిరెడ్డి, "నువ్వా, అన్నా, రా. నాకు తెలుసు నువ్వొస్తావని, నువ్వెందుకొ చ్చినావో నాకు తెల్సు. నిన్నెవరు పంపినారో కూడా నాకు తెల్సు" అన్నాడు.

మణియం, "నన్నొకరు పంపేదేందిరా? నేనే వొచ్చినా నిన్న సందేళ నుంచి నువ్వేవోయిద్దిలుజేస్తా ఉండావట".

అతను చెబుతున్న దానిని పూర్తి చేయనీయకుండా బక్కిరెడ్డి అడ్డుపడి, "నాకన్నీ తెల్సు. నిన్ను దేవుడు పంపించినాడు. నాతో మాట్లాడమని పంపించినాడు. నీతో శానా మాట్లాడాలి, రా. ఇట్టకూసో" అంటూ అతని రెక్కపట్టి మంచం మీద కూర్చోబెట్టాడు.

బక్కిరెడ్డికి పిచ్చి పట్టిందన్న వార్త మణియం గత రాత్రి విన్నాడు. ఇప్పుడు స్వయంగా చూస్తున్నాడు. అతడు పసిపిల్లవాడిని చూస్తున్నట్లు బక్కిరెడ్డిని చూడసాగాడు.

బక్కిరెడ్డి, "నేనొగిటడగతానన్నా, నువ్వు మాటివ్వాల. నువ్విస్తావని నాకు తెల్సు. నువ్వొచ్చుండేదే అందుకు. అడగమంటావా?" అన్నాడు.

"ఏందో అడుగు" అన్నాడు మణియం.

బక్కిరెడ్డి, "నేనేవి అడగబోతానో నీకు తెల్సు. తెలవనట్టు అడగతా ఉండావు. ఐనా చెపుతాను పట్టు" అని మంచం మీద బాసింపట్టు వేసుకుని కూర్చుని" ఇప్పుడు బాటకాడ కయ్యలు నీవి. ఒకటిగాదు, రెండుగాదు. పద్నాలుగెకరాలు. సెంటు తక్కువగాకుండా పద్నాలుగెకరాల నేల ఇప్పుడు నీది. ఆ కయ్యల్లో కాసంత జాగా నాకిడిసి పెట్టెయ్యాలన్నా. ఆ బాగిమాను కింద ఇట్ట రెండు బారలు, ఇట్ట రెండు బారలు నాకిడిసి ఎట్టెయ్యాల" అన్నాడు.

"ఏవిటికి? ఆ కాసంత జాగా ఏవి జేసుకుంటావు?" అన్నాడు మణియం.

బక్కిరెడ్డి, "అది కూడా నీకు తెల్సు. తెల్సే అడగతా ఉండావు. అడిగినావు గాబట్టి చెప్తా ఇను "కాని కాసేపు ఆగి" ఒగిటి రెండు దినాల్లో నా కట్టి రాలిపోతుందన్నా, ఇంగ నాకీడ ఏం పని? నా కయ్యలు పోయినాక ఈ భూమ్మీద నాకేంపని? పానం పోయినాక ఈ కట్టిని నా కయ్యల్లో బాగిమానుకింద పూడ్చి పెట్టాలి. ఈ పని నువ్వే దగ్గరుండి చేయించాల. నాకు మాట ఇవ్వన్నా. ఈ పని చేస్తానని మాట ఇవ్వు" అన్నాడు.

మణియం "దాందేం భాగ్యంరా. రొండు బారలేంది. రొండు కొండ్రలు ఇడిసి పెట్టేస్తా. నువ్వీ ఎర్రిమాటలు సాలించి బుద్ధి సోదినంలోకి తెచ్చుకో" అన్నాడు.

బక్కిరెడ్డి, "సాలన్నా సాలు. నువ్వు మాటిచ్చినావు. అదేసాలు. నానోట్లో చెక్కెరపోసినావు. నా కడుపులో పాలు పోసినావు. ఇంగ నేను మా నాయనకు బయపడను. మా నాయనను మొకం పట్టుకొని నేనే యాలివి జేస్తాను. సచ్చిపోయే ముందు మా నాయనకు మాటిచ్చినా అన్న. కంటిని రెప్ప కాపడుకున్నట్టు కయ్యల్ను కాపాడుకుంటానని మాటిచ్చినాను. రేపు నన్ను జూడంగనే మా నాయన, "కయ్యల్ను ఏవి జేసినావురా బక్కా?" అనడగతాడు. అపుడు నేనంటాను! "ఏవి జేసినానో సూడు. కయ్యల్లోనే పడుకోనుండా, వేలును గోరు కాపాడినట్టు కయ్యల్ను కాపాడతా ఉండా. నువ్వేజూడు" అంటా. ఇంగ నేను మా నాయనకు బయపడేపనే లేదన్నా" అన్నాడు.

మణియం తనకర్థం కాని భాషలో సాగుతున్న మాటలను వింటున్నట్టు బక్కిరెడ్డి మాటలను వినసాగాడు.

బక్కిరెడ్డి, "ఇంగ నీ పనులు చూసుకో అన్నా, పొద్దెక్కి వస్తా ఉంది. నీకు లచ్చాతొంభై పనులుంటాయి. నువ్వు పోయి నీ పనులు చూసుకో" అంటూ కాళ్లను సాపుగా చాపి, మంచం మీద వెల్లకిల పడుకుని మెల్లగ కళ్లు మూసుకున్నాడు.

సూర్యుడు క్రమక్రమంగా ఎర్రదనాన్ని గోల్పోతూ ఆకాశం మీద ఎగబ్రాకుతున్నాడు. కొట్టం తాలూకు నీడ క్రమక్రమంగా కిందకు దిగి బక్కిరెడ్డి మీదకు వ్యాపించింది. ఆ నీడ మెల్ల మెల్లగ అతని నుదుటిని ముఖాన్ని, మెడను, రొమ్మును, నడుమును, తొడలను, కాళ్లను అతని శరీరం యావత్తునూ కప్పివేసింది.

12

ఆకాశం నిండా మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. తలపైకెత్తి దిగంతాలవరకు ఎంత వెదికినా చారెడు వెడల్పు నీలాకాశం కనిపించడం లేదు.

మేఘాలు ఆకారంలో ఒకదానికి భిన్నంగా మరొకటి, పరిమాణంలో ఒకదాన్ని మించి మరొకటి ఉన్నాయి. ఇప్పుడు ఈశాన్య దిక్కుగా కదలడం లేదు. ఎక్కడివక్కడ నిశ్చలంగా, గుంభనంగా గంభీరంగా నిలిచి ఉన్నాయి. మేఘాల వెనకనున్న సూర్యుని కిరణాలు సూటిగా భూమిని తాకడంలేదు. ఆ కిరణాలు దిగంతాల వద్ద పరావర్తనం చెంది భూమిని తాకుతున్నాయి. సూర్యుని వెలుగు కొంత సేపు కావిరంగులోను, కొంత సేపు తెల్లని వెన్నెల వలెనూ ప్రకాశిస్తున్నది. భూమి మీద వ్యాపించిన మాయవంటి ఆ వెలుగును చూసి కుక్కలు "భౌ, భౌ"మని మొరుగుతూ వీధులకడ్డదిడ్డంగా పరిగెత్త సాగాయి. మైదానాలలో పశువులు ముకుపుటాలను ఎగురవేస్తూ, కొమ్ములతో భూమిని కుళ్లగించసాగాయి. చెట్లలో కాకులు కావు కావుమని అరుస్తూ ఒక కొమ్మమీద నుండి మరొక కొమ్మమీదకు ఎగురుతున్నాయి. ఆకాశంలో కొంగలు భూమికి సమాంతరంగా ఎగరకుండా పైకి కిందికి ఎగరసాగాయి. కోడి పెట్టలు ఏదో తప్పు చేసినట్లు అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి గూళ్లలో చేరుతున్నాయి. అవి తమ తలలను రెక్కల కింద జొనిపి నిశ్శబ్దంగా పడుకున్నాయి. కోడిపుంజులకు ఇది సంధ్యా సమయమో, వేకువజామో తెలియడం లేదు. అవి అర్థం లేకుండా కూయసాగాయి.

గాలి స్తంభించిపోయి ఆకు అల్లాడడం లేదు. నిశ్చలంగా ఉన్న గాలి క్రమక్రమంగా వేడిని సంతరించుకుంటూ ఉంది. వాతావరణంలో వేడి ఒక స్థాయిని దాటాక తమ అసహనాన్ని చాటుతూ చిమ్మటలు రొద చేయసాగాయి. భూమి యావత్తూ కుమ్మరి ఆవంవలె, చాకలి ఉబ్బవలె ఉడుకుతున్నది. మనుషుల శరీరాలు విపరీతంగా చెమటులు పోయసాగాయి. వాళ్లు తమ శరీరాల మీద నుండి తీసివేయదగిన బట్టలన్నిటినీ తీసివేశారు.

కొందరు రైతులు ఆకాశం వైపు చూసి, "మబ్బులు దిగతా ఉండాయి. ఈశాన్యం మూలన దిగతా ఉండాయి. మావిటేళకు ఖండావర్షం మొదల య్యేట్టుంది. రాత్రికి చెరువు మొరవపొయ్యేది ఖాయం" అనుకున్నారు.

సేద్యపు భూముల్లో పని చేస్తున్న రైతులు తమతమ పనులను ఎక్కడివక్కడ ఆపివేశారు. సేద్యపు పని ముట్లను నెత్తుల మీద, భుజాల మీద పెట్టుకుని ఇంటిదారి పట్టారు. చాకలి వాళ్లు మైదానంలో ఆరవేసిన బట్టలను తీసి గబగబ మూటగట్టారు. మూటలను గాడిదలపై వేసి ఇంటిదారి పట్టారు. కొందరు గ్రామస్థులు అక్కడక్కడ లేచిపోయి ఉన్న తమ ఇండ్ల కప్పులను హుటాహుటిగా పటిష్టం చేశారు. ఇండ్ల మీదకెక్కి కప్పులలోని కంతలను వరిగడ్డితో తాటి యాకులతో కప్పివేశారు. వంట చెరకుగా ఉపయోగించే కట్టెలను తీసుకొచ్చి ఇండ్లలో వేసుకున్నారు.

కొంత సేపటికి గాలి వీచడం ప్రారంభించింది. చెట్ల కొమ్మలు కదలకుండా ఆకులు మాత్రం కదలసాగాయి.

క్రమక్రమంగా మేఘాలు తమతమ ఆకారాలను పోగొట్టుకుని ఒకే మేఘం ఆకాశాన్నంతటినీ కప్పుకుని ఉన్నట్టు కనిపించింది. ఆ

మేఘం కారు నలుపులో ఉన్నది. భూమి మీద చీకట్లు వ్యాపించాయి. ఉరుములు, దాని వెంట మెరుపులు ప్రారంభమయ్యాయి.

పెద్ద పెద్ద చినుకులతో వర్షం ప్రారంభమయింది. చినుకులు భూమిమీద పడిన చోటు నుండి దుమ్ము జానెడెత్తు గాలిలోకి లేస్తూ ఉంది. భూమి యావత్తును ధూళి మేఘాలు కప్పివేశాయి. పడిన చినుకు పడినట్లుగానే భూమిలోకి ఇంక సాగింది. భూమి చినుకులను పీల్చుకుని మట్టి వాసనను వెదజల్లసాగింది. మట్టివాసన అలలు అలలుగా నలుదిక్కులకు వ్యాపించింది.

ఆ మట్టి వాసన బక్కిరెడ్డికి తాకింది.అతడు మంచం మీద లేచి కూర్చున్నాడు. మట్టివాసనతో గూడిన గాలులను ఎదనిండా పీల్చుకున్నాడు. లోభివాడు రత్నరాసులను కుప్పతోసుకుంటున్నట్టు అతడు గాలిని మళ్లీ మళ్లీ పీల్చుకున్నాడు. మట్టివాసన అతని తనువులోని అణువణువునూ తాకింది. ఆ వాసన అతనిలోని ఒక పురాతనమైన ఆకలిని మేల్కొలిపింది. ఆ ఆకలి చండప్రచండంగా ప్రకోపించింది.

అతడు నెమరువేస్తున్న ఎడ్లవైపు చూశాడు. వాటి అర్రులపైన బొచ్చు మొలిచి ఉంది. అతడు గోడకు ఆనించి ఉన్న నాగలిని చూశాడు. దాని మేడి నిఠారుగా నిలుచుని ఉంది.

అతని అరచేతులలో దురద ప్రారంభమయింది. అరచేతులు ముడుచు కుంటూ, తెరచుకుంటూ ఉన్నాయి.

చేతికతికేటంత చిక్కటి చీకటి భూమిని కమ్మివేసింది. వానహోరుమని కురుస్తూ ఉంది. మంటికి మింటికి ఒకటిగా, ఏనుగులు తొండాలతో చిమ్ముతున్నట్లుగా, కుండలతో ముంచి వంచుతున్నట్లుగా వర్షం కురుస్తున్నది. గాలి వేగంగా వీస్తూ

బోదెలతో సహా చెట్లను కుదిపి వేస్తున్నది. ఆకాశాన్ని పాయపాయలుగా చీలుస్తూ మెరుస్తున్నది. ఒకప్పుడు ఫెళ ఫెళర్భాటాలతో, ఒకప్పుడు మంద్రస్థాయిలో ఉరుముతున్నది.

వర్షపు నీరు భూమిని తడిపి వెల్లువలుగా పారసాగింది. వెల్లువలు పల్లానికి ప్రవహించి పిల్లకాలువలలో కలిశాయి. పిల్లకాలువలు వంకరటింకరగా ప్రవహిస్తూ వంకలో కలుస్తున్నాయి. వంకలో నీళ్లు ఎండుటాకులను పుల్లలను నెట్టుకుంటూ ఇసుక మీదుగా చెరువు వైపుగా ప్రవహిస్తున్నాయి.

ఏకధాటిగా కురుస్తున్న వానకు, హోరుమని వీస్తున్న గాలికి జడుసుకుని ఊరు ముడుచుకుని ఉంది. జనం దుప్పట్లు బిగదన్నుకుని గాఢనిద్రలో మునిగిపోయారు. కొందరు ముసలివాళ్లు మాత్రం ప్రకృతి బీభత్సాన్ని వింటూ మేలుకుని ఉన్నారు.

బక్కిరెడ్డి మంచం మీద నుండి లేచాడు. ఎడ్లను కట్టుగొత్తుల నుండి విప్పి కొట్టం బయట నిలబెట్టాడు. నాగలిని ఎడమ భుజం మీదుంచుకుని, చూరు నుంచి ముల్లుగర్రను తీసి కుడిచేతిలో పట్టుకున్నాడు. ఎడ్లను అదిలిస్తూ వీధిలోకి తీసుకొచ్చాడు. వీధిలో వర్షపునీళ్లు ఇండ్ల గోడలను తిన్నెలను వొరుసుకుంటూ ప్రవహిస్తున్నాయి. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. బక్కిరెడ్డి వీధులవెంబడి నడిచి ఊరిని కడిచాడు. మెరుపులు మెరిసినపుడు మాత్రమే దారి కనబడుతున్నది. మెరుపుకాంతి సహాయంతో అతడు సాగుతూ బాటకాడ కయ్యలను చేరుకున్నాడు. పొలంగట్టుమీద నాగలిని దించాడు. మెరుపుకాంతిలో అతడు తన పొలాన్ని ఒకసారి కలియజూశాడు. పద్నాలు గెకరాల భూమి, ఆ భూమి ఎనిమిది కయ్యలుగా విభజింపబడి ఉంది. అందులో ఆరు కయ్యలు పెద్దవి, మిగిలిన రెండూ చిన్న కయ్యలు, కయ్యలన్నీ

వర్షపు నీటితో నిండి ఉన్నాయి. నీళ్లు ఒక కయ్యలో నుండి మరొక కయ్యలోకి ప్రవహిస్తున్నాయి. పొలానికి దక్షిణాన బాగిమాను గాలిపాటుకు కొమ్మలనాడిస్తూ నిలబడి ఉంది.

బక్కిరెడ్డి కాడిమానును ఎడ్ల మెడల మీద ఉంచి పట్టెలను బిగించాడు. నాగలిని కాడిమానుకు పూనించాడు. తలపాగాను బిగుతుగా చుట్టుకున్నాడు. గోచెను నడుము చుట్టూ బిగించి కట్టుకున్నాడు.

పాలు తాగే పసికందు వడివడిగా ప్రాకుతూ తల్లివొడిలోకి ప్రవేశించినట్టు అతడు నాగలితో సహా, ఎడ్లతో సహా కయ్యలలోకి దిగాడు. ఎడమ చేత్తో నాగలి మేడిని అదిమి పట్టాడు. కుడిచేతితో ముల్లు గర్రను పైకెత్తి ఎడ్లను అదిలించాడు. ఎడ్లు నడవసాగాయి. నాగలి భూమిని కోస్తూ సాగుతున్నది.

వర్షం భోరున కురుస్తున్నది. గాలి దిశ మారకుండా రివ్వున వీస్తున్నది. గాలి ఉరవడికి బాగిమాను కొమ్మలు భూమిని తాకేట్టుగా కిందకు వంగు తున్నాయి. చెట్ల ఆకులు, సన్నటి కొమ్మలు గాలికి దూరంగా సుదూరంగా కొట్టుకుని పోతున్నాయి.

బక్కిరెడ్డి శరీరంలోని అంగాంగాల మీద వర్షపు నీరు ప్రవహిస్తూ కిందకు జారుతున్నది. అతని తలపాగా తడిసి, బరువెక్కి కిందకు జారి మెడమీద పడింది. అతడు తలపాగాను తీసి గట్టు మీదకు గిరవాటు పెట్టాడు. నడుము చుట్టూ ఉన్న గోచెతప్ప అతని శరీరం అనాచ్ఛాదితంగా ఉన్నది. గాలి వాన అతని శరీరాన్ని నిర్దయగా బాధించసాగాయి. చలికి అతని శరీరం గడగడ వణుకుతున్నది. పండ్లు టకటక కొట్టుకుంటున్నాయి. చినుకులు అతని శరీరాన్ని ఈటెలవలె తాకుతున్నాయి. క్రమక్రమంగా అతని చర్మం మొద్దుబారిపోయింది. గాలి ఉరవడికి

అతడు తూలిపడబోయి తమాయించు కుంటూ సాగుతున్నాడు. ఆ ప్రయత్నంలో అతడు ఊసరవెల్లి వలె నడు స్తున్నాడు.

అతడు రెండు కయ్యలను దున్నడం పూర్తి చేసి మూడవ కయ్యలోకి ప్రవేశించాడు.

క్రమక్రమంగా అతనికి బలహీనత ముంచుకొస్తున్నది. నాగలి వెంట అడుగు తీసి అడుగు వేయడం గగనమై పోతున్నది. శూలాలతో గుచ్చుతున్నట్లు నడుములోను, వెన్నుపాములోను ఉన్న కీళ్లు నొప్పి పెడుతున్నాయి. ముల్లుగర్రను పట్టుకుని ఉన్న చేతిని భుజం కన్న పైకెత్తడం దుస్సాధ్యమై పోతున్నది. అలసట వలన అతడు సలుపుతున్న ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలు ఎడ్ల బుసలను మించి వినిపిస్తూంది. క్రమక్రమంగా నాగలివేగం మందగించి సాగింది. కాని నాగలి మేడి చుట్టూ ఉన్న అతని పిడికిలి మాత్రం కించిత్తు కూడా సడలలేదు.

13

భళ్లున తెల్లవారేసరికి వర్షం పూర్తిగా ఆగిపోయింది. నీలాకాశం మేఘ రహితంగా నిర్మలంగా, స్వచ్ఛంగా ఉంది. గత రాత్రి అంతటి భీభత్సాన్నీ సృష్టించింది. ఈ ఆకాశమేనా అన్న అనుమానం కలిగిస్తూంది.

గాలి మళ్లీ స్తంభించిపోయి ఆకు అల్లాడడం లేదు. గత రాత్రంతా తలలు వంచుకుని ఉండిన చెట్లు నిటారుగా నిలబడి ఉన్నాయి. విరిగిన కొమ్మలు కొన్ని కనుచూపు దూరంలో కొన్ని కానరాని దూరంలో పడి బురదలో కూరుకుపోయి ఉన్నాయి.

తూర్పున వెలుగు రేకలు కనిపిస్తుండగా బక్కిరెడ్డి భార్య పడకమీద నుండి లేచింది. ఆమె కొట్టంలోకి వచ్చి చూసింది. మంచం మీద ఈతచాప ఉన్నది. తలవైపున తలగడ ఉన్నది. మంచం మీద తన భర్త కనిపించడం లేదు. ఎడ్లు రెండూ కనిపించడం లేదు. పగ్గాలు లేని కట్టుగొత్తులు బోసిగా కనిపించాయి. గోడకు ఆనించి ఉండిన నాగలి కనిపించడం లేదు. కాడిమాను, దానికి సంబంధించిన దారాలు కనిపించడం లేదు. ఆమె తల ఎత్తి చూసింది. చూరులో గుచ్చి ఉండిన ముల్లుగర్ర లేదు.

ఆమె తన భర్తతో నలభై ఏండ్లుగా కాపురం చేస్తున్నది. కోటానుకోట్ల రహస్యాలతో కోటాను కోట్ల వైరుధ్యాలతో నిండిఉన్న ఈ ప్రపంచాన్ని గురించి ఆమెకేమీ తెలియదు. కాని తన భర్తను గురించి ఆమెకు క్షుణ్ణంగా తెలుసు.

కొట్టాన్ని పూర్తిగా కలయజూసి ఆమె శిలా ప్రతిమలా నిలబడి పోయింది. అలా కాసేపు నిలబడి ఒక పొలికేక పెట్టింది. ఆ కేక విని ఇరుగుపొరుగు ఇండ్లలో నిద్రిస్తుండిన వాళ్లు దిగ్గున మేల్కొన్నారు. అప్పటికే నిద్రలేచి ఉండిన వాళ్లు ఆ కేక విని బిత్తరపోయారు. వాళ్లు తాము చేస్తుండిన పనులను వదిలి పెట్టి కొట్టంలోకి పరుగున వచ్చారు.

అప్పటికే ఆమె పరుగు ప్రారంభించింది. ఆమె అడుగులు వీధిలోని బురదలో తపతప పడుతున్నాయి. ఇరుగుపొరుగు వాళ్లు ఆమెను వెంబడించి పరుగెత్తసాగారు. తన గమ్యం స్పష్టంగా తెలిసినట్లు ఆమె పరుగెడుతూ వుంది. పరుగెత్తుతుండగా ఆమె పాదాల కింద నుండి బురద నలుదిక్కులకూ చిమ్ముతూ ఉంది.

కొట్టం వద్ద ఎత్తిన పరుగును ఆమె బాటకాడ కయ్యల వద్ద ఆపింది. ఇరుగు పొరుగు వాళ్ళు గసపోసుకుంటూ వచ్చి ఆమె పక్కల్లో నిల్చున్నారు.

అప్పటికి సూర్యుడు ఉదయిస్తున్నాడు. కయ్యలు ఎనిమిది నీటితో నిండి ఉన్నాయి. ఆ నీళ్లు నిశ్చలంగా, ప్రశాంతంగా ఉన్నాయి. నీటి ఉపరితలం మీద సూర్యుని ఎర్రని కిరణాలు ప్రతిఫలిస్తున్నాయి. పొలానికి దక్షిణ దిక్కున ఉన్న బాగిమాను తాలూకు ప్రతిబింబం అద్దంవలె ఉన్న నీటిమీద స్పష్టంగా కనిపిస్తోంది.

పొలం మధ్య ఎడ్లు రెండూ నిలబడి నెమరు వేస్తున్నాయి. నాగలి మేడి పక్కకు పడిపోయి ఉంది. బక్కిరెడ్డి ఎడమ చేతి పిడికి నాగలి మేడి చుట్టూ బిగుసుకుని ఉన్నది. కుడిభుజము, ముఖము బురదలో సగానికి కూరుకు పోయి ఉన్నాయి.

చీర అంచులను పైకెత్తి పట్టుకోకుండా ఆమె పొలంలోకి దిగింది. నిశ్చలంగా ఉన్న నీళ్లలో ఆమె పాదాల తాకిడికి అలలు బయలుదేరాయి.

14

గ్రామంలో సంచలనం బయలుదేరింది. "బక్కిరెడ్డి సచ్చిపోయినాడంట. బాటకాడ కయ్యల్లో సచ్చిపడుండాడంట." ఈ వార్త గ్రామంలోని ప్రతి వీధి వెంబడీ పరుగెత్తింది. ప్రతి ఇంటి గడపనూ ఎక్కి దిగింది.

గ్రామస్థులందరూ బాటకాడ కయ్యలవైపు పరుగెత్తసాగారు. అడ్డపంచెలను, గోచీలను ఎగగట్టుకుంటూ మగవాళ్లు పరుగెత్త

సాగారు. కొప్పులను పైటలను సవరించుకుంటూ ఆడవాళ్ళు పరుగెత్తసాగారు. ఎక్కు పెట్టి విడిచిన బాణం వలె, వడిసెలలో పెట్టి వదలిన రాళ్ళవలె పిల్లలు పరుగెత్తసాగారు. నడవలేని కుంటివాళ్ళను, ముసలివాళ్లను దృఢకాయలు భుజాల మీద ఎక్కించుకొని తీసుకొచ్చారు.

ఆకాశంలో ఎర్రటి సూర్యుడు ఎగబ్రాకుతున్నాడు.

కలరా సోకినట్టు, ప్లేగు సోకినట్టు గ్రామం నిర్మానుష్యమ యింది. గ్రామస్థుల నిరంతరమైన పరుగులవల్ల గ్రామానికి, బాటకాడ కయ్యలకు మధ్య ఉన్న దారి రొళ్ళు రొళ్ళు అయిపోయింది.

నిన్నటి రోజున ఆకాశం మేఘాలతో నిండి ఉన్నట్లు, ఈ ఉదయం బాటకాడ కయ్యలు మనుషులతో నిండి పోయింది. ఆ గుంపు క్రమ క్రమంగా పెరగసాగింది. జ్యేష్ఠమాసంలో చంద్రుని చుట్టూ మండపం ఏర్పడినట్టు కాడెద్దులను, నాగలిని, మృతదేహాన్నీ చుట్టుముట్టి వాళ్ళు వలయాకారంగా నిలుచున్నారు. ముందున్నవాళ్లు తలలను వెనకకు తిప్పి తాము చూసిన వింతను వెనకున్నవాళ్ళకు వివరిస్తున్నారు. వెనకనున్నవాళ్ళు ముందున్నవారి భుజాల మీదుగా నిక్కి నిక్కి చూస్తున్నారు.

మేడి చుట్టూ బిగుసుకుని ఉన్న ఎడమచేతి పిడికిలిని, ముల్లుగర్ర చుట్టూ బిగుసుకుని ఉన్న కుడిచేతి పిడికిలిని, బురదలో సగానికి కూరుకుపోయి ఉన్న దేహాన్ని వాళ్ళందరూ చూశారు. ఆ దృశ్యం వాళ్లందరి కళ్ళలో చిరస్థాయిగా ముద్రవేసుకున్నది. పడగపై దెబ్బ వేసినవాడి రూపం నాగుపాము కళ్లలో ముద్రవేసినట్లు ఆ దృశ్యం వాళ్ళ కళ్ళలో ముద్రవేసుకున్నది. ద్రౌపతి సిగ దుశ్శాసనుని చేతిలో చిక్కి ఉన్న దృశ్యం భీమసేనుని

కళ్ళల్లో ముద్రవేసుకున్నట్లు ఆ దృశ్యం వాళ్ల కళ్ళలో ముద్రవేసుకున్నది.

కోటానుకోట్ల సార్లు కనురెప్పలనప్పళించినా ఆ దృశ్యం వాళ్ళకళ్ళనుండి చెరిగిపోదు. కోటాను కోట్ల అనుభవాల అనంతరం కూడా ఆ దృశ్యం వాళ్ళకు మరపురాదు.

15

మొలకల పున్నమిరాత్రి బక్కిరెడ్డి మరణించాడు. మణియం అతనికిచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. బాటకాడ కయ్యలలో బాగిమానుకింద అతనిని భూస్థాపితం చేయించాడు. తానే దగ్గరుండి అంత్యక్రియలను శాస్త్రోక్తంగా చేయించాడు.

మణియంగారి పూర్వీకులు ఆ ప్రాంతాన్ని ఏలిన పాళెగాళ్ళు. ఇప్పటికీ జిల్లాలో స్థిర చరాస్తుల విషయంలో మణియంగారిదే పైచేయి. ఆ గ్రామంలోను చుట్టుప్రక్కల గ్రామాలలోను ఏ విషయంలోనైనా మణియం గారిదే చివరిమాట.

గ్రామానికి ఉత్తరం వైపున చెరువు వుంది. సంవత్సరానికి ఒకసారి చెరువులో చేపల పంటను వేలానికి పెడతారు. వేలంలో చాలా మంది పాల్గొంటారు. కాని చివరి పాట మణియం గారిదే.

గ్రామానికి పడమరవైపున రాష్ట్ర రహదారి ఉన్నది. రహదారికిరువైపుల చింత చెట్లు ఉన్నాయి. సంవత్సరానికి ఒకసారి చింతకాపును వేలానికి పెడతారు. వేలంలో ఎంతో మంది పాల్గొంటారు. కాని చివరిపాట మణియంగారిదే.

వైశాఖ, జ్యేష్ఠ మాసాలలో పెండ్లిండ్లు జరుగుతాయి. పెండ్లి తాంబూలాలు ఇంటింటికీ వెడతాయి. కాని మొదటి తాంబూలం మణియం గారింటికే చేరాలి.

ఊరు రహదారిపక్కగా ఉంది గనుక బిక్షగాళ్ళు తరచు ఊర్లోకి వస్తుంటారు. అలా వచ్చిన వారికి తొలిబిక్ష మణియం గారింటి నుండే లభించాలి.

అప్పుడప్పుడు ప్రభుత్వాధికారులు ఊరిలోకి వస్తుంటారు. అధికారులు మణియంగారి ఆతిద్యాన్ని స్వీకరించాకనే తమ పనులు ప్రారంభించాలి.

ఎన్నికల సమయాలలో అభ్యర్థుల జీపులు గ్రామంలోకి వస్తాయి. అభ్యర్థులు మణియంగారి ఆశీర్వాదం పొందాకనే తమ ప్రచారం కార్యక్రమాలు మొదలు పెట్టాలి.

అప్పుడప్పుడు ఆ గ్రామంలో రైతులు తమ కయ్యలను వదిలి పెట్టి వలస వెళ్ళుతుంటారు. కయ్యల అమ్మకానికి లాంఛనప్రాయంగా వేలం జరుగుతుంది. వేలం పాటలో ఎందరో పాల్గొంటారు. కాని చివరి పాట మణియందే. ఆ కయ్యలు మణియంగారి భూముల్లో కలిసిపోవలసిందే.

దూరపు గ్రామాలలో బ్రతుకుతెరువు పోగొట్టుకున్న వాళ్ళు కడుపు చేత బట్టుకుని ఆ గ్రామానికి వస్తుంటారు. అలాంటి వాళ్ళకు కూలి పని దొరికిన, కౌలుకు భూమి దొరికినా మణియం గారి వద్దనే దొరకాలి.

ఈ సంప్రదాయాన్ని నిలబెట్టుకోవడానికే మణియం, బాటకాడ కయ్యలను కొన్నాడేగాని, అతనికి భూ వసతి తక్కువై కాదు. కనుక అతడు బాటకాడ కయ్యలను సాగు చేయలేదు. కొనుగోలు పత్రాన్ని మాత్రం భద్రపరిచాడు. ఆ పత్రానికి నాలుగు మూలలా పసుపు

బొట్లు పెట్టి ఒక ఇనుప పెట్టెలో పదిలపరిచాడు. ఆ పెట్టెలో అలాంటి పత్రాలు కొన్ని వందలున్నాయి. ఆ పెట్టలో సాక్షుల సంతకాలు మరికొన్ని వందలున్నాయి. ఆ పెట్టెలో నల్లటి రంగు అంకెలు, అక్షరాలు కొన్ని వేల సంఖ్యలో ఉన్నాయి.

ఆ పెట్టెకు దోసెడు ప్రమాణమున్న తాళం వ్రేలాడుతూ ఉంది. ఆ పెట్టె మణియం గారి భవంతిలో రెండవ అంతస్తులోని ఒక గదిలో ఉంది. పెట్టెకు వ్రేలాడుతున్నట్టుగానే ఆ గది తలుపుకు కూడా దోసెడు ప్రమాణమున్న తాళం వ్రేలాడుతూ ఉంది.

16

అమ్మకపు పత్రం ఇనుప పెట్టలో ఉంది. అమ్ముడయిన కయ్యలు బీడు పడి వున్నాయి. అమ్మకం దారుడు బాగి మానుకింద ఆరడుగుల లోతున భూస్థాపితమై ఉన్నాడు. కాని అతనిని గురించిన జ్ఞాపకాలు గ్రామస్థుల మస్తిష్కాలలో నిరంతరం మెదులుతూనే ఉన్నాయి.

మణియం తన కచేరిలో కూర్చొని ఉండగా ఎందరో వచ్చి అతనిని సందర్శిస్తారు. ఎన్నెన్నో గాథలు, బాధలు వినిపిస్తారు. ఎన్నెన్నో విన్నపాలు చేస్తారు. కాని బక్కిరెడ్డి చేసిన విన్నపం లాంటిది అతడెప్పుడూ వినలేదు. పానం పోయినాక నా కట్టెని నాకయ్యల్లో బాగిమాను కింద పూడ్చి పెట్టాల. ఈ పని నువ్వే దగ్గరుండి చెయ్యించాల. నాకు మాట ఇవ్వన్నా. ఈ పని చేస్తానని నాకు మాట ఇవ్వు. ఎంత చిత్రమైన విన్నపం! “సచ్చిపోయేముందు నా నాయనకు మాటిచ్చినానన్నా, కంటిని రెప్పలు కాపాడుకున్నట్టు కయ్యల్ను కాపాడుకుంటానని మాటిచ్చినా. రేపు నన్ను జూడంగా మా నాయన “కయ్యల్నేవి జేసినావురా బక్కా?” అనడగతాడు.

అప్పుడు నేనంటాను. 'ఏవి జేసినానో సూడు. కయ్యల్లోనే పడుకోనుండా. వేలును గోరు కాపాడినట్టు కయ్యల్ను కాపాడతా ఉండా. నువ్వే సూడు అంటా. ఇంగ నేను మా నాయనకు బయపడే పనేలేదన్నా' ఎంత విచిత్రమైన నమ్మకం!

మరణానంతరం జీవితం ఉంటుందని మణియం ఎప్పుడో విన్నాడు. కాని దానిని గురించి అతడెప్పుడూ ఆలోచించలేదు. చనిపోయిన బక్కిరెడ్డి నిజంగానే తన తండ్రిని కలుస్తాడా? ఆ తండ్రి అలా అడుగుతాడా? బక్కిరెడ్డి తన ముఖతః వినిపించినపుడు మణియం పట్టించుకోలేదు. అది పిచ్చివాడి ప్రేలాపనగా భావించాడు. కాని నాగలి మేడి చుట్టూ బిగుసుకుని ఉన్న ఎడమ చేతి పిడికిలిని, ముల్లుగర్ర చుట్టూ బిగుసుకుని ఉన్న కుడిచేతి పిడికిలిని, బురదలో సగానికి కూరుకుపోయి ఉన్న శరీరాన్ని చూశాక మణియం గారి అభిప్రాయం మారసాగింది.

17

దుక్కి దున్నడానికి, అడుసు దున్నడానికి నాగళ్లను పూన్చుతున్నప్పుడు రైతులకు 'బాటకాడ కయ్యలు' జ్ఞాపకమొస్తాయి. "కయ్యలు పోయినాక ఇంగ చేసే పనేముంది? చెవిలో ఎలుకల మందు పోసుకోవాల. లేకపోతే చింత చెట్టుకు ఉరేసుకోవాల. ఏదో ఒగిటి చేస్తా. కయ్యలు పోయినాక ఈ బూమ్మీద నాకేం పని?", "సరదాలట్టా కయ్యలను దారబోసుకుని చేతులు కడుక్కుంటి. ఇంగ తిండి యట్ట దిగుతుందిరా. ఇంగ కంటికి నిద్ర యట్లొస్తుందిరా" నాగలి భూమిని కోస్తూ చేసే చప్పుడులో, గాలి చెట్ల గుండా వీస్తూ చేసే చప్పుడులో ఆ మాటలే వాళ్ళకు వినిపిస్తాయి.

కయ్యల్ను పోగొట్టుకున్న తరవాత గ్రామంలో ఇక ఉండలేక దేశాంతరం వెళ్లిపోయిన రైతులను వారెరుగుదురు. కయ్యలపైన మరులు తెంచుకోలేక పొలం గట్ల మీదున్న చెట్లకు ఉరేసుకున్న రైతులను వారెరుగుదురు. పొలం మధ్య కూర్చుని చెవిలో ఎండ్రిన్ పోసుకుని నేలకొరిగిన రైతులను వారెరుగుదురు. కాని అమ్ముడైపోయిన తన పొలాన్ని దున్నుతూ, పొలంలోనే వొరగి పోయిన రైతును వాళ్లు మొదటిసారి చూశారు.

బురదలో సగానికి కూరుకుపోయిన అతని ముఖంలో ఎంత ప్రశాంతత ఉండింది! ఎందుకుండదు? తను నేల కొరిగింది తన కయ్యలలోనే. తన ఎడమ చేతి పిడికిట్లో ఉన్న మేడి తన నాగలిదే, తన కుడిచేతి పిడికిట్లో ఉన్నది తన ముల్లుగర్ర. ఈ ఎరుకతోనే అతడు అంతిమ శ్వాస వదిలాడు.

ఆ ముఖంలో అంతటి ప్రశాంతత, అంతటి తృప్తి దుర్యోధనుని రాజ్యాధికారంపైన ఎంతటి మమకారం! ధర్మజునికి సత్యవాక్పరిపాలనపైన ఎంతటి మమకారం! అంతకు పదింతల మమకారం రైతుకు కయ్యల పైన ఉండటం వాళ్ళు మొదటిసారి చూశారు.

ఈ జ్ఞాపకాలు తలలో మెదులుతుండగా రైతులు పరాకుగా పొలాలు దున్నుతారు. అప్పుడు నాగేటి చాళ్లు వంకర టింకరగా సాగుతాయి. అలా రెండు కొండ్రలు దున్నినాక వాళ్ళు తమ నాగళ్ళు సాగుతున్న తీరును, తమ పరాకును గమనిస్తారు. అప్పుడు వాళ్ళ మస్తిష్కాలు పరాకుకేగాక వైరాగ్యానికి గూడా ఆలవాలమవుతాయి. నాగేటి చాళ్లు వంకర టింకరగానే గాక మందకొడిగా సాగుతాయి.

18

కంసాలి తన కొలిమి ముందు కూర్చుని ఉన్నప్పుడు కొలిమిలో బొగ్గులు రగులుతుండగా, అతని తలలో 'బాటకాడ కయ్యలు'ను గురించిన జ్ఞాపకాలు రగులుతూ ఉంటాయి. "ఆచారీ, ఈ మొబ్బుల్దిరిగేజ్జుస్తా వుంటే రెండు మూడు దినాలలో తొలకరి వానలు మొదలయ్యేట్టుండాయి. బాపనాయన పంచాంగం చూసి ఆ మాటే చెప్పినాడు. చినుకు నేల మీద పడిందంటే మల్ల రెండు కాళ్లొకచోట పెట్టేదానిగ్గూడ తీరుబాటుండదు.

మా ఎడ్లకు గొట్టిలరిగి పోయి చిగుర్లోంచి నెత్తురు సుక్కలు సుక్కలుగ కార్తా ఉంది. ఒక దినం గూడా ఆలస్యం చేయకుండా వాటికి నాడాలు కొట్టాల. ఎడ్లను ఈడికి తీసుకుని రమ్మంటావా? నువ్వే కొరముట్లు తీసుకుని ఇంటిదాక వస్తావా?" కొలిమి మంటలు చేసే సవ్వడిలో కంసాలికి ఈ మాటలు సదా వినిపిస్తుంటాయి. తన కొలిమిలో వ్యవసాయపు పనిముట్లను గాక రైతులను హతమార్చడానికి ఉపయోగపడే మారణాయుధాలను తయారు చేస్తున్నట్లు అతనికి అనిపిస్తూ ఉంటుంది. తన కొలిమిలో మండుతున్నవి బొగ్గులు కావని, అవి రైతుల ఎముకలని అతనికి అనిపిస్తుంటుంది.

19

కరణం ప్రతిరోజూ క్రమం తప్పక కచేరికి వస్తూ ఉండేవాడు. కాని ఇప్పుడతడు కచేరికి అరుదుగా వస్తున్నాడు. వచ్చినప్పుడు కూడా వేళగాని వేళల్లో వస్తున్నాడు. కచేరిలో ఉన్న కొయ్య

బీరువాను తెరవడం లేదు. పాపాలు పుట్టలుగా పెరిగి ఆ బీరువా నంతటినీ ఆక్రమించుకుని ఉన్నట్లు అతని కనిపిస్తూ ఉంది.

అతడు భూమి పట్టాల తాలూకు పుస్తకాలను తీసి బల్లమీద వేసి పరిశీ లించడం లేదు. అతడు నేలమీద కూర్చుని, తన ముందర వ్యాసపీఠం మీద భగవద్గీతను ఉంచుకుని గీతాపారాయణం చేస్తున్నాడు. నాలుగు శ్లోకాలు చదివాక అక్షరాలు అల్లుకుపోయి ఉన్నట్లు అతనికి అనిపిస్తుంది. అతడు కళ్ళజోడును తీసి తువ్వాలుతో తుడిచి మళ్ళీ చదవడానికి ప్రయత్నిస్తాడు.

శ్లోకాలకు బదులు అమ్మకపు పత్రంలోని వాక్యాలు అతనికి కనిపిస్తాయి. "ఈ భూమిని సర్వహక్కులతో సహా ఈ రోజున నీకు స్వాధీనము చేసితిని. ఇంతటి నుండి నీవు సదరు విక్రయాస్తిపై సంపూర్ణ హక్కు భుక్తములు కలిగి యుండి, ఇందలి తరు, జల పాషాణాది నిధినిక్షేపాలతో సహా నీ యిష్టానుసారము పుత్రపౌత్ర పారంపర్యముగ దాన, విక్రయాది సమస్తాధికారములతో సుఖాన అనుభవించగలవు" ఇందుకు సాక్షులు ముగ్గురు. ఆ ముగ్గురిలో తానొకడు.

దేనికి తాను సాక్షి? శ్రీరాముడిని అయోధ్య నుంచి వేరు చేసినట్లు ఒక రైతును అతని భూమి నుండి వేరు చేశారు. అందుకు తాను సాక్షి. దశరథుడు పుత్రశోకంతో మరణించినట్లు రైతు భూమి శోకంతో మరణించాడు. అందుకు తాను సాక్షి కరణం భగవద్గీతను మూసివేసి, వ్యాసపీఠాన్ని దూరంగా జరుపుతాడు. వెనక్కు జార్లగిలి, గోడకు ఆనుకుని కూర్చుని, తన ఎదుట ఉన్న కొయ్య బీరువాను నిర్జీవమైన కళ్ళతో చూస్తుంటాడు.

20

వీధినాటకం వారి జోబిడీ వలస పోయిన వాడి ఇల్లు లాగ మారింది. జోబిడి చుట్టూ పచ్చగడ్డి జానెడెత్తు పెరిగింది. అక్కడక్కడ వెంపలి చెట్లు, జిల్లేడు చెట్లు పెరుగుతున్నాయి. జోబిడి ద్వారానికిరువైపుల ఉన్న తిన్నెలమీద ఎండుటాకులు గాలికి కొట్టుకుని వచ్చి దట్టంగా పేరుకుని ఉన్నాయి. జోబిడి తలుపు తాళం వేసి ఉంది. బక్కిరెడ్డి చనిపోయిన రోజున వేసిన తాళాన్ని తరవాత ఎవరూ తీయలేదు. వొద్దికలు పాడడం ఆ రోజే ఆగిపోయింది.

"కరకురాల్ తోవలో బామా మెల్లగాను నడిచిరాయే" అదే వాళ్ళు పాడిన చివరి నుడుగు.

జోబిడిలో గోడకు తబల, హార్మోనియం వంటి సంగీతవాయిద్యాలు వ్రేలా డుతూ ఉన్నాయి. వాటి మధ్య సాలెగూళ్ళు పెరుగుతున్నాయి. జోబిడిలో ఒక మూలన మచ్చు మీద నాటకపు పుస్తకాలున్నాయి. వాటి మీద దుమ్ము అడ్డేలు పేరుకుని ఉంది. వొద్దికలు పాడేటప్పుడు ఉపయోగించే లాంతరు మరొక మూలన ఉంది. దానిలోని కిరోసిన్ ఆవిరై ఎండిపోయి ఉంది.

నాటక పాత్రధారులెవరూ జోబిడి ఛాయలకు రావడం లేదు. వొద్దికలు పాడి నేర్చుకున్న పాటలను, సంభాషణలను వాళ్ళు మరచి పోసాగారు. హరిశ్చంద్ర పాత్రధారి మాత్రం అప్పుడప్పుడు జోబిడి వైపు వస్తాడు. ఎక్కడా ఆహారం దొరకని కుక్కవలె

తచ్చాడుతూ వచ్చి అరుగు మీద కూర్చుంటాడు. అడవులలో తిరుగుతూ హరిశ్చంద్రుడు పడిన ఇడుములను అతడు జ్ఞాపకం చేసుకుంటాడు. ఎండకన్నెరగని చంద్రమతి రాళ్ళు రప్పలతో నిండిన త్రోవలో నడుస్తుంటే పాదాలు చిట్లి రక్తం కారుతూవ ్ంటుంది. దారి పక్కన ఆమె సోలిపోతుంది. అప్పుడు హరిశ్చంద్రుడు ఆమెను అనునయిస్తూ,

"కరకు రాల్ తోవలో బామా

మెల్లగాను నడిచిరాయే" అని పాడతాడు. ఆ చరణాన్ని పాడేటప్పుడు దుఃఖం అభినయించడానికి హరిశ్చంద్ర పాత్రధారి చేసే ప్రయత్నాలన్నీ విఫలమయ్యేవి. నాటకం నేర్పే వాద్యారి కోపగించుకునేవాడు. పాడిన చరణాన్నే మళ్ళీ మళ్ళీ గొంతు వాచిపోయేదాక పాడించేవాడు. ఎంత చేసినా గొంతులోగాని, ముఖంలోగాని దుఃఖ రసం కనిపించేది కాదు.

కాని ఇప్పుడతడు జోబిడి అరుగు మీద కూర్చుని ఉండగా అప్రయత్నంగా అతని కళ్ళు చెమర్చుతున్నాయి. నాగలి మేడి చుట్టు బిగుసుకుని ఉన్న ఎడమ చేతి పిడికిలి, ముల్లుగర్ర చుట్టూ బిగుసుకుని ఉన్న కుడి చేతి పిడికిలి, బురదలో సగానికి పైగా కూరుకుపోయి ఉన్న శరీరం జ్ఞాపకం రాగానే అతని కనుకొలకుల్లో నీళ్లు నిలుస్తాయి.

వానలు ఎగిడ్చుకుని మూడు సంవత్సరాలయింది. ఊర్లో హరిశ్చంద్ర నాటకం ఆడిస్తే వానకురుస్తుందని వొద్దికలు ప్రారంభించారు. నాటకం ప్రదర్శించకుండనే చెరువు నిండింది. మొరవ హోరుమని సవ్వడిచేస్తూ ప్రవహిస్తున్నది. తూము గుండా నీళ్ళు సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్నాయి. గుట్టకింద ఉన్న మెట్టభూములు, చెరువు కింద ఉన్న మాగాణి భూములు

శాంబరించి పోయి అడుగు వేస్తే మడమల వరకు కాళ్ళు కూరుకు పోతున్నాయి. బావులు, దొరువులు నిండి దబక లెత్తుతున్నాయి. అంతా ఒక్క రోజున జరిగిపోయింది.

మూడు సంవత్సరాలుగా సాగిన గ్రామస్థుల నిరీక్షణ ఒక్కరోజులోనే నెరవేరింది. మూడు సంవత్సరాలుగా వాళ్ళలో అంతకంతకు తరిగిపోతూ ఉండిన జీవితేచ్ఛ మొటకల పున్నమి రోజున ఒక్కసారిగ తిరిగి పుంజుకుంది. కాని అదే పున్నమి రోజున మూడు తరాల వరకూ జ్ఞాపకముండి పోయే సంఘటనను తాము చూడవలసి వస్తుందని గ్రామస్థులెవరూ ఊహించలేదు.

రుజ, జరా భారాలతో మనుషులు తనువు చాలించడం వారెరుగుదురు. ఆకలితో, అర్ధాకలితో మనుషులు రాలిపోవటం వారెరుగుదురు. హత్యలతో, ఆత్మహత్యలతో మనుషులకథ సమాప్తమవడం వారెరుగుదురు. ప్రమాదాలలో, క్రూర మృగాల దాడులలో సంభవించే దుర్మరణాలను వారెరుగుదురు.

కాని అమ్ముడైపోయిన తన పొలాన్ని జడివానలో రాత్రి పొడవునా దున్నుతూ కేవలం అలసట మూలాన నాగేటి చాలులో కూలిపోయి కన్నుమూయడం వాళ్ళిదివరకు చూడలేదు. వాళ్ళు భూమిపై నడయాడుతుండినన్నాళ్లు ఆ దృశ్యాన్ని మరచిపోలేరు. వారి తరువాతి తరం వారు తమ తండ్రుల ద్వారా, తాతల ద్వారా ఈ ఉదంతం వింటారు. వాళ్లలో కొందరు దీనిని నమ్ముతారు. కొందరు దీనిని కట్టు కథగా భావిస్తారు.

21

మాఘమాసం ప్రవేశించింది. బక్కిరెడ్డి చనిపోయి ఆరు నెలలయింది. ఈ ఆరు నెలల్లో గ్రామం ఎంతో మార్పు చెందింది.

ఆరునెలల క్రితం ఎండి నెరియలు చీలి ఉండిన, చెరువు నీటితో నిండి కన్నుల పండువుగా ఉంది. ఆరు నెలల క్రితం పన్నెండు బారల చేంతాటికి కూడా నీళ్లు అందని బావులు ఇప్పుడు చేతితో బొక్కెనతో ముంచుకోవడానికి వీలుగా నిండి ఉన్నాయి. ఆరు నెలల క్రితం ఎండి వొరుగైపోయిన గడ్డితోను, చెదలుతోను, నిండి ఉన్న మైదానాలు పచ్చగడ్డితో సీతాకోక చిలకలతో శోభాయమానంగా ఉన్నాయి. గుట్టకింద ఉన్న మెట్టభూములలో ఆరునెలల క్రితం గులక రాళ్లు, ఎర్రమట్టి మాత్రం కనిపించేది. ఇప్పుడా భూములలో పచ్చని ఆకులు, పసుపు రంగు పూత కలిగిన వేరుసెనగ చేలు తివాచీవలె పరుచుకుని వున్నాయి. చెరువు కింద వున్న భూములు, ఆరు నెలల క్రితం వెంపలి చెట్లతో, జిల్లేడు చెట్లతో నిండి ఉండేవి. ఇప్పుడా భూములలో వరి పైరు ఏపుగా పెరిగి గాలి పాటుకు సముద్రపు అలలవలె కదులుతున్నాయి. ఆరు నెలల క్రితం మేకలను కాసే కుర్రాళ్లు తప్ప సేద్యపు భూములు నిర్మానుష్యంగా ఉండేవి. ఇప్పుడు భూములలో వేకువ జామునుండి సందెవేళ వరకు సేద్యపు పనిముట్లను చేత బట్టుకుని రైతులు హడావిడిగా తిరుగుతూ కనిపిస్తున్నారు. సందెవేళ నుండి వేకువ జాము వరకు కావలివాళ్ల కేకలు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి.

గ్రామస్థుల అంతరంగాలలో సైతం ఈ ఆరు నెలల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. మొలకలపున్నమి రోజున జరిగిన సంఘటనను వాళ్ళు క్రమక్రమంగా మరచిపోసాగారు. బక్కిరెడ్డిని

గురించిన జ్ఞాపకాలు వాళ్ళ ఆలోచనలో ఎప్పుడోగాని రావడంలేదు. ఆ ప్రసక్తి వాళ్ల సంభాషణలలో అరుదుగా మాత్రమే వినిపిస్తూంది. బురదనీటి అడుగున గులకరాళ్ళవలె, పొగమంచు వెనక కొండశిఖరం వలె బక్కిరెడ్డి జ్ఞాపకాలు మరుగున పడి పోతున్నాయి.

కాలచక్రం నిరంతరంగా పరిభ్రమిస్తుండగా బక్కిరెడ్డి గ్రామస్థుల ఆలోచనల నుండి పూర్తిగా తొలగిపోవచ్చు. అలా జరగడం కాలపురుషునికి ఇష్టంలేదు కాబోలు? బక్కిరెడ్డి ఆ గ్రామ చరిత్రలో ఒక మైలురాయిగా మిగిలిపోవాలన్నదే కాలపురుషుని సంకల్పం కాబోలు.

కాలపురుషుని సంకల్పం వల్లనైతేనేమి, కాకతాళీయంగా నైతేనేమి మాఘ మాసంలో ఒక వింత సంఘటన జరిగింది. ఆ సంఘటనతో బక్కిరెడ్డి మరణం గ్రామ చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకున్నది. ఆ సంఘ టనతో బాటకాడ కయ్యలు గ్రామ నైసర్గిక రూపంలో ఒక కొండ గుర్తుగా మిగిలి పోయింది. ఆ సంఘటన మణియంగారి పశువుల కొట్టంలో ప్రారంభ మయింది.

22

మణియంగారు తన పశు సంపదపైన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాడు. అతని పశువుల మందలో ఎద్దులు, ఆవులు, దూడలు అన్నీ కలిసి ముప్పైకి పైగా ఉన్నాయి. పశువుల కొట్టం మణియంగారి భవంతిని ఆనుకుని ఉన్నది. కొట్టం సువిశాలమైనది. దాని చుట్టూ ఎత్తయిన గోడ ఉన్నది. కొట్టం లోపల రెండు గడ్డివాములు. ఒక చేద బావి ఉన్నాయి. చేదబావి పక్కన పొడుగాటి గార తొట్టి ఉన్నది.

ప్రతి దినము పశువులను మేపుకు రావడానికి ఒక పశువుల కాపరి ఉన్నాడు. అతడు పన్నెండేండ్ల మూగవాడు.

మూగవాడు ప్రతిదినం పొద్దు నాలుగు బారలెక్కేటప్పటికి పశువులను కొట్టం నుండి బయటకు వదులుతాడు. అవి ముందు నడుస్తుండగా వాడు బొడ్లో పిల్లనగ్రోవిని దోపుకుని, చంకకు చిక్కం తగిలించుకుని వాటి వెంబడి నడుస్తాడు. రోజంతా పశువులు మణియం గారి బీడు భూములలోను, ఊరికి చుట్టు ఉన్న పోరంబోకు భూములలోను, ఊరికి దూరంగా ఉన్న గుట్టల మీదను మేత మేస్తుంటాయి. సంవత్సరం పొడవునా ఏ అదునులో, ఎక్కడ గడ్డి పుష్కలంగా లభిస్తుందో వాడికి బాగా తెలుసు. అవి మేత మేస్తుండగా అతడు ఒక చెట్టు నీడన గాని, గుండు నీడన గాని కూర్చుని పిల్లన గ్రోవిని ఊదుతూ ఉంటాడు.

సూర్యుడు నడిమింటికి రాగానే చిక్కం విప్పి, భోజనం చేసి, దాపున ఉన్న కుంటలో గాని, కాలువలో గాని చేతులు కడుక్కుని నీళ్లుతాగుతాడు. సూర్యుడస్తమిస్తుండగా పశువులను ఊరివైపు మళ్ళించి, కొట్టంలోకి చేరుస్తాడు. చేదబావిలో నుండి నీళ్ళు చేది గారతొట్టిని నింపుతాడు. పశువులన్నీ నీళ్లుతాగాక వాటిని కట్టుగొట్టులకు కట్టివేస్తాడు. గడ్డి వాముల నుండి కసువు గుంజుకొచ్చి పశువుల ముందర గాట్లో వేస్తాడు. తరవాత బావివద్ద తీరికగా స్నానం చేసి బట్టలుతుక్కుంటాడు.

మణియం గారి భవంతికి వెళ్ళి దొరసాని విస్తరాకులో పెట్టిన అన్నం తింటాడు. భోజనమయ్యాక ఊర్లోకి వెళ్లి తన మిత్రులు మధ్య కూర్చుని, మూగభాషలో పిచ్చాపాటి మాట్లాడి, మాట మునిగే రాత్రికి మళ్ళీ కొట్టంలోకి చేరుకుంటాడు. అతడు రాత్రి నిద్రపోవడానికి కొట్టంలో ఒక మూలన కుక్కి మంచం ఉన్నది.

పశుపాలన విషయంలో మూగవాడిపైన మణియం గారికి పూర్తి నమ్మకముంది. ఐనప్పటికీ అతడు రోజుకొక్కసారైనా కొట్టంలోకి వచ్చి పశువుల బాగోగులను గురించి విచారిస్తుంటాడు. పశువుల శరీరాలపైన జోరీగలు, పిడుదులు వంటివి ఉంటే వాటిని అప్పటికప్పుడే ఏరివేసే ఏర్పాటు చేస్తాడు. పశువులలో ఏదైనా ఒకటి నలతగా ఉన్నట్టు కనిపిస్తే పశువైద్యుడిని పిలిపించి వైద్యం చేయిస్తాడు. ఎద్దులకు గొట్టెలరిగిపోయి ఉంటే మరుసటి దినమే నాడాలు కొట్టిస్తాడు.

23

మాఘమాసాంతంలో ఒకనాటి రాత్రి తొలిజాము గడుస్తుండగా మణియం లాంతరును తీసుకుని కొట్టంలోకి వచ్చాడు. కుక్కి మంచం మీద కూర్చుని పిల్లనగ్రోవిని ఊదుతుండిన మూగవాడు లేచి మణియం వద్దకు వచ్చాడు. మణియం లాంతరును కిందపెట్టి "సూడి ఆవులెట్టుండాయిరా?" అనడిగాడు.

మూగవాడి చేతి సైగలతో "బాగుండాయి దొరా. మూడూ ఈ నెలలోనే ఈనేస్తాయి" అన్నాడు.

మణియం లాంతరు వెలుగులో సూడి ఆవులను పరిశీలించసాగాడు. ఉబ్బుకుని ఉన్న వాటి పొట్టలను చూసి, తృప్తిగా గాలి పీల్చుకుని, "మూడూ ఈ నెలలోనే ఈనేస్తాయంట్రా? అంత కచ్చితంగా నీకెట్ట తెలుసు?" అన్నాడు.

మూగవాడు, "ఈ నెలలోనే ఈనేస్తాయి దొర. ఇవి కట్టింది ఆడి నెలలోగదా, వీటిని సుద్దపల్లికి తోలుకుపోయి దాటించుకొచ్చింది నేనేగదా దొర" అన్నట్లుగా సైగచేశాడు.

మణియం కాసేపు మనోగణితం వేసి, "ఔ, ఇవి మూడూ ఆడినెలలో కట్టినాయి. ఆ లెక్కన ఇవి ఇక వారం పదిదినాల్లో ఈనేస్తాయి"అని, మూగవాని వైపు తిరిగి "నువ్వొక పన్జెయ్యి" అన్నాడు.

మూగవాడు "చెప్పుదొరా" అని చేతులు కట్టుకుని నిలుచున్నాడు.

మణియం "ఈ పొద్దిట్నుంచి ఇవి ఈనేదాక నువ్వు ఈ మూడింటినే చూసుకో, ఇంకొక పని చెయ్యొద్దు" అన్నాడు.

మూగవాడు "మిగతా గొడ్లకత యట్లదొరా" అన్నాడు.

మణియం. "మిగతా వాటిని చూసుకునేదానికి వేరే ఎవర్నయినా పెడతా, నువ్వు మాత్రం ఈ మూడింటిని కంటికి రెప్ప మాదిరి చూసుకోవాల. యాళతప్పకుండా కసువు, కుడితి అందించు, పొద్దుగూకి సల్లబడినాక బయటకు తోలుకుని పోయి మేపుకునిరా. దూరంగా తోలుకునిపోయి వాటిని అలత పెట్టొద్దు. ఊరికి దగ్గిరగా ఉండే తావుకు తోలుకుని పో" అన్నాడు.

మూగవాడు. "అట్లనే దొరా" అన్నట్లు తల ఊచాడు.

మణియం ఒక ఆవు బబ్బమీద జోరీగ కూర్చుని ఉండడం గమనించి, ఒక చరుపు చరచి దానిని చంపి, అరచేతికంటుకున్న నెత్తురును రాతిస్తంభానికి తుడుచుకుంటూ "మూడూ గనక కోడె దూడలను ఈనితే ఇంగ బంగారంతో గోడ పెట్టుకోవచ్చు" అన్నాడు.

మూగవాడు, "కోడె దూడలే పుడతాయి దొర. నేను దేవునికి మొక్కుకున్నా. మూడింటికి కోడె దూడలు పుడితే పాకాల సుబ్రమణ్యస్వామి కొండకొస్తానని మొక్కుకున్నా" అన్నాడు.

మణియం "పాకాలకేవిటికిరా, తిరపతి కొండకే పంపిస్తా. తలనీలాలిచ్చే సొద్దువు" అన్నాడు.

మూగవాడు లాంతరు వెలుగులో పండ్లన్నీ కనిపించేలా నవ్వుతూ, "ఔ దొరా, తలనీలాలిచ్చినాక, దిగవ తిరుపతిలో కొత్త పిల్లంగట్టి కొనుక్కుంటా" అన్నాడు.

మణియం లాంతరు తీసుకుని, "సరే ఇంగనువ్వు పోయిపడుకో" అని నాలుగడుగులేసి, వెనుదిరిగి "రేపట్నుంచి వీటిని యాడికి తోలుకుపోతావు?" అన్నాడు.

మూగవాడు కాసేపు ఆలోచించి, "ఊరికి దగ్గరగా ఉండే తావుకు తోలుకుపొమ్మంటివి గద దొరా. బాటకాడ కయ్యలలోకి తోలుకుపోతా" అన్నాడు.

మణియం, "ఔ, అదే మంచి జాగా, ఆడికే తోలుకునిపో. ఆరు నెలల నుంచి బాటకాడ కయ్యల్లో కాలు పెట్టినోడులేడు. కసువు మొలిచి మోకాటెత్తు పెరిగి ఉంది. ఆడికే తోలుకునిపో. వీటిని తనీగా తోలుకునిపో, మిగతా గొడ్లతో కలవనియ్యోద్దు" అన్నాడు.

24

మరునాడు పొద్దు పడమరకు వాలి ఎండలు చల్లబడినాక మూగవాడు చూడి ఆవులు మూడింటిని బాటకాడ కయ్యలలోకి తోలుకుపొయ్యాడు.

పద్నాలుగెకరాల భూమి దీర్ఘచతురస్రాకారంగా ఉన్నది. గత ఆరు నెలలుగ నరసంచారం గాని, పశు సంచారం గాని ఎరగని భూమి. మణియం గారి సొత్తు గనుక ఆ భూమిలో గడ్డి కోయడానికి ఎవరూ సాహసించలేదు. ఎవరూ తమ పశువులను అందులోకి తోలలేదు. ఏ అంతరాయమూ లేనందువల్ల గడ్డి విస్తారంగా పెరిగి పద్నాలుగెకరాల వైశ్యాలం గల పచ్చటి తివాచీ వలె అగుపిస్తున్నది. ఆ గడ్డి ఎన్నిరకాలు! సన్నటి పొడుగాటి రిళలు కలిగిన గరిక గడ్డి, దళసరి రిళలు కలిగిన ఎన్నెద్రగడ్డి, గుండ్రటి రిళాలు గలిగిన బలపగడ్డి.

ఆవులు మూడూ మోరలు వంచుకుని, ఆవురావురుమని మేయడం ప్రారంభించాయి. ఇంతటి పుష్కలమైన గడ్డి దొరికినందుకు అవి ఆనందంతో తోకలను అటూ ఇటూ ఆడిస్తూ, మెడలో గంటలు మ్రోగుతుండగా మేస్తున్నాయి.

భూమి పల్లంగా ఉన్నవైపున కాకివెదరు పొదలు దట్టంగా పెరిగి ఉన్నాయి. పొదల మధ్య జెముడు కాకులు వానపాముల కోసం వెదుకుతూ తిరుగుతున్నాయి. కాకి వెదరు పొదల కవతల సగానికి పూడిపోయిన బావి ఉన్నది. బావి గట్టున ఉన్న తుమ్మ చెట్టులో ఇరవైకి పైగా పిచ్చుక గూళ్లు వ్రేలాడుతున్నాయి. గూళ్లలోపల, గూళ్ల మీద, కొమ్మల మీద కూర్చుని ఉన్న పిచ్చుకలు అవిరామంగా సందడి చేస్తున్నాయి. పడమటివైపున వరుసగా కానుగ చెట్లున్నాయి. పచ్చటి వెడల్పయిన కానుగ ఆకుల మరుగున చిలుకలు గుంపులు గుంపులుగా కూర్చుని ఉన్నాయి. దక్షిణం వైపున బాగిమాను ఉన్నతంగా నిల్చుని ఉంది. దాని కొమ్మలు శాఖోపశాఖలుగా చీలి విస్తరిల్లి ఉన్నాయి. కొమ్మల నుండి పసుపు పచ్చగా ఉన్న బాగికాయలు బంగారేకులవలె వ్రేలాడు తున్నాయి.

బాగిమానుకింద బక్కిరెడ్డిని సమాధి చేసిన మట్టి దిబ్బ ఉన్నది. గత ఆరు నెలలుగా వాతావరణ ప్రభావానికి మట్టి దిబ్బ సగానికి కరిగిపోయి ఉన్నది. మట్టి దిబ్బ నంతటినీ కప్పుతూ గరిక గడ్డి వ్యాపించి ఉన్నది. పండిన బాగికాయలు అప్పుడొకటి అప్పుడొకటి తొడిమలు వీడి మట్టిదిబ్బ మీద పడుతున్నాయి.

మూగవాడు బాటకాడ కయ్యలను ఒకసారి కలదిరిగి బాగిమాను కిందికొచ్చాడు. చెట్టు బోదెకు వీపును ఆనించి, జారగిలబడి, కాలుమీద కాలు వేసుకుని కూర్చున్నాడు. బొడ్లో దోపుకుని ఉండిన పిల్లన గ్రోవిని తీసి వాయించడం ప్రారంభించాడు. అతని వ్రేళ్లు పిల్లనగ్రోవి మీద లయబద్ధంగా ఆడుతున్నాయి.

మేస్తూ ఉండిన ఆవులు మూడు ఒక్కటొక్కటే తలలు పైకెత్తాయి. పిల్లన గ్రోవి నుంచి వస్తున్న రాగాన్ని చెవులు రిక్కిరించుకుని వినసాగాయి. పిల్లన గ్రోవిని మిడిగుడ్లు పెట్టుకుని వినసాగాయి. నోళ్లనుండి గడ్డి పరకలు వ్రేలాడుతుండగా అవి స్థాణువుల్లా నిలబడి మూగవాని వైపు చూడసాగాయి. మూగవాడు తన పిల్లనగ్రోవి మీద వినిపించే రాగలన్నీ వాటికి సుపరిచితమే. కాని ఈ పూట అతడు వినిపిస్తున్న రాగాన్ని ఇంతకు పూర్వం ఎప్పుడూ వినిపించలేదు. ఒక విచిత్రమైన దృశ్యాన్ని, ఒక భయంకరమైన దృశ్యాన్ని చూస్తున్నట్లు అవి మూగవానిని, అతని పిల్లనగ్రోవిని బెరుకు బెరుగ్గా చూడసాగాయి. అలా కొంత సేపు చూసి ఒక్కటొక్కటే తలలు వంచుకుని గడ్డి మేయడం ప్రారంభించాయి.

మాఘమాసం కావడం మూలాన పొద్దు రెండు బారలుండగానే చలి ప్రారంభమయింది. చలిగాలులు పిల్లన గ్రోవి నుండి వీస్తున్న ధ్వని తరంగాలను మోసుకుంటూ పచ్చిక మైదానం మీదుగా,

చెట్లు, కొమ్మల మీదుగా, పరుగిడుతున్నాయి.

ఒక తల్లి తాను అనుభవిస్తున్న పుత్రశోకాన్ని పిల్లనగ్రోవి వినిపిస్తోంది.

"ఈ రోజు శుక్రవారం
ఇంటి ముందు కలాపి చల్లి పిండి ముగ్గువేశాను.
ఇంటి ముంగిట దోగాడే పిల్లలు నాకులేరు.
ఈ ముగ్గు చెరగదు.
నేను గొడ్రాలిని.
ఈ రోజు శుక్రవారం
ఇంటి ముందు కలాపి చల్లి పిండి ముగ్గువేశాను.
నేను వయసులో ఉండగా
ముగ్గురు కొడుకుల్ను కన్నాను ముగ్గురూ చనిపోయారు.
ఐనా నేను గొడ్రాలినే.
ఈ రోజు శుక్రవారం
ఇంటి ముందు కలాపి చల్లి పిండి ముగ్గు వేశాను.
వచ్చే శుక్రవారం వరకు ఈ ముగ్గు
చెక్కు చెదరదు.
ఈ ముగ్గు నా కడుపును కోస్తున్నది
ఈ రోజు శుక్రవారం
ఇంటి ముందు కలాపి చల్లి పిండి ముగ్గు వేశాను
పొగడ చెట్టు మీదున్న పిచ్చుకలారా చిలుకల్లారా
ముగ్గు పిండిని పొడుచుకు తినండి.
నా పుత్ర శోకాన్ని తగ్గించండి. ఈ రోజు శుక్రవారం
ఇంటి ముందు కలాపి చల్లి పిండి ముగ్గువేశాను.
పెరట్లో తిరిగే కోడి పెట్టలారా

కోడి పుంజులారా
ఈ ముగ్గును కెలికెయ్యండి
నా పుత్రశోకాన్ని తగ్గించండి
ఈ రోజు శుక్రవారం
ఇంటి ముందు కలాపి చల్లి పిండి ముగ్గువేశాను”

ఆ పాటను మూగవాడు పిల్లనగ్రోవి మీద ఇదివరకెపుడూ వాయించలేదు. ఈ పూట మొదటిసారిగా వాయిస్తున్నాడు. నాలుగేండ్ల క్రితం వొప్పారివాళ్లు ఈ పాటపాడుతుండగా మూగవాడు విన్నాడు. ఆ పాటలోని మాటలు యథాతథంగా అతనికి జ్ఞాపకం లేదుగాని, పాటలోని భావం, రాగం, అతని మనసులో గాఢంగా ముద్రవేసుకున్నాయి.

నాలుగేండ్ల క్రితం గ్రామంలోని ఒక ధనవంతుని ఇంటిలో శిశుమరణం సంభవించింది. ఇరవై మంది వొప్పారి వాళ్లు శవం చుట్టూ చేరి ఆ పాటను పాడారు. పాటపాడుతూ వాళ్లు కొప్పులను విప్పి, జుత్తు విరబోసుకుని రొమ్ముల మీద బాదుకుంటూ, రవికలను చింపుకుంటూ, నేల మీద దొర్లుతూ ఏడ్పులు, అంగలార్పులు సాగించారు. మూగవాడు నాలుగు బారల దూరాన నిలబడి వొప్పారి వాళ్లను చూస్తున్నాడు. అలా చూస్తుండగా వాడి శరీరం ఆపాదమస్తకం సన్నగా కంపించింది. కొంతసేపటికి వాడు వెక్కిళ్లు విడుస్తూ ఏడవసాగాడు. ఆ రాత్రి వాడు పశువుల కొట్టంలో పడుకుని వొప్పారి పాటలోని పుత్రశోకాన్ని గురించి ఆలోచిస్తూ, కంటిమీద రెప్పవేయకుండా గడిపాడు.

గత నాలుగు సంవత్సరాలకాలంలో అతడీపాటను ఒక్కసారి కూడా తన పిల్లనగ్రోవి మీద వాయించలేదు. ఒక్కసారి కూడా ఆ పాటను పిల్లనగ్రోవి మీద సాధన చేయలేదు. ఈ పూట బాగిమాను

కింద కూర్చుని పిల్లనగ్రోవిని పెదాలకు తాకించినపుడు కూడా అతడి పాటను వాయించాలని అనుకోలేదు. అతని ప్రమేయమేమీ లేకుండా పిల్లనగ్రోవి తనంతటదే ఆ పాటను వినిపిస్తూంది. పాట సాగే కొద్దీ తన పెదాలకు గాని, చేతి వేళ్లకు గాని పిల్లనగ్రోవి పైన అదుపులేదని అతనికనిపించసాగింది. ఏదో అదృశ్యశక్తి పిల్లనగ్రోవిని వాయిస్తున్నట్లు అతనికి అనిపిస్తుంది. నాలుగేండ్ల క్రితం తాను చూసిన హృదయ విదారక దృశ్యం అతని కండ్ల ముందు మెదలసాగింది. శవం చుట్టూ చేరిన వొప్పారి వాళ్లు అతనికి కనిపిస్తున్నారు. వాళ్లు జుత్తు విరబోసుకుని, రొమ్ములమీద బాదుకుంటూ, రవికలను చింపుకుంటూ, నేలమీద దొర్లుతుండడం అతనికి కనిపిస్తూంది. వాళ్లు నేలమీద దొర్లుతుండగా దుమ్ము మేఘాలవలె లేవడము, వాళ్లు ఏడుస్తుండగా కన్నీళ్లు చెంపల మీదుగా జారడమూవాళ్లు వికృతంగా అరుస్తుండగా నోటి అంచుల వద్ద చొంగ కారడము అతనికి కనిపిస్తూంది. వాళ్లు పాడుతున్న పాటలోని పుత్రశోకం అతనికి ప్రస్ఫుటంగా వినిపిస్తూంది.

పిల్లనగ్రోవి ద్వారా వినిపిస్తున్న శోకమయమైన ఆ రాగాన్ని వింటూ తుమ్మచెట్లలో పిచ్చుకలు, కానుగ చెట్లలో చిలుకలు నిశ్చలనంగా, నిశ్శబ్దంగా కూర్చున్నాయి.

కొంతసేపటికి మూగవాని శరీరం సన్నగా కంపించసాగింది. అతని పెదవుల మధ్య నుండి గాలి వెలువడడం కష్టతరం కాసాగింది. అతని చేతి వేళ్లు పిల్లనగ్రోవి మీద తడబడసాగాయి.

మరికొంత సేపటికి పిల్లనగ్రోవి మూగబోయింది. పిల్లనగ్రోవి మూగబోవడంతో ఆ పరిసరాలను నిశ్శబ్దం ఆవరించింది. ఘనీభవించిన ఆ నిశ్శబ్దంలో మూగవాడు పిల్లనగ్రోవిని ఒడిలో వేసుకుని, బాగిమాను బోదెనానుకుని, రాతితో చెక్కిన బొమ్మ వలె చలన రహితంగా కూర్చున్నాడు.

అతడలా కూర్చుని ఉండగా ఆవుల మెడలోని గంటలచప్పుడు వినిపించింది. ఆ గంటలు తనను పేరు పెట్టి పిలుస్తున్నట్లు అతనికి అనిపిం చింది.

అతడు తలతిప్పి చూశాడు. ఆవులు మూడూ సమాధి తాలూకు మట్టిదిబ్బకు సమీపాన పచ్చగడ్డి మీద పడుకుని ఉన్నాయి. ఆ మూడింటి ముందర కనిపిస్తున్న దృశ్యాన్ని చూడగానే అతడు బిసకంపవలె లేచి నిల్చున్నాడు. అతని ఒడిలోని పిల్లనగ్రోవి గాలిలోకి ఎగిరి గిరగిర తిరుగుతూ సమాధి మీద పడింది.

అతడు ఒక్క ఉదుటున ఆవుల ముందర కొచ్చి చేరాడు. ఒక్కొక్క ఆవు ముందుర ఒక్కొక్క చావుదూడ పడి ఉన్నది. ఆ మాంసపు ముద్దలను కప్పుకుని ఉన్న మావిని ఆవులు తమ నాలుకలతో నాకుతున్నవి.

అతడు మోకాళ్ల మీద కూర్చుని చావు దూడలు మూడింటినీ చేతివేళ్లతో ముట్టి చూశాడు. పిచ్చిచూపులతో కాసేపు నలువైపులా చూసి, పైకిలేచి, ఊరివైపు పరుగు ప్రారంభించాడు.

25

మణియంగారి భవంతి మీద సాయంకాలపు ఎండ ఏటవాలుగా పడుతూ ఉంది. భవంతి సింహద్వారం వద్ద గుర్రం నిలబడి ఉంది. గుర్రపు వాడు దాన్ని వీపు మీద జీనును వేసి, నోటికి కళ్లెం తగిలించాడు. తరవాత గుర్రం మెడ మీద చేయి వేసుకుని భవంతి వైపు చూస్తూ నిలబడ్డాడు.

కొంత సేపటికి మణియం సింహద్వారం దాటుకుని బయటకు

వచ్చాడు. తన వెంబడే ద్వారం వరకు వచ్చిన భార్యకు ఏవో నాలుగు మాటలు చెప్పి, రికాబులో కాలుపెట్టాడు.

ఇంతలో అతనికి పడమర దిక్కు నుండి అరుపులు వినిపించాయి. అతడు తలెత్తి చూశాడు. మూగవాడు గట్టిగా అరుస్తూ, గాలిలో చేతులు ఆడిస్తూ ఇటే పరుగెత్తి వస్తున్నాడు. మణియం రికాబులో కాలు అలాగే ఉంచుకుని మూగవాని వైపు చూస్తూ నిలబడ్డాడు.

మూగవాడు మణియం వద్ద తన పరుగును ఆపి, తూలి పడబోయి తనను తాను సమాళించుకుని, "సావు దూడల్ను ఏసేసినాయి దొరా. మన ఆవులు మూడూ సావు దూడల్ను ఏసేసినాయి" అన్నాడు.

మణియం రికాబులో నుండి కాలును తీసివేసి, మూగవాని చెంపమీద ఛెళ్లున కొట్టి, "బెస్టునాకొడకా, ఒకటికి రెండుసార్లు చెప్తినికదరా. వాటిని బద్రంగా చూసుకోమని ఒకటికి పదిసార్లు చెప్తిని గదరా. వాటిని యాడేడనో తిప్పి అల్ల పెట్టుంటావు. అందుకే సావు దూడల్నేసేసినాయి" అన్నాడు.

మూగవాడు కట్టెలమోపువలె సావుగ నేలమీద పడి, వెల్లకిల తిరిగి, దుమ్ము అంటుకుని ఉన్న తన చేతులతో సైగలు చేస్తూ, "యడా తిప్పలేదు దొరా, రాతిరి అనుకున్నట్లుగానే బాటకాడ కయ్యలలోకి తోలుకుపోయినా, ఆడనే సావుదూడల్నే సేసినాయి దొరా" అన్నాడు.

మణియం మళ్లీ రికాబులో కాలు పెట్టి ఎగిరి గుర్రం మీద కూర్చున్నాడు. తన రెండు గుదికాళ్లతో దాని డొక్కలలో పొడిచాడు. గుర్రం దుమ్ము లేపుకుంటూ దౌడు ప్రారంభించింది.

'బాటకాడకయ్యల' వద్ద మణియం గుర్రం దిగాడు. ఆవులు మూడూ పచ్చిక మీద ఇంకా అలాగే పడుకుని ఉన్నాయి. అప్పటికే కొంత మంది గ్రామస్థులు ఆవుల చుట్టూ, చావు దూడలచుట్టూ చేరి చోద్యం చూస్తున్నారు. మణియం గ్రామం నుండి పశువైద్యుడిని పిలిపించాడు. పశువైద్యుడు తన అనుభవాన్నంతా ఉపయోగించి ఆవులు మూడింటిని క్షుణ్ణంగా పరీక్షించాడు. పరీక్షించడం ముగించి కాలువలో చేతులు కడుక్కున్నాడు.

అతడేమి చెబుతాడోనని అక్కడున్న వారందరు ఒళ్లంతా చెవులు చేసుకుని చూడసాగారు. పశువైద్యుడు తన చేతులకున్న తేమను తుండుగుడ్డకు తుడుచుకుంటూ, మణియం వైపు చూసి, "మూడింటికి గర్భదోషం జరిగిందన్నా" అన్నాడు.

మణియం ఆతురుతతో, "ఎందుకట్టాయె? పోయిన ఈతలో రత్నాలట్టా దూడల్నీనినాయి. ఇది రెండో ఈత, ఇపుడెందు కిట్టాయె?" అన్నాడు.

పశువైద్యుడు తుండుగుడ్డని భుజానేసుకుని, 'ఇలారా' అని కనుసైగలతో మణియంకు చెప్పి నడవసాగాడు. వాళ్లిద్దరు గుంపుకు దూరంగా నడిచి, సగం పూడిపోయిన బావిగట్టున కూర్చున్నారు. మణియం ప్రశ్నలతో నిండిన ముఖంతో పశువైద్యుడిని చూడసాగాడు. అతని ప్రశ్నలకు సమాధానమిచ్చే ముందు ఉపోద్ఘాతంలాగ పశువైద్యుడు కొన్ని వివరాలిచ్చాడు. "నలభై సంవత్సరాల నుంచి గొడ్లకు వైద్యం చేస్తా ఉండానన్నా. ఇట్లాంటి విచిత్రం నేనెపుడూ చూడలేదు. మూడు ఆవులు ఒకేసారి సావు దూడల్ను ఎయ్యడం ఎప్పుడూ చూడలేదు. అవి మూడింటికి గర్భాలు చెడిపోయినాయి. ఎట్ల చెడిపోయినాయనేదే నాకర్థం గాకుండా ఉంది. విషపురుగులేవన్నా కరిచి నాయేవోనని అలోసిన జేసినా.

అట్ట జరిగినట్టు లేదు. కసమాలపు గడ్డిగాని, ఆకులుగాని తిన్నాయేవో ననుకుంటే అట్టాటివి మన పాయకట్టులో యాడాలేవు. గర్భాలను చెడగొట్టేరకం గడ్డిగాని, చెట్టుగాని ఈ సుట్టుపట్లలో యాడాలేవు. మరి" అని ఆగిపోయాడు.

మణియం, "మరైతే ఎవరన్నా నాటికి విషం పెట్టారంటావా?" అన్నాడు.

పశువైద్యుడు అందుకొని, "ఆ మాటే అందావనుకుంటా ఉండాను. ఆవులు మూడూ ఒకేసారి సావుదూడలు వెయ్యడం జూస్తే వాటికెవరో విషం పెట్టినట్టే ఉంది" అన్నాడు.

"ఎవరు చేసుంటారా పని?"

"అదే ఇపుడు ఆలోచించాలి"

26

మణియం తన భవంతిలోని మూడో అంతస్తులో వాలుకుర్చీలో జారగిలబడి ఉన్నాడు. అతడు కిటికి గుండా సుదూరాన కనిపిస్తున్న కొండల్ను చూస్తూ ఆలోచిస్తున్నాడు.

తన ఆవులకు విషం పెట్టింది ఎవరు? మణియంగారి తనువులోని ప్రతి అణువూ ఈ పశ్నను ఎదుర్కొంటున్నది. ఆ ప్రశ్నకు సమాధానం దొరక్క అతని లోని ప్రతి అణువూ ఈ ప్రశ్నను ఎదుర్కొంటున్నది. ఆ ప్రశ్నకు సమాధానం దొరక్క అతనిలోని ప్రతి అణువూ సలసల కాగుతున్నది.

మణియం గారికి ఆవులు, ఎద్దులు, దూడలు కలిసి ముప్పైకి పైగా ఉన్నాయి. ఒక దొడ్డి మేకలు, మరొక దొడ్డి గొర్రెలు

ఉన్నాయి. ఏటేటా వేలకొలది రూపాయల వరుమానం తెచ్చి పెట్టే మామిడితోటలు, కొబ్బరి తోటలు ఉన్నాయి. వందల కొద్ది ఎకరాల వ్యవసాయ భూములున్నాయి.

అయినప్పటికి మూడు లేగదూడల మరణం అతని మనసును విపరీతంగా కలిచివేస్తూ ఉంది.

పది సంవత్సరాల క్రితం మణియంగారికి ఒక పెంపుడు కుక్క ఉండేది. అది రేయింబవళ్ళు అతనిని అంటిపెట్టుకుని ఉండేది. మణియం గారు ఉదయం లేచి కాలకృత్యాలకు వెళ్ళినా, తొటలను, పొలాలను తనిఖీ చేయడానికి వెళ్ళినా ఆ కుక్క అతని వెన్నంటి ఉండేది. మణియం గారు కచేరిలో పనిచేసుకుంటూ ఉంటే అది అతని బల్లకింద పడుకునేది. మణియంగారు పొరుగూరికి కాలినడకన వెళ్లినా, గుర్రం మీద వెళ్లినా అది అతనిని వెంబడిస్తూ ఉండేది. మణియం గారు రాత్రిళ్ళు నిద్రిస్తుండగా అది అతని మంచం కింద ముడుచుకుని పడుకునేది. దాపున ఎక్కడైనా చీమ చిటుక్కుమన్నా అది చివుక్కున లేచి చూసి వచ్చేది.

ఒకనాటి ఉదయం ఆ కుక్క నోటి నుంచి చొంగ కారుస్తూ, డొక్కలు ఎగరేస్తూ, కాళ్లు కొట్టుకుంటూ మంచం కింద కనిపించింది. మణియం వెంటనే పశువైద్యుని రప్పించాడు. పశువైద్యుడు చేయవలసిందంతా చేశాడు గాని దాని ప్రాణాలు దక్కించలేకపోయాడు. కుక్కకు విషప్రయోగం జరిగిందని అతడు నిర్ధారించాడు. అయితే కుక్క మరణాన్ని గురించిగాని, పశువైద్యుడు చేసిన నిర్ధారణను గురించి గాని మణియంగారు పట్టించుకోలేదు.

కుక్క మరణించిన తరవాత ఎనిమిదవ రోజున మణియంగారి జీవితంలో అత్యంత భయంకరమైన సంఘటన జరిగింది. అర్ధ

రాత్రి పూట అతడు గాఢనిద్రలో ఉండగా ఒక ముసుగు వ్యక్తి అతనిపై హత్యాప్రయత్నం చేశాడు. ముసుగు వ్యక్తి మొదటి పోటు గురితప్పి తలగడను, మంచం కొయ్యను చీల్చివేసింది. అంతలో మణియం మేల్కొని కళ్లు తెరిచాడు. ముఖానికి నల్లటి ముసుగు ధరించిన ఒక వ్యక్తి మంచంపక్కన నిలబడి ఉన్నాడు. అతడు రెండవసారి పొడవడానికి కత్తి పైకెత్తాడు. మణియం కత్తిని వొడిసి పట్టుకున్నాడు. ఎడమ చేత్తో అతని ముఖం మీద ముసుగును లాగివేయడానికి ప్రయత్నించాడు. కత్తి వాదర పదునుగా ఉండడం వల్ల మణియంగారి అరచేయి తెగి రక్తం చిమ్మింది. రక్తం అతని కళ్లమీద, చెంపలమీద బొటబొట కారసాగింది. అయినా కత్తి చుట్టూ ఉన్న తన పిడికిలిని మణియం సడలించలేదు. అతడు హంతకునితో పెనుగులాడుతూ అతని ముఖం మీదున్న ముసుగును ఎడమ చేత్తో లాగివేశాడు. కాని కళ్ళు రెండూ రక్తపు పొరల చేత కప్పబడి ఉండడం వల్ల అతనికేమీ కనిపించలేదు. ఈలోగా హంతకుడు కత్తిని వదిలిపెట్టి గోడ దూకి చీకట్లో మాయమై పోయాడు.

హంతకుని కత్తిని బలంగా వొడిసి పట్టుకున్నందువల్ల అతని కుడిచేతిలో చూపుడు వేలు. మధ్యవేలు తెగిపోయాయి. ఆ గాయాలు మానడానికి కొన్ని నెలలు పట్టింది. రెండు వేళ్లు తెగిపోవటంతో అతని చేతికి శాశ్వతమైన అవిటితనం ప్రాప్తించింది.

ముసుగు ధరించి వచ్చిన హంతకుడెవరో తెలుసుకోవడానికి మణియంగారు చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. అది ఈనాటికీ ఒక రహస్యంగానే మిగిలిపోయింది. కాని తన మీద జరిగిన హత్యాప్రయత్నానికి, అంతకు ఎనిమిది రోజుల క్రితం తన పెంపుడు కుక్కపై జరిగిన విషప్రయోగం ఒక నాంది చర్య అని

మణియం కొన్నాళ్ళకు గుర్తించాడు. కుక్క మరణాన్ని ఉదాసీనంగా తీసుకున్నందుకు అతడు తనను తాను ఎన్నోసార్లు గర్హించు కున్నాడు.

పదేండ్ల తరవాత ఈనాడు తన ఆవులపైన విషప్రయోగం జరిగింది. ఇది దేనికి నాంది?

మణియం వాలుకుర్చీలో నుంచి లేచాడు. గదిలో చాలాసేపు పచార్లు చేశాడు. కిటికి దగ్గర నిలబడి బయటకు చూశాడు. మూడవ అంతస్తులో నుంచి చూస్తుంటే గ్రామం యావత్తు వెన్నెలలో జోగుతూ కనిపిస్తోంది. మేఘాలు లేని ఆకాశాన చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు వెన్నెలను కాక రక్తాన్ని ఉత్పత్తి చేసి భూమి మీదకు రాలుస్తున్నట్లు అతనికి అనిపించ సాగింది. అతను తన అవిటి చేతిని ఒకసారి చూసుకున్నాడు. తెగిపోయిన తన రెండు వేళ్ళ నుండి రక్తం బొట బొట కారడం అతని కళ్ళకు కట్టినట్టు కనిపించసాగింది.

అతడు 'ఆవులకు విషప్రయోగం చేసిందెవరో తెలుసుకునేదాకా నాకు విశ్రాంతి లేదు. అంతదాక నాకు మనశ్శాంతి లేదు' అని నిశ్చయించు కున్నాడు.

27

మరుసటి దినమే మణియం తన కచేరి బాధ్యత లన్నిటిని కరణానికి అప్పగించాడు.కుటుంబ వ్యవహారాలను, వ్యవసాయ బాధ్యతలను తన కొడుకులకు అప్పజెప్పాడు.

ఆవులు సావు దూడల్ను వేయడం ఎలా జరిగింది? ఇది దేనికి

నాంది చర్య? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికేవరకు తాను మరొక విషయంపై మనసు కేంద్రీకరించదలచుకోలేదు.

మణియం తన గ్రామంలోను, పక్క గ్రామాలలో ఉన్న బంధువులను, శ్రేయోభిలాషులను పిలిపించాడు. వారితో మంతనాలు జరిపి, అభిప్రాయాలు, సలహాలు కోరాడు.

అనుమానితులను లాక్కొచ్చి చితకబాదితే వాస్తవం బయట పడుతుందని కొందరు సలహా ఇచ్చారు.

పోలీసులకు ఫిర్యాదు చేయవలసిందిగా కొంతమంది సూచించారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు చేయిస్తే, అమ్మవారు పూజారిపై పూని,వాస్తవం చెప్పిస్తుందని కొందరు అభిప్రయపడ్డారు.

తలకోనలో ఒక గుహలో ఒక సిద్ధుడున్నాడనీ ,అతడు గోటికి అంజనం వేసుకుని చూసి, లోకంలో ఎక్కడ ఏమీ జరిగేదీ చెప్పగలడని కొందరు సూచించారు.

కల్లూరు అడవిలో ఒక ఎరుకలసాని ఉన్నదని. ఆమె తన మంత్రదండం ద్వారా ఎంతటి సందేహాలనైనా నివృత్తి చేస్తుందని కొందరు జ్ఞాపకం చేశారు.

చెన్నపట్నం పార్థిసారథి కోవెలలో ఒక పూజారి ఉన్నాడని, అతడు సకల శాస్త్ర పారంగతుడని, అతని శాస్త్రాలకు అతీతమైనదేదీ లేదని కొందరు సూచించారు.

మణియం అందరి అభిప్రాయాలను, సూచనలను విన్నాడు. పదేండ్లక్రితం తెగిన తన చేతివేళ్ళ నుండి బొటబొట కారుతున్న

రక్తం తన కండ్ల ముందర మెదులుతుంగా అతడు తనకు లభించిన సూచనలను ఆచరణలో పెట్టడం ప్రారంభించాడు.

గ్రామంలోని అనుమానితులను పశువుల కొట్టంలోకి ఈడ్చుకొచ్చారు. డజన్లకొలది చింతబెత్తాలు తునాతునకలయ్యాయి.

పోలీసు స్టేషనుకు ఫర్యాదులమీద ఫిర్యాదులు వెళ్ళాయి.

బాటగంగమ్మకు ప్రత్యేకమైన పూజాలు వైభవంగా జరిగాయి.

గుర్రబ్బండి తలకోనకు, కల్లూరు అడవికి, చెన్నపట్నానికి నిరంతరంగా పరుగెత్తసాగింది.

చింతబెత్తాల దెబ్బలు తిన్నవారి ద్వారాను, బాటగంగమ్మ పూనకం వచ్చి చెప్పిన విషయాల ద్వారాను, తలకోన సిద్ధుని ప్రవచనాల ద్వారాను, ఎరుకలసాని చెప్పిన సోదెద్వారాను, పార్థసారథి కోవెల పూజారి చెప్పిన శాస్త్రం ద్వారాను, పోలిసులిచ్చిన సమాచారం ద్వారానూ మణియంగారి ప్రశ్నలకు సమాధానాలు లభించాయి. కాని అవి కలలో కనిపించే దృశ్యాలవలె అస్పష్టంగాను, అసంబద్ధంగాను ఉన్నాయి.

శిశిర ఋతువు, వసంత ఋతువు గడిచి, గ్రీష్మ ఋతువు ప్రవేశించింది. గుర్రబ్బండి చక్రాల రబ్బరు టైర్లు పూర్తిగా అరిగిపోయాయి. గుర్రం గిట్టలకు నాలుగు సార్లు కొత్తగా నాడాలు కొట్టవలసి వచ్చింది. ఈ ఆరు నెలల కాలంలో మణియం అరుదుగా ఇంటిపట్టున ఉంటున్నాడు. ఎక్కువ సమయం ప్రయాణాలలోనే గడుపుతున్నాడు. అతని ముఖంలో ముసలితనం ఛాయలు ప్రస్ఫుటంగా కనపడ సాగాయి. ముఖం మీద చర్మపు ముడతలు ద్విగుణీకృతమయ్యాయి. అతని నడుము, మోకాళ్ళు

వయసుకు మించి వంగిపోయాయి. కాని అతని గుండెలలోని ప్రశ్నలు నిరంతరంగా జ్వలి స్తున్నాయి.

జ్యేష్ఠ మాసాంతానికి మణియంగారి ప్రశ్నలకు సమాధానంగా, అతని అన్వేషణలకు ఫలితంగా ఒక సిద్ధాంతం రూపొందింది. స్థూలంగా ఆ సిద్ధాంత స్వరూపం ఇది.

"ఆకాశంలో మేఘాలన్నీ ఒక్కసారిగా కరిగిపోతున్నట్లు కుండపోతగా వర్షం కురుస్తోంది. పర్వతాలను పెకలించడానికి ప్రయత్నిస్తున్నట్లు గాలి ఏకధాటిగా వీస్తున్నది. భూనభోంతరాళాలు ప్రతిధ్వనించేలాగ ఉరుముతున్నది. ఆకాశాన్ని పాయలు పాయలుగా చీలుస్తూ మెరుస్తున్నది.

పంచభూతాలు సాగిస్తున్న ఈ బీభత్సాన్ని సరకు చేయకుండా 'బాటకాడ కయ్యల'లో ఒక నాగలి సాగుతున్నది. నాగలి వెంబడి అరవై ఏండ్ల వయసుగల ఒక మానవుడు సాగుతున్నాడు. అతడు ఎడమ చేతితో నాగలి మేడిని, కుడిచేత్తో ముల్లుగర్రను పట్టుకుని ఉన్నాడు. నడుం చుట్టూ గోచి తప్ప అతడు అనాచ్ఛాదితంగా ఉన్నాడు.

"ఎడ్లు రెండూ నోటి అంచువద్ద నురగలు కక్కుతున్నాయి. అతడు బురదలో కూరుకుపోయిన కాళ్ళను అతి ప్రయత్నం మీద లాగుకుంటూ నాగలి వెంబడి సాగుతున్నాడు. అలసట మూలాన అతని నడుము, మోకాళ్లు వంగి పోతున్నాయి. తన దేహభారాన్నంతటినీ అతడు నాగలిపైన వేస్తున్నాడు. ముల్లుగర్రను పైకెత్తడానికి చేయి సగందాక లేచి కిందకు వాలిపోతున్నది. వివశత్వం అతనిని ఆవరించింది. సర్వశక్తులు కూడదీసుకుని పగ్గాలను లాగి నాగలిని ఆపాడు. విపరీతంగా సెగపోసుకుంటూ అతడు నాగలి వెనక బురదలో మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

"ప్రకృతి బీభత్సం అప్రతిహతంగా సాగుతున్నది. తన చివరి ఘడియ సమీపించిందని అతడు తెలుసుకున్నాడు. వాలిపోతున్న కనురెప్పలను పైకెత్తి, మెరపుకాంతిలో తన కయ్యలను ఒకసారి కలియజూశాడు. అతని కళ్ళలో గంగ సుడులు తిరుగుతూ ప్రవహించసాగింది. ఆ కన్నీళ్ళు వర్షపునీటితో కలిసి చెంపల మీదుగ జారసాగాయి.

"అపుడు పంచభూతాలు అతనిని సమీపించాయి. అతనిని పొదివి పట్టుకుని ఇలా అన్నాయి. "ఇక కొద్ది క్షణాల్లో మాలో లీనం కానున్న ఓ మానవుడా! చింతించవద్దు. ఈ భూమిని కంటికి రెప్పవలె, వ్రేలును గోరువలె కాపాడుతానని నీ తండ్రికి మాట ఇచ్చావు. అందుకు మేము సాక్షులం. అరవై ఏండ్లుగ ఈ భూమిలోని ప్రతి అంగుళం నీ చెమటతో తడిసింది. నీ రక్తము, మాంసము, ఎముకలు ఈ భూమిలోనే హరించుకుపోయాయి. నీ బాల్య యవ్వనాది దశలన్నీ ఈ భూమిలోనే ముగిశాయి. అందుకు మేము సాక్షులం. ఇన్ని సంవత్సరాలుగా ఇంత కఠోరంగా శ్రమించిన నీకు దక్కింది మానం మీదకు గుడ్డ, కడుపులోకి సంకటి మాత్రమే. అవి కూడా నీకు కాకతాళీయంగా లభించాయే గాని. నీవు శ్రమించింది వాటిని పొందడానికి కాదు. నీ రైతు పుటుకను సార్థకం చేసుకునేందుకు నీ వృత్తి ధర్మాన్ని నెరవేర్చేందుకు మాత్రమే నీవు శ్రమించావు. అలా ప్రతిఫలాపేక్ష లేకుండా నీవు శ్రమించావు. అలా ప్రతిఫలాపేక్ష లేకుండా శ్రమించి నీవు కర్మవీరుడవైనావు. ఓ కర్మవీరుడా! ఇన్నినాళ్లుగా నీ నాగలి తిరిగిన ఈ భూమిలో నేటి నుండి వేరొకరి నాగలి తిరగడానికి వీలులేదు. ఇన్ని నాళ్లుగ నీవు సాగు చేసిన ఈ భూమిని నేటి నుండి వేరొకరు సాగుచేయడానికి వీలులేదు. అందుకు తగిన విధంగా మేము కట్టడి చేస్తున్నాం. నేటి నుండి ఈ భూమిలో పండిన పంటను తినిన వాళ్ళ స్తనాలు ఎండిపోతాయి.

వాళ్ళకు గర్భస్రావాలు జరుగుతాయి. వాళ్ళు గొడ్రాళ్లవుతారు. నేటి నుండి ఈ భూమి మీద మొలచిన గడ్డిని తిన్న పశువుల స్తనాలు ఎండిపోతాయి. వాటికి గర్భస్రావాలు జరుగుతాయి. అవి గొడ్డావులవుతాయి. ఓ కర్మవీరుడా! మేము చేసిన కట్టడి సూర్యచంద్రులు ఆకాశంలో తిరుగుతున్నంత కాలం అమలులో ఉంటుంది. ఈ భూమి సదా నీదే అయి వుంటుంది. ఓ కర్మ వీరుడా! పంచభూతాలమైన మేము ఇదిగో, నిన్ను ఆహ్వానిస్తున్నాం. నిన్ను మాలో కలుపుకుంటున్నాం"

"అప్పుడు మోకాళ్ళ మీద ఉండిన అతడు పక్కకు వొరిగి నాగేటి చాలులో సోలిపోయాడు. బురద నీళ్లు అతని సగం దేహాన్ని కప్పివేశాయి"

మణియంగారిని, అతని బంధువులను, మిత్రులను, శ్రేయోభిలాషులను, గ్రామస్థులను గత ఆరు నెలలుగా వేధిస్తూ ఉండిన ప్రశ్నలకు సమాధానం లభించింది. ఈ సిద్ధాంతం ఎవరు ప్రారంభించారు? ఎవరు అభివృద్ధి పరచారు? ఈ సిద్ధాంతం ఎక్కడ జన్మించింది? ఎక్కడ ఎదిగింది? ఈ సిద్ధాంతం ఏ రూపంలో ప్రారంభం అయింది? ఎన్నిసార్లు రూపాంతరం పొందింది? ఎవరికీ తెలియదు.

అచేతనంగా ఉండిన అండం చేతనత్వం పొందినట్లు, చేతనత్వం పొందిన అండం నుంచి వికృతాకారంగల పురుగు ఉద్భవించినట్లు, వికృతమైన పురుగు అందమైన సీతాకోక చిలుకగా మారినట్లు ఈ సిద్ధాంతం రూపొందింది.

వర్షపు నీరు చారలుగా మారి, చారలు కాలువలుగా మారి, కాలువలు సెలయేళ్ళుగా మారి, సెలయేళ్ళు వాగుగా మారినట్లు ఈ సిద్ధాంతం రూపొం దింది.

ఎవరు ఎక్కడ జన్మించారో తెలియనప్పటికీ, ఎక్కడ ఎలా పెంపొందిందో తెలియనప్పటికీ ఈ సిద్ధాంతం తాలూకు చివరి రూపం అందరి మనసుల్లోనూ గాఢంగా నాటుకుంది.

మణియం తన అన్వేషణను చాలించాడు. ఒకనాటి ఉదయం అతడు తన జీతగాళ్ళనందరినీ బాటకాడ కయ్యల వద్దకు తీసుకొచ్చాడు. వాళ్లందరు పారలు, పలుగులు భుజాలపైన పెట్టుకుని వచ్చారు. బాటకాడ కయ్యల చుట్టూ లోతైన గోయి తవ్వారు. ఇద్దరు మనుషుల ఎత్తు ఉండే బండలను కొన్ని వందలు తెచ్చి కయ్యల చుట్టూ నాటారు. మనిషిగాని, కాళ్ళతో నడిచే మరి ఏ ప్రాణిగాని చొరబడ్డానికి వీలులేకుండా బండకు బండను ఆనించి నాటారు. మణియం స్వయంగా పర్యవేక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయించాడు. పూర్తయ్యేటప్పటికి పద్నాలుగెకరాల భూమి పైకప్పులేని పెద్ద సమాధివలె కనపడసాగింది.

మణియం తన బాధ్యతను నిర్వహించి, తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. ఆవుదూడల ఉదంతాన్ని మరచిపోయి, యథాప్రకారం తన కచేరి పనులలోను, వ్యవసాయపు పనులలోను మునిగిపోయాడు.

28

మూడు దశాబ్దాలు గడిచిపోయాయి. మొలకల పున్నమి ముప్పై సార్లు వచ్చి వెళ్లింది.

పద్నాలుగెకరాల బాటపక్కన కయ్యలు ఒక చిట్టడివిలా తయారయ్యాయి. ఆ చిట్టడివికి 'బక్కిరెడ్డి కాన' అనే పేరు

స్థిరపడింది. చుట్టూ ఇద్దరు మనుషుల ఎత్తుగల బండలుండడం వల్ల గత ముప్పై సంవత్సరాలుగా ఆ కానలో మనుషుల పాదాలుగాని, జంతువుల గిట్టలుగాని పడలేదు. కానలోని చెట్లు గత ముప్పై ఏండ్లుగా గొడ్డలి వేటునుగాని కత్తివేటును గాని ఎరుగవు. వివిధ రకాలైన చెట్లు, తీగలు నిర్నిరోధంగా పెరిగి ప్రబలమయ్యాయి. బాగి చెట్లు, తుమ్మచెట్లు, కానుగ చెట్లు, తంగేడు చెట్లు ఒకదాన్ని అధిగమిస్తూ మరొకటి పెరిగి ఆకాశాన్నంటడానికి ప్రయత్నిస్తున్నాయి. సూర్యుని ఎండగాని, చంద్రుని వెన్నెలగాని రెండడుగుల వైశాల్యం కన్న ఎక్కువగా నేలమీద పడడానికి వీలులేనంతగా ఆ వృక్షాల కొమ్మలు దట్టంగా వ్యాపించి ఉన్నాయి.

కనుచూపు మేరలో నలువైపుల వరిపొలాలు, చెరకు తోటలు, వేరుసెనగ చేలు ఉండగా, వాటిమధ్య 'బక్కిరెడ్డి కాన' మరుగుజ్జుల మధ్య మహాకాయుడివలె నిల్చుని ఉన్నది. అది అలా ఈనాటికి నిల్చుని ఉన్నది.

ఉపసంహారం

1

కొన్ని వేల సంవత్సరాల క్రితం రామరావణ యుద్ధం జరిగిందని, యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛబోయాడని, హనుమంతుడు సంజీవి పర్వతాన్ని మోసుకొచ్చాడని, అలసట తీర్చుకోవడానికి ఈ ఊరికి దక్షిణంగా ఉన్న గుండు పైన లిప్తకాలం కాలుమోపాడని, అతని పాదం తగిలిన గుండు పవిత్రమై పోయిందని గ్రామస్థులు నమ్ముతున్నారు. ఈ స్థలపురాణాన్ని గ్రామస్థులకు ఎవరూ చెప్పలేదు. దానిని వాళ్ళు ఉగ్గుపాలతో నేర్చుకున్నారు. అందులోని సాధ్యాసాధ్యాలను ప్రశ్నించేవారూ ఉన్నారు. ఆ ఉదంతం సందేహాలకు, ప్రశ్నలకు అతీతమైన దివ్యఘటనగా భావించి, మనస్ఫూర్తిగానూ, భక్తి భావంతోనూ నమ్మేవారూ ఉన్నారు. ఎవరు నమ్మినా నమ్మకపోయినా ఆంజనేయులు గుండు సాంస్కృతికంగానూ, నైసర్గికంగానూ మా గ్రామంలో శాశ్వత స్థానం ఏర్పరచుకున్నది. పూజారి నిత్యం గుండుకు పూజలు జరిపిస్తున్నాడు. గ్రామస్థులందరు కలిసి ఏడాదికొకసారి స్వామికి అభిషేకం చేయిస్తున్నారు.

2

కొన్ని శతాబ్దాల క్రితం ఈ ప్రాంతాన్ని ఏలిన పాళెగాడు మా ఊరికి ఉత్తరంగా చెరువు తవ్వించాడని, చెరువుకట్ట ప్రతి సంవత్సరం మార్మికంగా గండిపడిపోతూ ఉండేదనీ, పెండ్లికాని పిల్లను బతికుండగానే గండిలో పూడ్చిపెడితే కట్ట నిలుస్తుందని బాటగంగమ్మ చెప్పిందని, పాళెగాని కడగట్టు కూతురు చినమ్మ స్వచ్ఛందంగా గండిలో కూర్చుని జీవసమాధి అయిందని, ఆనాటి నుంచి చెరువుకట్ట ఒక్కసారి కూడా గండిపడలేదని గ్రామస్థులు నమ్ముతున్నారు. ఈ స్థల పురాణాన్ని గ్రామస్థులు తమ తాతలు, ముత్తాతలు చెప్పగా విని తెలుసుకున్నారు. అందులోని సాధ్యాసాధ్యాలను ప్రశ్నించేవారూ ఉన్నారు. ఆ ఉదంతం సందేహాలకు, ప్రశ్నలకు అతీతమైన ఒక దివ్యసంఘటనగా భావించి, మనస్ఫూర్తిగానూ, భక్తిభావంతోనూ నమ్మేవారూ ఉన్నారు. ఎవరు నమ్మినా నమ్మకపోయినా 'చినమ్మగుడి' మా గ్రామంలో సాంస్కృతికంగానూ, నైసర్గికంగానూ శాశ్వతస్థానం సంపాదించుకున్నది. ప్రతి శుక్రవారం చినమ్మకు పూజలు జరుగుతాయి. ఏడాదికొకసారి చినమ్మ జాతర జరుగుతుంది.

3

కొన్ని దశాబ్దాల క్రితం మా గ్రామంలో బక్కిరెడ్డి అనే అరవై ఏండ్ల రైతు తన పద్నాలుగెకరాల భూమిని సాగుచేసి బతుకుతూ ఉండేవాడని, ఆ భూమి జప్తులో అమ్ముడైపోయిందని, అమ్ముడైపోయిన ఆ భూమిని దున్నుతూ అతడు మరణించాడనీ,

అరవై ఏండ్లుగా శ్రమించినా తనకు మానంమీదకు గుడ్డ, కడుపులోకి సంగటిని కూడా సరిగా ఇవ్వని ఆ పొలంపైన, వృత్తిపైన అతడు పెంచుకొన్న మమకారాన్ని చూసి పంచభూతాలు అతనిని కర్మవీరుడుగా గుర్తించాయని, ఆ భూమి మరొకరి చేతికిందకు రాకుండా పంచభూతాలు శపించాయని క్రమంగా ఆ భూమి ఒక చిట్టడివిగా మారి 'బక్కిరెడ్డి కాన' అన్న పేరును సంతరించుకున్నదని గ్రామస్థులు నమ్ముతున్నారు. ఈ ఉదంతాన్ని గ్రామస్థులు కొందరు స్వయంగా చూసి జ్ఞాపకముంచుకున్నారు. మరికొందరు తమ తండ్రులు, తల్లులు చెప్పగా విని తెలుసుకున్నారు. అందులోని సాధ్యాసాధ్యాలను ప్రశ్నించేవారూ ఉన్నారు. అది సందేహాలకు, ప్రశ్నలకు అతీతమైన దివ్యఘటనగా భావించి మనస్ఫూర్తిగాను, భక్తిభావంతోనూ నమ్మేవారూ ఉన్నారు. ఎవరు నమ్మినా నమ్మకపోయినా 'బక్కిరెడ్డి కాన' మా ఊరిలో సాంస్కృతికంగా, నైసర్గికంగా శాశ్వతస్థానం సంపాదించుకుంది. పడమటివైపు నుండి గ్రామంలోకి ప్రవేశించేవాళ్లు కానను సమీపించగానే తమకు తెలియకుండానే తమ నెత్తుల మీది తలపాగాలను తీసివేస్తారు. తమకు తెలియకుండానే వాళ్ళ శిరసులు అవనతాలవుతాయి.

ఒంటిల్లు అను స్థావర జంగమాత్మక ప్రపంచం

"The object of the novelist is to keep the reader entirely oblivious of the fact that the author exists, even of the fact that he is reading a book"

- Ford Madox Ford

"If you try to nail anything down in the novel, either it kills the novel or the novel gets up and walks away with the nail".

- D.H. Lawrence *(walks)*

1

డాక్టర్ కేశవరెడ్డి నవలా ప్రపంచం గురించి నాకు తెలిసిన నాలుగు మాటలు దుస్సాహసం కొద్దీ చెప్పబోయే ముందు 'మూగవాని పిల్లనగ్రోవి' నవల చివరి మాటలు ఇక్కడ ప్రస్తుతిస్తాను. "పడమటి వైపు నుండి గ్రామంలోకి ప్రవేశించే వాళ్లు (బక్కిరెడ్డి) కానను సమీపించగానే తమకు తెలియకుండానే తమ నెత్తుల మీది తలపాగాను తీసివేస్తారు. తమకు తెలియకుండానే వాళ్ల శిరస్సులు అవనతాలవుతాయి"

కేశవరెడ్డి నవలలు చదివిన పాఠక ఆగంతకులకు కూడా ఆ బాటసారులకు కలిగిన అనుభవమే కలుగుతుంది. తమకు తెలియకుండానే వాళ్ల శిరస్సులు అవనతాలవుతాయి. తెలుగుభాష మాట్లాడే ప్రాంతంలో పుట్టి, తెలుగుభాష చదవడం వచ్చి, ఆ భాషలో నవలలు చదివిన వాడికి మున్నెన్నడూ కలగని అనుభవం కేశవరెడ్డి నవలలు చదివితే కలుగుతుంది. గొప్ప భావావేశం వారిని ముప్పిరిగొంటుంది. గాఢానుభూతుల ప్రకంపనలు వారిని వివశులను చేస్తాయి. వ్యాకులచిత్తులను చేయగల మహా సౌందర్యమేదో వారికక్కడ లభిస్తుంది. స్పర్శేంద్రియాలకు లోబడని అథోలోకాన్ని వారు అక్కడ మొట్టమొదటి సారి స్పృశిస్తారు. "మానవ సంబంధాలలోని రాక్షసత్వాన్ని, సృష్టి యొక్క నిరర్థకతను" భగవంతునిలా నిర్దయగా క్రూరంగా విపులీకరించే నిర్వికారుడైన రచయితను మీరక్కడ దర్శిస్తారు. రచయిత ముందు తమ కృతజ్ఞత వ్యక్తం చేసేందుకు మాటలు రాక, వచ్చిన మాటలు చాలక మరో మార్గం లేక వాళ్ల శిరస్సులు అవనతమవుతాయి.

మాటలతో, ఈ మామూలు మాటలతో చెప్పనలవిగాని దుర్భేద్యమైన ప్రపంచం గురించి, ఆ ప్రపంచాన్ని సృష్టించిన రచయిత గురించి, ఒక పాఠకునిగా, రచయిత కౌశలానికి రచనాపటిమకు దిగ్భ్రమ చెందిన సామాన్య పాఠకునిగా, గౌరవ భావంతో శిరసువంచి నాలుగుమాటలు చెబుతాను.

2

.... But outside there is the night, and thunder-storm, the absent sun, the father's death. 'చివరి గుడిసె'లో మణియం మన్నుగాడిని చావగొట్టి హత్య చేస్తే

'మూగవాని పిల్లనగ్రోవి'లో బక్కిరెడ్డిని ఆత్మహత్య (ప్రాయోపవేశం సరైన మాట) కు పురిగొల్పి హత్య చేస్తాడు. అదే ఒంటిల్లు, అదే మణియం. హతులు వేరైనా హంతకుడు ఒక్కడే. ఒక హత్య ప్రత్యక్షంగా చేస్తే, వేరొకటి పరోక్షంగా చేశాడు. అంతే తేడా. ఎక్కడొచ్చిందీ తేడా? ఈ తేడా ఎందుకొచ్చింది? రచయిత తన అన్ని నవలలు సొంత భూమిలేని, వుండే అవకాశం లేని యానాది, మాల తదితర అట్టడుగు కులాలలో పుట్టిన వృత్తి పనివాళ్ళు వ్యవసాయ కూలీల గురించి రాశారు. "మూగవాని పిల్లనగ్రోవి" ఒక్కటే ఇందుకు భిన్నం. పద్నాలుగు ఎకరాల మాగాణి భూమి వున్న అగ్రకుల రైతు బక్కిరెడ్డి కథ ఇది. కథగా మొదలై గాథగా, పురాణగాథగా ముగిసిన నవల ఇది. భారతదేశంలో కులానికి, వర్గానికి మధ్య వున్న అంతర్గత సంబంధాన్ని, దడిగట్టిన వర్గమే ఇక్కడ కులంగా రూపాంతరం చెందిందని అంబేద్కర్ ఆవిష్కరించిన చారిత్రక వైనాన్ని చెప్పక చెప్పిన రచనలుగా కేశవరెడ్డి నవలలను గుర్తిస్తే తప్ప ఆయన చెప్పిన, చూపిన అనేక సంక్లిష్టమైన అంశాలను అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఫ్యూడల్ సమాజం స్థానంలో నెలకొన్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని అటు రైతాంగం దృష్టికోణం నుంచి, ఇటు వ్యవసాయ కూలీల దృష్టి నుంచి లోతుగా తరచిచూడటం మూలంగా ఆయన నవలలు 'చారిత్రక విభాత సంధ్య'ను పరిపూర్ణంగా ప్రతిఫలించాయి.

వృత్తులు కోల్పోయి, బతుకుతెరువు కోసం మనుషులు ఏ పని చేతికందివస్తే ఆ పని చేసుకుంటున్న పరిస్థితుల్లో వృత్తులు ప్రాతిపదికగా ఏర్పడిన కులాలు క్రమంగా అంతరించిపోయి వర్గాలే మిగులుతాయనే 'సాధారణ జ్ఞానం' (సర్వసాధారణమైన విషయంగా సకలజనామోదం పొందిన ఈ అభిప్రాయమే చారిత్రక దృష్టి తమ సొత్తని భావించే మన మార్క్సిస్టు మేధావులు, రాజకీయ

ఉద్యమకారులకూ వుంది.) దృష్టికోణం నుంచి 'మూగవాని పిల్లనగ్రోవి', 'చివరి గుడిసె' నవలలను పరిశీలించాల్సిన అవసరం వుంది.

కేశవరెడ్డి తన అన్ని నవలలు ("సిటీబ్యూటిఫుల్" వదిలేస్తే) సొంతాస్తి లేని అట్టడుగు కులాలకు చెందినవారి గురించి రాస్తే ఒక్క 'మూగవాని పిల్లనగ్రోవి' మాత్రం సొంతాస్తి (వ్యవసాయ భూమి) వున్న రైతు గురించి రాశారనే వాస్తవాన్ని ఇక్కడ మనం మననం చేసుకోవాలి. కాలానుగతంగా వస్తున్న మార్పులను గురించిన కాలజ్ఞానం వున్న బైరాగి (వీరు దేశదిమ్మరులు. స్థిరాస్తి చరాస్తిలేని సంచారులు) పాత్రలకు కేశవరెడ్డి నవలల్లో వున్న ప్రాధాన్యతను కూడా మనం దృష్టిలో పెట్టుకోవాలి. 'చివరి గుడిసె' నవలలో మన్నుగాడికి కులవృత్తి చేసుకుని బతకడం తప్ప ఇంకొకటి తెలియదు. కులవృత్తి కాకుండా వేరే పనులు చేసుకోవచ్చనే జ్ఞానం అతనికి లేదు. అందుకే తన కొడుకు చిన్నోడిలో కనిపించిన భయం తాలూకు లక్షణాలు అతనికి మింగుడు పడవు. ప్రతిదానికీ చిన్నోడు భయపడటం, వాడి భయవిహ్వలత్వం అతనికి అసహజంగా కనిపిస్తాయి. "నువ్వు యానాదోని కడుపున పుట్టాల్సినోడివి కాదురా! యాడనో మారాజుల కడుపున పుట్టాల్సినోడివి" అంటాడు. కొడుకు స్వభావం అర్థంకాక. "కులరుత్తులకేఁవి సాంవీ లచ్చాపలచ్చలుండాయి. కానీ ఏది చేయాలన్నా ధైర్నం వుండాలగద" అంటాడు బైరాగితో. "కాలం మారతా వుంది గదన్నా! యానాదోళ్లు ఉడతల్ను, పాములు పట్టే బతకాలని ఏముంది. సేద్దింపన్లు చేసుకోవచ్చు గదా" అని బైరాగి చెప్పే మాటలు అతనికి అర్థం కావు. యానాదోనిలో వుండని, వుండకూడని భయం వున్నా చిన్నోడు బతగ్గలడని మన్నుగానికి నచ్చచెప్పడం ఇక్కడ బైరాగి ఉద్దేశం. కులసంబంధమైన వ్యక్తిత్వం,

పుట్టుకతో వచ్చే యానాది గుణగణాలు, లక్షణాలు కాలప్రభావం కొద్దీ అదృశ్యమైపోయి, భయం వంటి మానవ 'నాగరిక' లక్షణాలు చివరికి యానాదోనికి కూడా వస్తాయని చెప్పడానికి రచయిత చిన్నోని పాత్రను ఇక్కడ ప్రవేశపెట్టాడు. మనిషికి, అతని పరిసరాలకు మధ్య సంఘర్షణ లేనప్పుడు వుండే లక్షణాలు, సంఘర్షణ తలెత్తిన తరవాత క్రమంగా క్షణించి పోతాయని చెప్పడమే రచయిత లక్ష్యంగా భావించాలి. కులవృత్తి చేసుకుని బతికిన పాతతరానికి మన్నుగాడు చివరి ప్రతినిధి అయితే, పొట్టకూటికి మట్టిపని చేసుకుని బతికే కొత్తతరానికి చిన్నోడు మొదటి ప్రతినిధి అవుతాడు. బైరాగి సలహా మేరకు రోడ్డు నిర్మాణం పనిలో కాంట్రాక్టు కూలీగా చిన్నోడు చేరి కులవృత్తి గీసిన గీతను దాటేస్తాడు. అయితే కులం చిన్నోడిని అక్కడ కూడా వెంటాడుతుంది. యానాదోళ్లు దొంగలు కనుక, యానాదోడైన చిన్నోడిని పనిలో పెట్టుకోవద్దని మణియం మేస్త్రీని వారిస్తాడు. కానీ మేస్త్రీ మణియం మాటను ఖాతరు చేయడు. "వీడు దొంగయితే మనకేఁవి దొరైతే మనకేఁవి మునసబూ పన్జేసే సత్తా ఉండేవాడు గదా మనకు కావాల్సింది" అని చిన్నోడిని పనిలో పెట్టుకుంటాడు. ఊరి ఎల్లలు దాటితే, కులవృత్తుల రేఖ దాటితే విలువలు మారిపోతాయన్నది ఇక్కడ సూచన. "బ్రహ్మదేవుడు గీసిన గీతలే మారిపోతావుండాయి. వీళ్లు రాసిన రాతలు మారిపోవా?" అంటాడు బైరాగి ఒకసారి. బ్రిటిష్ ప్రభుత్వం గెజిట్‌లో యానాదుల వృత్తి దొంగతనం అని రాసి వుందని విన్నప్పుడు బైరాగి ఆశావహ దృష్టితో అన్న ఈ మాట నవలలో చివరికి అబద్ధమని రుజువవుతుంది. మణియం రాజ్యంలో బ్రహ్మదేవుడు, బ్రిటిష్‌వాడు గీసిన, రాసిన రాతలకు 'జవఁ' ఇంకాపోలేదు కనుక, దొంగతనం నేరం మోపి మణియం తండ్రీకొడుకులిద్దరినీ బలితీసుకుంటాడు. 'మణియం మన్నుగాడిని చావగొడితే, చిన్నోడు

చెట్టుకు ఉరేసుకున్నాడు. బైరాగి ఊరికి బయటివాడిగా కుక్క 'రాజి'ని ఉసిగొల్పి మణియం ప్రాణాలు తీస్తాడు. నిమ్నకులానికి, పేద వర్గానికి చెందిన మన్నుగాడి రెండెకరాల భూమి కాజేసిన మణియం, పంటను కాజేసిన నేరంపై (చేయని దొంగతనానికి) అతడిని క్రూరంగా హింసించి హతమార్చాడు. బైరాగి చేతిలో మణియం చావుఇక్కడ 'Poetic 'Justice'. 'చివరి గుడిసె'లో మణియం చావుతో సాధించిన న్యాయాన్ని రచయిత 'మూగవాని పిల్లనగ్రోవి'లో మణియం కాజేసిన బాటకాడ కయ్యలను బక్కిరెడ్డి కానగా, బీడు భూమిగా మార్చి సాధించాడు.

పుట్టుకే అంటే కులమే మనిషి జీవితాన్ని, మరణాన్ని శాసిస్తుందని 'చివరి గుడిసె' నిరూపించినట్లే, 'మూగవాని పిల్లనగ్రోవి' కూడా నిరూపిస్తుంది. అక్కడ తక్కువ కులం, ఇక్కడ ఎక్కువ కులం. అక్కడ ఆస్తి లేనివాడు, ఇక్కడ ఆస్తిపరుడు, 'చివరి గుడిసె'లో కుల, వర్గవైరుధ్యాలుంటే, 'మూగవాని పిల్లనగ్రోవి'లో కులవైరుధ్యం లేదు. ఉన్నదల్లా వర్గవైరుధ్యమే. అయినా వేలెత్తి చూపగల వర్గ శత్రువు లేడు. అందుకే 'చివరిగుడిసె'లో వున్న హింస, భౌతికమైన హింస, 'మూగవాని పిల్లనగ్రోవి'లో వుండదు. 'మూగవాని పిల్లనగ్రోవి'లో బక్కిరెడ్డి అనుభవించేది కనబడని హింస. అస్తిత్వవేదన. మనోవ్యధ, ఉనికిని కోల్పోవడం వల్ల తలెత్తిన నిరర్థకత్వం, నిర్వేదం. మృత్యువాంఛాసక్తత. ఆస్తి లేనివానికి, ఆస్తి వున్న (సంక్రమించిన) వానికి బహిరంగంలోనే కాదు, అంతరంగంలో కూడా తేడా వుంటుంది. తక్కువకులంలో పుట్టిన పేదవానికి రచయిత చేయాలనుకున్నా న్యాయం చేయలేడు. వాస్తవం అందుకు అంగీకరించదు. అదే పెద్ద కుటుంబంలో పుట్టిన రైతుకు చేయగలడు. జీవించివున్నప్పుడు చేయలేకపోయినా, మరణానంతరమైనా చేయగలడు. కులం, వర్గం అందుకు సమ్మతిస్తాయి. కేశవరెడ్డి బక్కిరెడ్డికి తనకిష్టమై,

వాస్తవవిరుద్ధంగా వెళ్లి, 'న్యాయం' చేయలేదు. వాస్తవానికి లోబడి మాత్రమే రచయిత బక్కిరెడ్డి నోట "ఏవిఁజేసినానో సూడు, కయ్యల్లోనే పడుకోనుండా. వేలును గోరుకాపాడినట్టు కయ్యల్ని కాపాడతా వుండా" అనిపించి తన తండ్రిని ఓదార్చగలిగేలా చేశాడు.

అప్పు కింద మణియం ,భూములను జప్తు చేసుకున్నాక బక్కిరెడ్డి ఎదలో సుడులు తిరిగిన అంతర్మథనాన్ని పరిశీలిస్తే భూమికీ రైతుకూ మధ్య వున్న అన్యోన్యత ఎంత గాఢమైనదో, ఆ ఎడబాటు రైతు అస్తిత్వాన్ని ఎంతగా కుంగదీస్తుందో తెలుస్తుంది. తనను పరామర్శించడానికి వచ్చిన బాల్య మిత్రులతో "నేను కాపోడయట్టయితి? సెంటు భూమి కూడా లేనోణ్ణి, నువ్వు నన్ను కాపోడు అనేదేవిటికి" అంటాడు బక్కిరెడ్డి. ఇది పైకి కనబడని రచయిత వర్గదృష్టి. దీనికి భిన్నంగా మిత్రుడు గంగిరెడ్డి "ఈ ఎర్రిమాటలు ఎక్కడ నేరిస్తివిరా? కాపు పుటక పుట్టినోడు కాపోడుగాక ఇంగేమవుతాడు!" అంటూ ఆశ్చర్యం ప్రకటిస్తాడు. ఇది కుల దృష్టి. 'ఏ పుటక పుట్టింది ఎవరు చూసినారు! ఇప్పుడు నేను కాపోడనేదానికి ఆనవాలు ఏ వుండాయి" అని బక్కిరెడ్డి తానిప్పుడు బికారోడినని చెప్పుకుంటాడు. "కయ్యలను నేనేటికి మొక్కబోనిస్తా. కంటిని రెప్ప కాపాడుకున్నట్టు కాపా డుకుంటా. నేను కాపోడికి పుట్టినానా దొమ్మరోడికి పుట్టినానా?" అని చనిపోబోతున్న తండ్రికి ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకో లేకపోయిన బక్కిరెడ్డి విషాదాంత గాథ ఈనవల. extended interior monologue లా సాగే ఈ నవల కథానాయకుడు బక్కిరెడ్డికి, త్రిపురనేని గోపీచంద్ నవల 'అసమర్థుని జీవితయాత్ర' కథానాయకుడు సీతారామ రావుతో, దోస్తవిస్కీ నవల 'క్రైవమ్ అండ్ పనిష్‌మెంట్' హీరో రాస్కల్నికోవ్‌తో పోలికలున్నాయి.

బక్కిరెడ్డి గాయపడిన మనస్సు(hurt ego)ను తృప్తి పరిచేందుకు పంచభూతాలు దిగివచ్చి, అతని పట్ల సహానుభూతి (empathy) కనబరిచి అతని కయ్యలను బీడు భూమిగా మార్చేస్తాయి. బీడు భూమిని, అటవీ ప్రాంతాన్ని, సాగు భూమిగా మార్చడంలో మనిషికి సహకరించిన పంచభూతాలే సాగుభూమిని తిరిగి బీడుభూమిగా, కానగా మారడానికి సహకరించాయి. రెండు సందర్భాల్లోనూ ప్రకృతిపై మనిషిదే పైచేయి అయింది. ప్రకృతి మానవీకరణ చెందడం, ప్రపంచానికి కేంద్రబిందువు మనిషేనని చెప్పడం ఇక్కడ కనిపిస్తున్నది. భూమి మీద మనిషికి వుండే ఎనలేని వ్యామోహం నిజానికి ఫ్యూడల్ హ్యాంగోవర్. బక్కిరెడ్డిలో ఈ హ్యాంగోవర్ పాజిటివ్ అంశగా రూపొందింది. మనిషి అమానుషత్వానికి ప్రకృతి మానుషత్వాన్ని దిద్దుకుంది. బక్కిరెడ్డి ఈ విధంగా మరణానంతరం కూడా కయ్యలకు యజమాని అయ్యాడు. బాటకాడ కయ్యలు కాస్తా బక్కిరెడ్డి కానగా మారాయి. భూస్వామ్య యుగంతో మనిషి మనుగడ ఎంతగా ముడివడి వుందో విశదం చేసిన ఈ నవలలో మానవ నిర్మిత సూత్రాలు ప్రకృతి చలన సూత్రాలంత అనుల్లంఘనీయంగా, స్వాభావికంగా కనిపిస్తాయి. కేశవరెడ్డి ఇతర నవలల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి. ప్రకృతి చలన సూత్రాలకు కట్టుబడి కథ జరుగుతున్నదా అనిపిస్తుంది. ఎక్కడా ప్రతిఘటన కనిపించదు. వాస్తవ జీవితంలో లేని ప్రతిఘటన నవలలో మాత్రం ఎలా వుంటుంది? బలాబలాల్లో హెచ్చుతగ్గులు ప్రతిఘటనకు, తిరుగుబాటుకు తావు లేనంత అధికస్థాయిలో వున్నాయనే వాస్తవాన్ని రచయిత విస్మరించలేదు కాబట్టే ఆదర్శాలను, ఆదర్శాలకు ఊడిగం చేసే కృతకమైన పాత్రలను ఆయన దరిచేరనివ్వలేదు. తన వాస్తవ జీవితంలోని సంక్లిష్టతలను అంతే వాస్తవంగా చిత్రించే వాస్తవికవాది కేశవరెడ్డి.

3

"Philosophy arises when we become aware

of our own weakness and helplessness"

- Epicterus

తాత్వికంగా డాక్టర్ కేశవరెడ్డి నియతివాది (*determinist*). సంకల్పానికి, స్వేచ్ఛాయుతమైన సంకల్పానికి (*free will*) ఆయన రచనల్లో చోటు లేదు. నియతివాదాన్ని విశ్వసించే రచయిత కావడం వల్లే ఆయన నవలలన్నీ విషాదాంతాలు (*tragedies*) అయ్యాయి. "మనిషి స్వేచ్ఛగా జన్మించాడు. కానీ సంకెళ్లలో వున్నాడు" (*Man is born free but is in chains everywhere*) అని రూసో చెప్పిన కాల్పనిక స్వేచ్ఛాభావననుఆయన నిర్దాక్షిణ్యంగా వ్యతిరేకిస్తాడు. రూసో మాదిరి, రూసో అంతేవాసుల మాదిరి ఆయన పెటీబూర్జువా కాదు కాబట్టే మనిషి పుట్టడమే సంకెళ్ళతో, మోయలేని పెనుభారంతో పుట్టాడని గ్రహించాడు. వాస్తవం నుంచి గతంలోకి, లేదంటే భవిష్యత్తులోకి పలాయనం చిత్తగించే భీరువు కాకపోవడం వల్ల కళ్లెదుట వున్న వాస్తవాన్ని యథాతథంగా స్వీకరించగల గుండె దిటవు ఆయన స్వభావంలో అంతర్భాగమైంది. మనిషిని దొడ్డిదారులు, గమ్యం తెలియని తోవలతో మభ్యపుచ్చడం, మోసగించడం నవలారచయితగా ఆయనకు గిట్టదు.

శ్రమ మనిషిని బానిసత్వం నుంచి విముక్తి చేయకపోవడమే కాదు, శ్రమకు తగిన ప్రతిఫలం కూడా మనిషి పొందడం లేదన్నది ఆయన తాత్విక భూమికలోని ప్రధానాంశం. శ్రమ నిష్ఫలం

కావడం, ఫలం దక్కకపోయినా నిరంతరం శ్రమించవలసిరావడం, చివరికి ఫలాపేక్ష లేని చిత్తవృత్తిని శ్రామికుడు అలవరచుకోవడం, ఫలాన్ని ఆశించని 'నిష్కామకర్మ' మనిషికి స్వాభావికం (*second nature*) కావడం, అంతరాంతరాలలో నుంచి ఆయన గమనించాడు. 'ఇనో క్రెడిబుల్ గాడెస్', 'స్మశానం దున్నేరు', 'అతడు అడవిని జయించాడు', 'మూగవాని పిల్లనగ్రోవి', 'చివరిగుడిసె' నవలలలోని అంతస్సారం ఇదే కావడం మనం చూడవచ్చు. 'రాముడుండాడు, రాజ్జిముండాది' లో కూడా ఇదే నేపథ్యం. అయితే ఈ నవలలో గ్రామంనుంచి పట్టణానికి కొత్త ఆశతో వలసపోవడం కనిపిస్తుంది. పట్నంలో వారికి (పుల్లిగాడు, పూజారి, కంసాలి, తిరుపాలనాయుడు తదితరులు) ఇంతకన్నా భిన్నమైన అనుభవం ఎదురవుతుందన్న ఆశ ఎవరికీ వుండనవసరం లేదనుకుంటాను.

అల్బర్ట్‌కామూ తన ప్రసిద్ధ గ్రంథం "మిత్ ఆఫ్ సిసిఫస్" లో ఈ అంశాన్నే ప్రతీకాత్మకంగా చర్చించాడు. గ్రీస్ దేశపు ఆదికవి హోమర్ ఇతిహాసాలలోని ఒక పాత్రపేరు సిసిఫస్. మూలకథలో దేవతలు సిసిఫస్‌కు ఒక శిక్ష విధిస్తారు. ఏటవాలుగా వుండే పర్వతం పైకి అతి పెద్ద బండరాయిని నెట్టాలి. నెట్టగా, నెట్టగా పర్వత శిఖరాగ్రానికి చేరిన బండరాయి అక్కడ చదునుగా లేక క్షణాల్లో కిందికి దొర్లుతుంది. నేలను చేరిన రాయిని తిరిగి పైకి నెట్టాలి. అది మళ్ళీ కిందికి దొర్లుతుంది. మళ్లీ నెట్టాలి, మళ్లీ దొర్లుతుంది. విరామం లేకుండా, విశ్రాంతి తీసుకోకుండా నిరంతరం ఈ పని చేయాల్సిందిగా సిసిఫస్‌ను దేవతలు ఆజ్ఞాపించారు. ఆజ్ఞను మీరలేడు. ఎందుకంటే అది శాపం. శాపవిమోచన లేదు. ఇరవయ్యవ శతాబ్దపు మానవుడు కూడా ఇదే గండాన్ని (*human predicament*) ఎదుర్కొంటున్నాడని కామూ నిర్ధారించాడు. సిసిఫస్‌లా నిష్ఫలమైన, నిరర్థకమైన శ్రమ చేస్తూ,

ఆ ఊబిలో దినదినం కూరుకునిపోతున్న మనిషి జీవితంలో అసంబద్ధత, అర్థరాహిత్యం చోటు చేసుకున్నాయని కామూ రోగనిదానం చేశాడు. కామూ చెప్పిన ఈ తత్వం ఛాయలు కేశవరెడ్డి నవలల్లో కనిపిస్తాయి.

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట ప్రాపంచిక దృక్పథంగా ఆమోదించే డాక్టర్ కేశవరెడ్డి తన నవలల్లో శ్రమ పరాయీకరణ (*Alienated Labour*) పర్యవసానాలపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించడం వల్ల సిసిఫస్ పురా గాథను పరిపరి విధాల ప్రతిఫలింపచేశారు. శ్రమ పరాయీకరణకు పరాకాష్ట అనదగిన సన్నివేశాన్ని ప్రేమ్‌చంద్ 'కఫన్' కథలో చిత్రించాడు. ఈ కథలో తండ్రీ కొడుకులు పుట్టుకతో దళితులు పనిచేసి ప్రయోజనం లేదు కనుక పనిచేయటం మానేస్తారు. చిల్లర దొంగతనాలు చేసి బతుకీడుస్తారే తప్ప పనిమాత్రం చేయరు. పని నిరాకరణకు గల కారణాలకు రచయిత ఇచ్చిన తాత్వికరూపం, విశ్లేషణ, శ్రమ పరాయీకరణపై అత్యంత నిశితమైన విమర్శ అని చెప్పవచ్చు. కేశవరెడ్డి నవలల్లోని పాత్రలు 'కఫన్' కథకు పూర్తిగా భిన్నంగా ఎల్లకాలం పనిలో నిమగ్నమై వుంటాయి. దోపిడీకి గురవుతూ అణచివేతను మౌనంగా భరిస్తుంటాయి 'ఇన్‌క్రెడిబుల్ గాడెస్' నాయకుడు రామచంద్రుడు మాత్రం పెదరెడ్డిపై నైతిక తిరుగుబాటు ప్రకటిస్తాడు.

శ్రమ దోపిడికి మనదేశంలో భగవద్గీత 'నిష్కామకర్మ' గా శాస్త్రరూపం ఇచ్చి, దానినొక సిద్ధాంతం చేసి, ఆ సిద్ధాంతాన్ని సకల జనులతో ఆమోదింప చేసింది. శ్రమ దోపిడీని ఒక సహజపరిణామంగా జస్టిఫై చేయడానికి ఇంత పెద్ద కుట్ర మరే ఇతర దేశంలో జరిగి వుండదని ఖచ్చితంగా చెప్పవచ్చు. యజమానికి, లేదంటే పెట్టుబడిదారుకు అంతులేని సంపద

సమకూరాలంటే *accumulation of capital* (*surplus value*) రూపంలో నిరాఘాటంగా కొనసాగాలంటే శ్రామికులకు "నిష్కామకర్మ సిద్ధాంతం" బోధించక తప్పదు. వర్ణ వ్యవస్థ దళిత బహుజనులతో కూడిన శ్రామికవర్గాన్ని దోపిడీ చేసేందుకు పీడనకు గురిచేసేందుకు, ఇలా ద్రోహచింతనకు పాల్పడింది. వర్గ సమాజం భారత దేశంలో ఇంతగా పాతుకుపోవడానికి, చెక్కు చెదరకుండా నిలిచి వుండటానికి కర్మ సిద్ధాంత భావజాలం ఉపరితలాంశమైనా గట్టి "పునాది" వేసింది. 'మూగవాని పిల్లనగ్రోవి' లో బక్కిరెడ్డి పొలంలో మరణించిన తరవాత, పురాణ గాథగా మారిన ప్రజాభిప్రాయం పంచభూతాల రూపంలో కర్మ సిద్ధాంతాన్నే ప్రవచిస్తుంది. " .... నీ రైతు పుటకను సార్థకం చేసుకునేందుకు, నీ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించేందుకు మాత్రమే నీవు శ్రమించావు. అలా ప్రతిఫలాపేక్ష లేకుండా శ్రమించిన నీవు కర్మ వీరుడవైనావు" అని అది బక్కిరెడ్డిని కీర్తిస్తుంది. కులంరీత్యా, వర్గంరీత్యా బక్కిరెడ్డి ఆధిపత్య స్థానంలో వున్నవాడు కావడంవల్ల ప్రజాభిప్రాయం పురాణ గాథగా మారేంత బలీయంగా రూపొందిన మాట నిజమే అయినా, ఆ 'ప్రజాభిప్రాయం' గీతాసారాన్ని ప్రతిబింబించడమే ఇక్కడ ప్రధానాంశం. సిసిఫస్ పురాగాథలో యథాతథ స్థితిని వ్యతిరేకించే పాజిటివ్ అంశ వుంటే కర్మ సిద్ధాంతంలో యధాతథ స్థితిని పూర్తిగా సమర్థించే నెగెటివ్ అంశ వుంది. గీతామృతం గ్రోలినవారు, దాని రుచి తెగమరిగిన వారు కేశవరెడ్డి నవలలను చదివి తప్పుడు వ్యాఖ్యానాలు చేయకుండా నివారించడానికి ఈ వివరణ ఇవ్వవలసి వచ్చింది.

కేశవరెడ్డి నవలా రచయితగా (*stoic*) యజమాని – బానిస సంబంధాలు స్థిరరూపం తీసుకున్న రోమన్ సామ్రాజ్యకాలంలో చారిత్రకంగా మనిషిలో *stoic consciousness* (నిర్వికార చేతన) ప్రతిఫలించిందని హెగెల్ చెబుతాడు. స్వీయత్మచైతన్యంతో కూడిన

స్వేచ్ఛ (*self conscious freedom*) తొలి చారిత్రక రూపమే *stoicism* అంటాడు హెగెల్. బలహీనత, నిస్సహాయతల గ్రహింపు నుంచి తత్వం జనిస్తుందని చెప్పిన ఎపిక్టెరస్ బానిసగా బతికాడు. ఈ తత్వశాఖకు ఆయనే ఆద్యుడు. కేశవరెడ్డి నవలల్లోని ప్రధాన పాత్రలన్నీ కూడా తమ బలహీనతను, నిస్సహాయతను గుర్తించి, శ్రమ ద్వారా సాధించిన లోపలి స్వేచ్ఛతో సంతుష్టి చెందుతాయి. సొంతాస్తి ఏ రూపంలోనూ లేని శ్రమజీవుల అంతరంగ చిత్రణే ఎపిక్టెరస్ ప్రవచించిన స్టోయిసిజం. కేశవరెడ్డి నవలలకు కూడా బలహీనులు, నిస్సహాయుల స్వేచ్ఛలేని జీవితాలే ఆలంబన. వెనకబడిన ప్రాంతాలకు చెందిన దళితులు, ఆదివాసులు, ఇతర అణగారిన వర్గాలు ఈనాటికీ *stoic mind* ని, నిర్వికారఅంతశ్చేతనను అధిగమించలేదనే కఠోర వాస్తవాన్ని కేశవరెడ్డి నవలలు స్పష్టం చేస్తాయి. ఈ చైతన్యం గురించి హెగెల్ మాటల్లోనే తెలుసుకుందాం.

"The stoic mode of existence seems to have overcome all the restrictions that apply in nature and society. The essence of this consciousness is to be free of the throne as well as fetters, throughout all the dependence that attaches to its individual existence" (phenomenology of mind) శ్రమ చేయడం ద్వారా సాధించిన అంతర్గత స్వేచ్ఛ ఇచ్చే మనోబలం ఒకవైపు, నిస్సహాయత, బయటిలోకంలో అస్వతంత్రత నుంచి ఏర్పడే నిర్వికార చిత్తవృత్తి, నిర్వేదం మరోవైపు ఈ *stoic consciousness* ను రూపుదిద్దుతాయి.

కేశవరెడ్డి నవలలో కనిపించే బైరాగులు బ్రహ్మంగారి ప్రతినిధుల మాదిరి కనిపిస్తారు. బ్రహ్మంగారు తమ కాలజ్ఞానంలో

విశదం చేసిన స్థావర జంగమాత్మక ప్రపంచం భావన కేశవరెడ్డికి అత్యంత ప్రియమైనదని చెప్పడానికి ఆయన పుస్తకాలే నిదర్శనం. భూమి కదులుతుంది, కానీ కదలదు. ప్రపంచం చలిస్తుంది. నిశ్చలంగా వుంటుంది,మారుతుంది మారదు. ఎక్కడున్నది అక్కడే వుంటుంది. ముందుకు కూడా పోతుంది. ఈ విరుద్ధాంశాల, వైరుధ్యభావనల సంఘర్షణ, సమ్మిశ్రమమే *(dialectic)* ప్రపంచం అని బ్రహ్మం గారే కాదు, గ్రీక్ ప్రాకృతిక తత్వవేత్తలు జీనో, పార్మినిడిన్, హెరాక్లిటస్‌ల నుంచి హెగెల్ వరకు ఎందరో చెప్పారు. నవలా రచయితగా కేశవరెడ్డి కూడా తమ నవలల్లో జీవితాన్ని,ప్రపంచాన్ని స్థావర *(static)* జంగమాత్మక *(dynamic)* మైనదిగా చిత్రించాడు."మూగవాని పిల్లనగ్రోవి", "రాముడుం డాడు", "రాజ్జిముండాది","చివరి గుడిసె"వంటి నవలల్లో ఆయన బ్రహ్మంగారు కాయిన్ చేసిన ఈ పదబంధాన్ని తరచువాడతారు.

ప్రపంచానికి జంగమాత్మక గుణంకన్నా స్థావర గుణమే హెచ్చు అని కేశవరెడ్డి భావిస్తారనడానికి కూడా ఆయన రచనలు సాక్ష్యం పలుకుతాయి. కేశవరెడ్డి నవలాప్రపంచాన్ని 'జీనోబాణం' *(Zeno's arrow)* తో పోల్చవచ్చు. కేవలసత్తా *(being)* కదులుతున్నట్టు కనిపించినా అంతిమంగా అది నిశ్చలం, అచలం అన్నది 'జీనో బాణం' ప్రతీక సారాంశం. కేశవరెడ్డి నవలలు చిత్రించే ప్రపంచంలో కూడా చలనం దాదాపుగా వుండదు. అదెక్కడికి పురోగమించదు. ఉన్నచోటనే వుంటుంది. అంతేకాదు. *His world hangs on the threshold of nihilism.* నీషే నిహిలిజాన్ని ఇలా నిర్వచించాడు. *"Existence, such as it is without sense or goal, but inevitably recurrent without a finale in nothingness - the eternal recurrence, that is the extremist form of nihilism: nothingness forever"* కాము చెప్పింది కూడా ఇదే.

నిహిలిజం ఒక సిద్ధాంతం కాదు,దృక్పథం అంతకన్నా కాదు. నిహిలిజం మన జీవన గమనంలో వుంది. జీవితంలో నెలకొన్న ప్రతిష్ఠంభనలో, నిష్ఫలత్వంలో, శూన్యావరణంలో, అన్ని విలువలు నశించడంలో, ప్రపంచ పురోగమనం స్తంభించడంలో, దిశను కోల్పోవడంలో, ఎక్కడా, ఏమీ సంభవించక పోవడంలో, ముదురుతున్న వ్యాధిని గుర్తించక పోవడంలో, బలవన్మరణంలో, మనిషి అనాలోచనలో, క్రియా శూన్యతలో, పలాయనంలో, సౌభ్రాతృత్వం అదృశ్యమవడంలో వున్నది. నిహిలిజం *human choice* కాదు, *theoretical option* అసలే కాదన్నది ముందు మనం గుర్తిస్తే, ఆ మాట చెవినపడగానే ఉలిక్కిపడే, భయపడే బాధ తప్పుతుంది.

కేశవరెడ్డి నవలల్లో ఏంజరుగుతుందో మీరెప్పుడైనా జాగ్రత్తగా గమనిస్తే, ఆ నవలల్లోని మృత్యుశీలత స్పర్శ, శైథిల్యం, నిర్దయ, దుర్బలత్వం, ఆటవిక నీతి *anonymity, lost innocence, disenchantment, desolation, solitude, violence, death, devastation, fatalism* మీ అనుభవంలోకి వస్తే నిహిలిజానికి మీరు భయపడరు. ఎందుకంటే ఆ నవలల్లో వున్నదే *nihilist reality.* ఆయన ఆ వాస్తవాన్ని మనలా భయపడకుండా, ధైర్యంగా, వెనకడుగు వేయకుండా, ఉన్నదున్నట్టుగా మన కళ్ళముందుంచాడు. చూడండని మనకు చూపెట్టాడు. యావత్ వ్యవస్థను దోషిని చేసి భోనెక్కించాడు చూడండని. చూడకపోతే ఆ తప్పు మనది.

నీషేనే నిహిలిజాన్ని మూడుదశలుగా విభజించాడు.

1. Nihilism will have to be reached first, when we have sought in all events a 'meaning' that is not there.

2. Nihilism as a recognition of the long waste of strength.

3. Nihilism (nihilist) realizes that becoming aims at nothing and achieves nothing.

ఈ మూడుదశలూ (లేని అర్థాన్ని వెదకి వేసారిపోవడం, చేసిందంతా వృథా, బూడిదలో పోసిన పన్నీరని గుర్తించడం, గమ్యం లేకపోవడం, దేన్నీ సాధించలేక పోవడం) కేశవరెడ్డి నవలల్లో కనిపిస్తాయి. ప్రయత్నించి చూడండి.

వీరబ్రహ్మంగారి శిష్యుడు సిద్దయ్య "రాముడుండాడు, రాజ్జిముండాది" లో ఒక బైరాగి మాటల్లో పరోక్షంగా ప్రత్యక్షమై చెప్పిన మాటలను ఇక్కడ ఉదహరిస్తాను. గురువు ఆజ్ఞమేరకు సిద్ధయ్య ఐదేళ్ళపాటు లోకసంచారం చేసి, మఠానికి తిరిగి వస్తాడు. వచ్చి తానేం నేర్చుకున్నదీ బ్రహ్మం గారికి చెబుతాడు.

"లోకం ఎవునిలోకం వానిదిగా వుంది సాఁవి. ఇంత లోకం తిరిగి నేను తెల్సుకునింది. ఇదొక్కటే". ఒకరికొకరు అర్థంకాని, ఒకరినొకరు పట్టించుకోని, ఒకరినొకరు కలిసినంతలోనే విడిపోయే లోకాన్ని, ఎవనిలోకం వానిదిగా వున్నలోకాన్ని సిద్దయ్యమాదిరే అర్థంచేసుకుని, పట్టించుకున్న రచయిత కేశవరెడ్డి.

4

"Novel becomes the epic of a world from which God has departed"

- George Lukacs

"Many of our writers seem more inclined to use their minds, rather than their eyes and ears. In other worlds, there is a marked tendency to avoid concrete observation"

- Satyajit Ray

సైజులో కాకుండా స్పిరిట్‌లో పాఠకునిపై వుండే ప్రభావంలో కేశవరెడ్డి నవలలు ఎపిక్స్‌కు వుండే నైసర్గికతను, విస్తృతిని, వైశాల్యాన్ని సంతరించు కున్నాయి.

సత్యజిత్ రే చెప్పినట్టు, మన తెలుగు నవలా రచయితల మాదిరి బుద్ధిని ఉపయోగించి, భావాలతో కిక్కిరిసి వుండే అమూర్తనవలలు రాయకుండా పంచేంద్రియాలతో మూర్తిమంతమైన నవలలు రాసినవాడు కేశవరెడ్డి. నామినిలా, పతంజలిలా, కేశవరెడ్డి రచనలు కూడా *fiction built from knowledge of language. Intensive use of language* ద్వారా ఆయన అల్పాక్షరములతో అనల్పార్థాన్ని సాధించాడు. భాషను స్వయంప్రతిపత్తిగల ప్రపంచంగా చూడటం వల్ల భాష వాహకంగా ప్రపంచాన్ని దర్శించడం వల్ల, భాష *impersonality* ని గుర్తించడం వల్ల, ఈ ముగ్గురు రచయితలకు ఈ యిద్ది అబ్బింది. భాష గురించి ఫ్రెంచ్ సాహితీ విమర్శకుడు *Maurice Blanchot* ఏమంటున్నాడో చూడండి. *"Language has neither a speaker, nor a listener, It speaks and writes by itself, it is a kind of consciousness without a subject."* నవలా రచయిత కూడా మనిషి (*subject)* గా అదృశ్యుడై, చైతన్యంగా, *hollow reed* గా ప్రవహిస్తే, భాష అతని గుండా అవాంతరాలు లేకుండా వెలువడి తననుతాను వ్యక్తం చేసుకుంటుంది. అప్పుడుగాని *Blanchot* చెప్పిన పద్ధతిలో భాష వ్యక్త రూపం

తీసుకోదు. కేశవరెడ్డి ఈ పద్ధతిలో దాదాపుగా విజయం సాధించాడని చెప్పవచ్చు. *Blanchot* నిర్వచనం నామినికైతే సరిగ్గా అతికినట్టు సరిపోతుంది.

తన ప్రాంతానికి, జిల్లాకు, పుట్టిన ఊరికి పరిమితమవుతూనే, అయినట్టు కనిపిస్తూనే, రహస్య సొరంగ మార్గాల ద్వారా తన పాఠకులను ఏమాత్రం సురక్షితం కాని అపరిమితత్వానికి, అమితత్వానికి, మునుపెన్నడూ కనీ, వినీ, ఎరగని భయానక, అద్భుత ప్రాంతాలకు తీసికెళ్లే ఇంద్రజాల యిద్దిలు ఈ రచయిత ఎక్కడ నేర్చుకున్నట్టు?

బాల్యం నుంచి తాను వింటూ వచ్చిన, మాట్లాడుతూ వచ్చిన స్థానిక భాషతో పాటు 'ఇంచుక' శిష్ట వ్యవహారికాన్ని తన రచనల్లో ఈ రచయిత ఎందుకు చిలకరిస్తున్నట్టు? ప్రామాణిక భాషగా చలామణీలో వున్న భాషమీది అయిష్టంతో, అగౌరవంతో పాతరుచులు, వాసనలు వున్న భాష, చిన్ననాడు చదివిన పాత పుస్తకాలలోని భాష *inarration* కు *Interior monologue* కి వాడుతున్నాడా! అంతే కావాలి. *Narration* ను 'ఒకింత' *elevate* చేయడానికే ఇలా చేస్తున్నాడా! చదువరిపై గాఢ ముద్ర వేయడానికి, పాత మాటలతో కూడిన వాక్య నిర్మాణంతో అసౌకర్యానికి గురిచేసి, నెమ్మదిగా దారికి తెచ్చుకోవడానికి రచయిత తనకు తానుగా కనిపెట్టిన ఈ నిర్మాణ సూత్రాన్ని పాటిస్తున్నాడనుకోవాలి. సూక్ష్మంగా పరిశీలిస్తే పతంజలి, నామిని రచనల్లో కూడా ఇదే విధంగా విస్మృతపదాలు కనిపిస్తాయి. అభివృద్ధి చెందని వెనకబడిన ప్రాంతాలకు (రాయలసీమ, తెలంగాణా, ఉత్తరాంధ్ర) చెందిన రచయితల రచనల్లో శిష్ట వ్యవహారికంలా తోచే పాతభాష దొర్లడం బహుశా సహజ పరిణామం కావచ్చు.

Levi Strauss చెప్పినట్టు పురాణగాథకు రచయిత వుండనట్టే, 'మూగవాని పిల్లనగ్రోవి'కి కూడా రచయిత లేడు. *Myths* కు *author* లేనట్టే, ఈ నవలకు కూడా *author* లేడనిపిస్తుంది. లేడనిపించేలా రాయడం వల్ల, పురాణ గాథ శిల్పాన్ని మౌలికంగా సంతరించుకోవడం వల్ల ఈ నవలకు ప్రాచీస్మృతి స్థాయి చేకూరింది.

Flaubert, Kundera లు చెప్పినట్టు, తన రచన వెనక అదృశ్యం కావడం ద్వారా, నవల *wisdom* కి తలవంచి తన అభిప్రాయాలు, విశ్వాసాలు, ఉద్దేశాలతో నవలల్లో చిత్రితమైన జీవిత వాస్తవికతను వక్రీకరించకుండా వుండటం ద్వారా, తన ఇంటెలిజెన్స్‌ను నవలకు ధారపోసి తాను బేలగా మిగిలిపోయి రచయితగా, తన 'ఉనికి'కి ఆనవాళ్లు సైతం లేకుండా చేయడం ద్వారా కేశవరెడ్డి ఈ అపూర్వ విన్యాసాన్ని సాధించారు.

నవలలను విషాదాంతాలుగా తీర్చిదిద్దడానికి రచయిత తన ప్రతినవలలో అనివార్యతను, ఏదెప్పుడైనా జరగవచ్చుననే భ్రాంతిని, జరగాల్సి వున్నదే జరుగుతున్నదనే అనుభూతిని సృష్టించాడు. "అదలా జరిగి వుండకపోయివుంటే ఇదిలా అయివుండక పోయేది" వంటి పునరాలోచనకు ఆయన తావు ఇవ్వడు. ఏదో ఒక సంఘటన జరిగితే కథ ఇక్కడ మలుపు తిరుగుతుందనే భావాన్ని మనలో కలిగించడు. తద్వారా అంతాముందే నిర్ణయించిన ప్రకారం, చాన్స్‌కు అవకాశం లేని విధంగా జరిగిపోతుంది. మానవ ప్రయత్నానికి, చాన్స్ ఎన్‌కౌంటర్‌కు, దైవికతకు ఎంత మాత్రం ఆస్కారం కల్పించడు. చివరన ధ్వంసం కావడంలోనే మానవజన్మ సార్థకత పొందుతుందనే విషాదాంత కావ్యాలు, నాటకాల మూలసూత్రాన్ని తు.చ. తప్పకుండా అమలులో పెడతాడు. అక్కడితో ఆ నవల

ముగుస్తుంది. ఇది ఆయన అన్ని నవలల్లో గోచరించే అంతర్ నిర్మాణం. దీనినే మనం నియతివాదం అన్నాం. మెల్విల్ 'మొబీడిక్' హీరో అహబ్ చేసిన అన్వేషణలో తిమింగలం క్రమంగా అప్రధానమైపోయి, అన్వేషణ ఇచ్చే అనుభవం ఎలా ప్రధానమైందో, కేశవరెడ్డి నవలల్లో కూడా లక్ష్యసాధనకన్నా అందుకు చేసే పోరాటం ప్రధానమవుతుంది. ఇదీ ఓ విధమైన నియతివాదమే. పరిస్థితులకు ఎదురొడ్డినా, తలవంచినా స్థితప్రజ్ఞత అనిపించే స్థిరచిత్తం ఆయన అన్ని పాత్రల్లో మనం చూస్తాం.

'మూగవాని పిల్లనగ్రోవి' నవలలోనే కాదు, మిగిలిన నవలల్లో కూడా రచయిత ప్రతి సన్నివేశాన్ని దృశ్యమానం చేస్తారు. "*Writing as showing*" కి కేశవరెడ్డి నవలలను మించిన దృష్టాంతం తెలుగులో మరొకటి లేదు. అన్నీ పాఠకుల కళ్లముందే జరుగుతాయి. పాఠకుడు ప్రతి కథనానికి ప్రత్యక్ష సాక్షి అవుతాడు. ప్రేక్షక పాత్రను దాటి దృశ్యంలో పాత్రగా, కథలో భాగస్వామిగా లీనమైపోయే పరిస్థితిని రచయిత కల్పిస్తాడు. ఈ విధంగా ఆయన ప్రతి నవల ఒక దృశ్యకావ్యంగా, స్క్రీన్‌ప్లేగా రూపుదిద్దుకుంది. కేశవరెడ్డి నవలలతో విషయపరంగానే కాక రూపపరంగా కూడా గొప్ప సినిమాలు తీయవచ్చు. స్క్రీన్‌ప్లే మళ్లీ రాసుకోనవసరం లేనంత గొప్పగా వుంటాయి ఆయన నవలలు. భావాలతో (ideas) పోలిస్తే మనుషుల పేర్లు, ఊర్లపేర్లు, రంగులు, వర్ణనలే కాదు చివరికి అంకెలు కూడా గొప్పవన్న హెమింగ్వే అభిప్రాయంతో ఏకీభావం వున్నందునే ఆయన ఇంత గొప్ప నవలలు రాయగలిగారా! హెర్మన్ మెల్విల్, జాక్ లండన్, గోర్కీ (కథకుడు) నికోస్ కజాంట్జకిస్ (జోర్బాది గ్రీక్ నవల) హెమింగ్వే వంటి రచయితలతో పోల్చదగిన నవలా రచయిత కేశవరెడ్డి. ఆంద్రీతార్కొవిస్కీ 'సాక్రిఫైజ్' సినిమా చూసినప్పుడు కలిగిన భీతావహమే 'మూగవాని పిల్లనగ్రోవి', 'చివరి గుడిసె' నవలలు

చదివినప్పుడు కలిగింది. బి.వి. కారంత్ 'చోమనదుడి' చూసినప్పుడు, దాగర్ బ్రదర్స్ 'రుద్రవీణ' విన్నప్పుడు, కుమార్ సహానీ 'ఖయాల్ గాథా' చూసినప్పుడు కలిగే వివశత్వం కేశవరెడ్డిని చదివినప్పుడూ కలుగుతుంది. హబీబ్ తన్వీర్ నాటకం, రిత్విక్ ఘటక్ సినిమా ఆయన నవలలకు దగ్గరగా వుంటాయి. "*Man ought not to know more of a thing than he can creatively live upto*" అని నీషే ఏనాడో చెప్పిన గొప్పసత్యాన్ని అప్రయత్నంగా ఆచరిస్తున్నందువల్లే కేశవరెడ్డి నవలా వ్యాసంగాన్ని తపస్సులా దీక్షగా నిర్వర్తిస్తున్నారనుకోవాలి.

మాలల, యానాదుల జీవితాలను, జీవన సంక్షోభాలను ఓటమిని రచయిత సహానుభూతి (*empathy*)తో ఎంత గొప్పగా చిత్రించారో, 'కాపాయన' (బక్కిరెడ్డి) జీవితాన్ని అంతకన్నా గొప్పగా, అద్భుతంగా (అద్భుతం అనిపించేలా), ముందుకన్నా మిన్నగా చిత్రించారు. 'మూగవాని పిల్లనగ్రోవి'ని రచయిత స్వీయానుభూతితో రచించడమే ఇందుకు కారణం కావచ్చు. 'చివరి గుడిసె'తో సహా ఇతర అన్ని రచనలలో ('అతడు అడవిని జయించాడు' కొంత వరకు ఎక్సెప్షన్) బీభత్సరసం ప్రధానమైతే, 'మూగవాని పిల్లనగ్రోవి'లో బీభత్సరసానికి కరుణ రసం తోడైంది. 'చివరి గుడిసె'తో సహా మరే ఇతర నవలలో లేని నిర్మాణం 'మూగవాని పిల్లన గ్రోవి'లో మాత్రమే ఎందుకుంది! *Protagonist* ఇక్కడ రచయిత కుటుంబానికి చెందినవాడు కావడం వల్లే ఇతివృత్తంలోనే కాక, రూపంలో కూడా 'మూగవాని పిల్లనగ్రోవి' *break through* సాధించి కొత్తపుంతలు తొక్కిందా!' 'ఇన్‌క్రెడిబుల్ గాడెస్' నుంచి 'చివరి గుడిసె' వరకు ఏ నవలలో లేని ప్రయోగాంశ, *Mythopoesy* వైపు బలీయమైన ఆకర్షణ, 'మూగవాని పిల్లనగ్రోవి'లోనే ఎందుకు బలంగా ముందుకొచ్చాయి! రచయిత ఈ నవలలను పరిపూర్తిగా స్వీయానుభూతితో

రాయకపోయినా, సహానుభూతితో మొదలై స్వీయానుభూతి దశను చేరుకున్నందువల్లే ఈ అనన్య సాధ్యమైన నవల జనించిందా? అంతే అనుకోవాలి. శరీరధర్మాలను నిలువరించగల శక్తి ఈయన రచనలకు వుంది. గొంతెండి పోవడం, గుండె బరువెక్కడం, రక్తనాళాల సంకోచం వంటి లక్షణాలు మనలో పొడచూపుతాయి. కేశవరెడ్డి నవలా పఠనం మనలో నిశ్శబ్ద విస్ఫోటనం కలుగజేస్తుంది. తద్వారా అంతస్సును క్షాళన చేస్తుంది. మనిషిలో పేరుకుపోయి పెచ్చులుకట్టిన మాలిన్యాన్ని కడిగివేస్తుంది.

రోగనిరోధక శక్తిని సమకూర్చి జరారుజాగ్రస్థుడైన మానవునికి ఆరోగ్యాన్ని ప్రదానం చేసే దేశీయ వైద్యుడు డాక్టర్ కేశవరెడ్డి.

– అంబటి సురేంద్రరాజు

హైదరాబాద్

19.06.1996.



బక్కిరెడ్డి మరణం మొదట ఒక జాలి కబురుగా, ఆపై క్రమంగా ఒక వీరగాథగా, చివరికి పంచభూతాలు అతనికి అనుగ్రహించిన వరప్రదానంగా, ఇదంతా ఒక స్థల పురాణంగా రూపొందటం.... ఇదొక రైతు మరణ, పునరుత్థానాల గాధ. ఈ కథలో పురాతన ఆసియా కథన సంప్రదాయాన్ని పాటిస్తూ, ఆదిమ జాతుల విశ్వాస ధోరణిలో చెప్పే నేర్పు వల్ల ఇంతదాకా తెలుగు సాహిత్యంలో మనం విని ఉండని అపూర్వ కథనాన్ని ప్రదర్శించారు రచయిత.

–వాడ్రేవు చినవీరభద్రుడు.

పురాణగాథకు రచయిత వుండనట్టే, 'మూగవాని పిల్లనగ్రోవి'కి కూడా రచయిత లేడు. Myths కు author లేనట్లే ఈ నవలకు కూడా లేడనిపిస్తుంది. తన ఇంటిలిజెన్స్‌ను నవలకు ధారపోసి, తాను బేలగా మిగిలిపోయి రచయితగా, తన 'ఉనికి'కి ఆనవాళ్లు సైతం లేకుండా చేయటం ద్వారా కేశవరెడ్డి ఈ అపూర్వ విన్యాసాన్ని సాధించారు.

– అంబటి సురేంద్రరాజు